# నేటిధాత్రి
TELUGU DAILY

20 YEARS ANNIVERSARY

వసంతాల అక్షరోద్యమం

మంగళవారం 16-07-2024 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 20 సంచిక : 89 రూ॥ 6.00







# విజన్ లీడర్..విజనరీ వెల్ఫేర్!




- చంద్రబాబు నోట తర తరాలు గుర్తుంచుకునే మాట.
- నాయకులం కాదు సేవకులం.
- తెలుగు దేశంలో పాదాభివందనాలకు స్వస్తి.
- మంత్రులకు, ఎమ్మెల్యేలకు కీలక ఆదేశాలు.
- కార్యకర్యలకు నిత్యం అండగా వుండాలి.
- ప్రజాసేవలో ఆదర్శంగా వుండాలి.
- అమరావతిని గొప్పగా అభివృద్ధి చేయాలి.
- తెలుగు నేల పులకించిపోవాలి.
- ప్రగతిలో ఏపి పరుగులు.
- రాజకీయంగా కొత్తఒరవడులు.
- నెలలోనే అద్భుతాలు!
- రోజుకో గొప్ప కార్యక్రమం.
- ఐదేళ్ళలో ఏపి మహాద్భుతం.
- గతంలో ఎవరూ చేయలేదు.
- భవిష్యత్తులో చూడలేము.
- ఔడేటెడ్ లీడర్ అన్న వాళ్ల నోర్లు మూయబడ్డాయి.

చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేంద్రరావు
9063524196, 9908658888

## దటీజ్ సిఎం. చంద్రబాబు నాయుడు అంటున్న "అనిమిని రవినాయుడు" నెల రోజుల పాలనపై అందించిన అద్భుతమైన విశ్లేషణ ఆయన మాటల్లోనే...

హైదరాబాద్,నేటిధాత్రి:

సహజంగా ఒక కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నిజమైన పనులు మొదలు కావడానికి అభివృద్ధి పట్టాలెక్కడానికి కనీసం ఓ మూడు నాలుగు నెలలు పడుతుంది. ప్రగతి పరుగులు పెట్టాలంటే ఓ ఏడాది పడుతుంది. కాని అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే అభివృద్ధి నమూనాలు, ప్రగతి వేగం అందుకోవడం అంటే ఒక్క చంద్రబాబు నాయుడు వల్లేనే అవుతుందనేది అక్షర సత్యం. గత అనుభవాలతోపాటు, అంకిత భావం వున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. తెలుగు నేల అంటే ఆయనకు ప్రాణం. తెలుగు జాతి అంటే ఆయనకు ఎంతో గౌరవం. తెలుగు ప్రజల ప్రగతి ఆయనకు ఎంతో ముఖ్యం. ఇష్టం. తెలుగు ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ఆయన రాజకీయాల్లో వేసిన అడుగులు చరిత్రలో ఒక సువర్ణాక్షరాలు లిఖించబడతాయి. సహజంగా ఏ నాయకుడైనా ఎదిగే అవకాశాలు వచ్చినప్పుడు మరో మెట్టు ఎక్కాలని చూస్తారు. రాజకీయంగా తన భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని చూస్తారు. కాని తెలుగు నేల తప్ప రాజకీయంగా మరో వైపు చూడని ఏకైక ఆదర్శవాది చంద్రబాబు నాయుడు అంటున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , తిరుపతి పట్టణ తెలుగుదేశం పార్టీ నేత అనిమిని రవి నాయుడు నేటిధాత్రి ఎడిటర్ కట్టా రాఘవేంద్రరావుకు వెల్లడిస్తున్న ఆసక్తికరమైన విషయాలు ఆయన మాటల్లోనే...

**అధికారంలోకి వచ్చిన మరునాటి నుంచే తన పాలన మొదలు పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి రోజే 16,347 పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ వేసి ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేర్చారు.**

ఉమ్మడి రాష్ట్రంలో కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అనేక సార్లు డిఎస్సీ వేసి, కొన్ని లక్షల మంది ఉపాధ్యాలతో ప్రభుత్వ విద్యను పేదలకు దరి చేర్చిన పాలకుడు చంద్రబాబు. అప్పట్లోనే ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 45వేల ఖాళీలతో 1997లో మెగా డీఎస్సీ వేసి ప్రభుత్వ విద్యపై ఆయనకు వున్న మక్కువను తెలియజేశారు. ఉమ్మడి రాష్ట్రంలోని అనేక అప్పర్ ప్రైమరీ స్కూళ్లన్నింటినీ హైస్కూళ్లుగా మార్చిన ఘనత చంద్రబాబు నాయుడిది. అంతే కాదు ఏకోపాధ్యాయ పాఠశాల స్థానంలో ప్రైమరీ స్కూళ్లుగా అప్ గ్రేడ్ చేసి పల్లెల్లో విద్యా వికాసాన్ని నింపిన పాలకుడు చంద్రబాబు నాయుడు. పేదలకు విద్యను చేరువ చేయడంలో ఆయన పోషించిన పాత్ర ఎవరూ పోషించలేదని చెప్పాలి. ఇక ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంతకు ముందు నెల ఫించన్‌తోపాటు, ప్రస్తుత నెల పించన్ కూడా కలిపి రూ. 7వేల రూపాయలు అందజేయడంతో ప్రజల్లో నెలకొన్న ఆనందం అంతా ఇంతా కాదు. అవ్వా, తాతలు ఆ డబ్బులను చూపిస్తూ మురిసిపోయారు. తమ ఆకలికి, ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది వుండదన్న సంతోషం వారిలో వెల్లివిరిసింది. చంద్రబాబును తెలుగు నేల వేనోళ్ల కొనియాడింది. అదే సమయంలో దివ్యాంగులకు పెన్షన్ రెట్టింపు చేస్తామనిచెప్పారు. రూ. 6000వేలు అందించారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారానే ఇంటి వద్దకు వెళ్లి పించన్లు పంపిణీ చేయించారు. ఇక ఏపి రాజకీయాల్లోనే ఒక సంచలనం నమోదు చేశారు. గత ప్రభుత్వంలో

పూర్తి వార్త 12లో

నిర్భయమైన వార్తల నిజరూపం

# నేటిధాత్రి ®

20 YEARS ANNIVERSARY

వసంతాల అక్షరోద్యమం

TELUGU DAILY

మంగళవారం 16-07-2024 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 20 సంచిక : 89 రూ॥ 6.00

## రూ.7లక్షల కోట్ల అప్పుతో అధికారంలోకి వచ్చాం..

**ఖమ్మం,నేటిధాత్రి:**
గత పది సంవత్సరాలుగా పాలించిన ప్రభుత్వం గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేడు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రామానికి వెళ్లిన మౌలిక వసతులపై దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేద వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం వీలైనంత తొందరగా నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ధనిక రాష్ట్రం అని చెప్పుకున్న గత ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమైందన్నారు. గ్రామాలను



తీర్చిదిద్దే బాధ్యత ఈ ప్రభుత్వం కచ్చితంగా చేస్తుందన్నారు.

# స్థానిక ఎన్నికల్లో





# బీసీ రిజర్వేషన్ల పెంపు

### పంచాయతీ ఎన్నికలపై సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్,నేటిధాత్రి:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంచాయతీల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. గత పంచాయతీ ఎన్నికల అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు సీఎం రేవంత్‌కు వివరించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని సీఎం అధికారులను ప్రశ్నించారు. కర్ణాటకలో 2015 లో, బిహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేసిన వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు.
2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కుల గణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందని, దానికి

7 లో

- గత ప్రభుత్వంలో రోడ్డుపైకి రావాలంటేనే భయం
- చంద్రబాబును జైల్లో పెట్టారు...ఇసుకను దోపిడీ చేశారు
- జనేసన విజయం కోసం పాటుపడ్డ వారికి అండగా నిలవాలి

## ఎంత ఎదిగినా ఒదిగి ఉండాల్సిందే



- ప్రజాప్రతినిధులు అవగాహనతో ముందుకు సాగాలి
- జనసేనాని పవన్ కల్యాణ్ హెచ్చరిక

**గుంటూరు,నేటిధాత్రి:**
వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డుపైకి రావాలంటే భయమేసే పరిస్థితి ఉండేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టాలంటే భయం. ఇంట్లో వాళ్లపై కూడా దుర్భాషలాడిన పరిస్థితిని చూశామని అన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల భేటీలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు సభ్యుడిని బంధించి కొట్టించిన తీరు చూశాం. సుదీర్ఘ అనుభవం, అందుకే ఐదు కోట్ల మంది ఒక్కటై అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని

6 లో



## ప్రజాస్వామ్యానికి గంతలు కట్టి కొల్లగొట్టారు

- గనలును దోచేశారు..భూములను లాగేశారు
- ఫేక్ డాక్యుమెంట్లతో అడ్డంగా దోచుకున్నారు
- గనుల శాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు

**అమరావతి,నేటిధాత్రి:**
సహజ వనరులైన భూములు, గనులు, అటవీ సంపదపై కూటమి ప్రభుత్వం సోమవారం శ్వేతపత్రం విడుదల చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు

6 లో

## ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారం

- అక్రమ తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్
- ఆగస్ట్ 2 వరకు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. అక్రమ తవ్వకాల వ్యవహా

7 లో

## ఆగస్టు నాటికి రైతులకు రుణమాఫీ



**హనుమకొండ ,నేటిధాత్రి:**
రైతు భరోసా పథకం అమలుపై తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. రైతు భరోసా 5 ఎకరాలకు ఇవ్వాలా, 10 ఎకరాల వరకు ఇవ్వాలనే అంశంపై క్షేత్ర స్థాయిలో రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకుంటుంది. ఉమ్మడి జిల్లాల వారీగా రైతు భరోసాపై ప్రభుత్వం వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రైతులతో సమావేశమై వారిచ్చే సలహాలు, సూచనలను కూడా మంత్రి వర్గ ఉప సంఘం ఆచరణలోకి తీసుకుంటుంది. ఈ రోజు(సోమవారం)

7 లో

- కోచింగ్ సెంటర్ల చీకటి సంపాదన.
- గోల్ మాల్ గోవిందం!
- "వేలకోట్ల" రాబడికి లెక్కుండదు!
- అకాడమీ లకు హద్దుండదు.
- సెంటర్లలో వెంచర్లకు మించి ఆదాయం.




# కోచింగ్...ఛీటింగ్!

### జరిగేదంతా "వేల కోట్లలో" వ్యాపారం.

- పైకి మాత్రం కి విద్యా వికాసం.
- లక్షల మందికి కోచింగులు.
- వేలాది రూపాయల ఫీజులు.
- చెతికందేవి ఎన్ని కొలువులు?
- అమాయకుల జీవితాలకు కల్పించే ఆశలు.
- విద్యార్థుల బలహీనతలే పెట్టుబడి.
- పదే పదే చెల్లించే ఫీజులు లెక్కకు మించిన రాబడి.

## త్వరలో మీ "నేటిధాత్రి"లో....







## రైతు రుణమాఫీకి మార్గదర్శకాలు విడుదల

### రేషన్ కార్డు ఆధారంగా రైతుల గుర్తింపు

**హైదరాబాద్,నేటిధాత్రి:**
పంటల రుణమాఫీకి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. కుటుంబానికి

7 లో

## ఇదేనా కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు..?

### ఇదేనా ప్రజా పాలన..?



7 లో



7 లో

## రైతుల వలపోతల కంటే వడపోతలపైనే ఎక్కువ దృష్టి..

### రుణమాఫీ మార్గదర్శకాలపై హరీశ్‌రావు ఫైర్

## డీఎస్సీని వాయిదా వేయాలి

- సచివాలయ ముట్టడికి యత్నించిన బిసి జనసభ
- సచివాయంలోకి చొప్పకుని పోయే యత్నం
- రాజారాం యాదవ్ తదితరుల అరెస్ట్
- అరెస్టులను ఖండించిన కేటీఆర్

7 లో



## ఢిల్లీలో నిరసనలు తెలపాలి

### ఢిల్లీలో తెలంగాణ నిరుద్యోగుల దీక్షకు అనుమతి కోరిన మోతీలాల్ నాయక్

**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
తెలంగాణలోని నిరుద్యోగులంతా నిరసన బాట పట్టిన సంగతి తెలిసిందే. గ్రూప్-1 మెయిన్స్‌కు

7 లో

నేటిధాత్రి
# జిల్లాల అనుబంధం
14-07-2024 ఆదివారం

## 17 వ వార్డులో అమ్మ మాట అంగన్వాడి బాట

**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమ్మ మాట అంగన్వాడి బాట పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు విద్యానగర్ ఏరియాలో స్థానిక కౌన్సిలర్ రామిడి ఉమాదేవి- కుమార్ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధించే విద్య, అందించే సేవల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తూ, రెండున్నర సంవత్సరాలు దాటిన పిల్లల్ని అంగన్వాడీలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అనిత, ఆర్పి మంజుల పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# అద్దె భవనాల్లో ఇంకెనాళ్లు ?

▸▸ ముప్పై ఏళ్లుగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న వేములవాడ సబ్ రిజిస్టర్ ఆఫీస్

**వేములవాడ, నేటిధాత్రి :**
అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిస్థితి ఏర్పడింది రిజిస్ట్రేషన్ల ద్వారా లక్షల్లో ఆదాయం వస్తున్నా.. కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక తిప్పలు పడుతున్నారు. కార్యాలయానికి శాశ్వత భవనం లేక అద్దె భవనంలో నిర్వహిస్తుండగా.. సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం ఆ సర్వేశ్వరుని నిలయంగా ఉన్నా వేములవాడ మరియు పరిసర ప్రాంతాల్లో భూములకు మంచి డిమాండ్ ఉంది. దీంతో రిజిస్ట్రేషన్లకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారు. కార్యాలయానికి శాశ్వత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో ఇరుకు గదుల్లో కార్యకలాపాలు నెట్టుకొస్తున్నారు. ప్రజలు సరైన కుర్చీలు లేక చంటి పిల్లలతో రిజిస్ట్రేషన్ ఆఫీస్ కి వచ్చేవారు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రెండు మూడు కుర్చీలు మినహా పెద్ద సౌకర్యాలు ఏమీ లేకపోవడంతో చంటి పిల్లలను ఎత్తుకొని తమ పనులు కష్టమైనా ముగించుకోవాలిసిన పరిస్థితి దాపురించింది అని ఆవేదన చెందుతున్నారు అద్దె భవనంలో సరైన తాగునీటి వసతి, మూత్రశాలలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు.

### పార్కింగ్ లేక వాహనదారులకు తిప్పలు...

రిజిస్ట్రేషన్ కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తమ వాహనాలను ఎక్కడ పెట్టాలో అర్థం కాక రోడ్డుపై నిలుపుతున్నారు. దీంతో ఈ రోడ్డంతా ట్రాఫిక్ తో నిండిపోవడంతో ఇటువైపుగా వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయి. కార్యాలయానికి వచ్చిన వారికి కనీసం కూర్చోవడానికి కుర్చీలు సైతం లేకపోవడంతో గంటల తరబడి నిలబడి ఉండాల్సి వస్తుంది. రిజిస్ట్రేషన్ రుసుము చార్జీలు పెంచిన ప్రభుత్వం కనీస వసతులు కల్పించకపోవడం బాధాకరం. ప్రభుత్వం వెంటనే నూతన భవనాన్ని ఏర్పాటు చేసి వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది అని వినియోగదారులు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఉచిత మెడికల్ క్యాంపును వినియోగించుకున్న పురపాలక ప్రజలు

▸ ఉచిత మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన
▸ తవక్కల్ పాఠశాల అధినేత అబ్దుల్ అజీజ్

**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:**
రామకృష్ణాపూర్ పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో మ్యాక్స్ కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, రాఘవేంద్ర పిల్లల హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో భారీగా ప్రజలు హాజరై వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి క్యాతన్ పల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్ జంగం కళ, పట్టణ ఎస్ఐ రాజశేఖర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు. నేటి రోజుల్లో ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధ చూపే అవసరం ఎంతైనా వుందని అన్నారు. మ్యాక్స్ కేర్, రాఘవేంద్ర ఆసుపత్రి వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వైద్య శిబిరం నిర్వహించిన తవక్కల్ పాఠశాల అధినేత అబ్దుల్ అజీజ్ ను అభినందించారు. ఈ రోజులలో వైద్యం పేదవాడికి అందని ద్రాక్షగా మిగిలిన



నేపథ్యంలో రామకృష్ణాపూర్ పట్టణంలో కార్పొరేట్ ఆస్పత్రి వారు ఉచితంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించిన సందర్భంగా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సేవలు అందిస్తూ సుమారు లక్ష రూపాయల విలువైన మందులను అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి, డాక్టర్లు తేజస్విని, నాగరాజు, సతీష్ కుమార్, లక్ష్మి ,శ్రీకర్,సుమారు 700 మంది ట్రీట్మెంట్లో పాల్గొన్నారు.

## కరకగూడెం నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక

**కరకగూడెం (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా), నేటిధాత్రి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం కరకగూడెం ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఆదివారం రైతు వేదిక నందు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొనకండ్ల సాయికుమార్, ఉపాధ్యాక్షుడు సయ్యిద్ అఫ్రోజ్, ప్రధాన కార్యదర్శిగా బుడగం ప్రవీణ్, కార్యదర్శులుగా జాడి విజయ్, కలం సాంబమూర్తి, యాకన్న, క్రీడావిభాగం అధ్యక్షులుగా గుండ్ల రంజిత్, కార్యవర్గ సభ్యులుగా బొల్లికొండ



రవి, దుర్గం సురేందర్ జాడీ రాము సునీల్ సాయి గంపల రమేష్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన



ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోనకండ్ల సాయికిరణ్



ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్

అధ్యక్షుడు కోనకండ్ల సాయి కిరణ్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ప్రెస్ క్లబ్ కమిటీగా ఎన్నుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులకు పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కండి

– సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

**రామడుగు, నేటిధాత్రి:**
కరీంనగర్ జిల్లా రామడుగు మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాలులో ఉమ్మెంతల రవీందర్ రెడ్డి అధ్యక్షతన సిపిఐ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ పాలవర్గాలు అవలంబిస్తున్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ఎన్నికల హామీల అమలుకోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభావం రోజురోజుకు తగ్గిపోతుందని అందుకు నిదర్శనమే ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సొంతంగా బిజెపి అధికారంలోకి రాకపోవడం అని, ఎన్డీఏ కూటమి పక్షాల మద్దతుతో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిందని, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గతప్రభుత్వ హయాంలో ప్రజలకు న్యాయం జరగడం లేదని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కుటుంబ పాలన జరిగిందని, అన్ని సంక్షేమ పథకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడం లాంటి అనేక వైఫల్యాలను దృష్టిలో పెట్టుకొని శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మి గెలిపించారని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచిందని, అయినప్పటికీ ప్రజా సమస్యలపై దృష్టిపెట్టడం లేదని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు పరచడం లేదని, అన్ని ప్రభుత్వ రంగ



సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం అని చెప్పుతూనే ఇప్పటికీ ప్రజలకు రేషన్ కార్డులు జారీ చేయలేదని, ప్రతి మహిళకు 2500ఇస్తామని చెప్పి ఇంకా అమలు చేయడం లేదని, ఉచిత కరెంటు అందరికీ ఇవ్వడం లేదని, రైతుల భూసమస్యలు పరిష్కరించడం లేదని, రైతు ఋణ మాఫీ చేస్తామని కాలం గడుపుతున్నారే తప్ప అమలు పరచడం లేదని ఇలా అనేక హామీలు అమలు చేయడానికి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజలను చైతన్య పరచి ఉద్యమాలకు సిద్ధం కాక తప్పదని హెచ్చరించారు. మండలంలో సీపీఐ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా గ్రామాల్లో తిరిగి పనిచేయాలని, పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాలల్లో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం అధికారుల వద్దకు తీసుకువెళ్లాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికంగా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటిసి స్థానాలను కైవసం చేసుకుందుకు ముమ్మరంగా పనిచేయాలని సీపీఐ శ్రేణులకు మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, టేకుమల్ల సమ్మయ్య మండల కార్యదర్శి గోడిశాల తిరుపతి గౌడ్, మౌలానా నాయకులు ఎగుర్ల మల్లేశం, మచ్చ నర్సయ్య, రాజన్న, రవీందర్, రాజేశం, కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు

**చిట్యాల, నేటిధాత్రి :**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని టిఆర్ఎస్ బిజెపి స్టూడెంట్ యూనియన్ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు నిరుద్యోగుల చలో సెక్రటేరియట్ ముట్టడిలో భాగంగా తెలంగాణ ఉద్యమకారుడు బిఆర్ఎస్ చిట్యాల మండల మాజీ యూత్ అధ్యక్షులు జన్నె యుగేందర్, బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్, బీజేవైఎమ్ జిల్లా నాయకులు గొర్రె శశీ కుమార్, ఏ బి ఎస్ ఎఫ్ నాయకులు గోల్కొండ సురేష్, బీజేవైఎం యువమోర్చా మండల నాయకులు జానర్ల కుమార్ లను పోలీసులు అర్థ రాత్రి రెండు గంటలకే అరెస్టు చేసి తమ కస్టడిలో ఉంచుకోవడం జరిగింది, ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల మాజీ యూత్ అధ్యక్షులు జన్నె యుగేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల



కాలం లోనే తెలంగాణ ఉద్యమకారులను, నిరుద్యోగులను,యువజన, విద్యార్థి నాయకులకు భయపడి అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు.
ఉద్యోగాలకై ఆమరణ దీక్ష చేస్తున్న ఉస్మానియా విద్యార్థి నాయకుడు మోతిలాల్ పైన మరియు నిరుద్యోగులపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీ మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు ఇంతటి దుర్మార్గమైన చర్య ఎక్కడ కూడా లేదని ఆరు నెలల కాలంలోనే ఉద్యమ నాయకులకు,విద్యార్థులకు భయపడితే రాబోయే ఐదేళ్లు ఎలా పాలిస్తారని డీఎస్సీ ఉద్యోగాలు పెంచాలని నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకై శాంతియుతంగా అడుగుతుంటే అక్రమ అరెస్టులు చేయడం విలేకరుల పైన దాడులు చేయడం ఇదేనా ప్రజా పాలనా అని అన్నారు.

## అత్తింటి వరకట్న వేధింపులకు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య

**జైపూర్, నేటిధాత్రి :**
భీమారం మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన అనపర్తి చందన అనే వివాహిత వరకట్న వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడింది. చందనకు అదే గ్రామానికి చెందిన జంపన్న



తో గత ఏడాది ఆగస్టులో ప్రేమ వివాహం జరగగా పెళ్లయిన మూడు నెలల తర్వాత వరకట్నం కోసం భర్త, అత్తమామ, ఆడబిడ్డ వెంకటమ్మ మానసికంగా వేధించేవారు. దీంతో ఈ నెల 7న పురుగుల మందు తాగగా కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఫారెస్ట్ కార్పొరేషన్ కార్యకలాపాలను పరిశీలించిన చైర్మన్

**భద్రాచలం, నేటిధాత్రి :**
హైదరాబాదులోని బొటానికల్ గార్డెన్‌లో ఫారెస్ట్ కార్పొరేషన్ అభివృద్ధి పనులను తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పొదెం వీరయ్య సోమవారం పరిశీలించారు. ఫారెస్ట్ కార్పొరేషన్ చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఫారెస్ట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కార్పొరేషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. నర్సరీలు, బీడీ ఆకుకు సంబంధించిన వివరాలను చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పొదెం వీరయ్య మాట్లాడుతూ ఫారెస్ట్ కార్పొరేషన్ ద్వారా అనేక మంచి పనులు చేపట్టాలని, వాటి వల్ల సమాజానికి మేలు కలిగేలా చూడాలని అధికారులను కోరారు. వివిధ పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని, కాలానుగుణంగా ఈ ప్రణాళికలను అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. మొక్కల పెంపకాన్ని ఒక బాధ్యతగా



స్వీకరించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అడవుల సంరక్షణ బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈడి ఏకో టూరిజం శ్రీ రంజిత్ నాయక్, ఫారెస్ట్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ స్కై లాక్స్, ఫారెస్ట్ కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంచానికే పరిమితమైన గౌడ కుటుంబానికి పోలీసుల చేయూత

25 కేజీల బియ్యం రూ.5 వేల ఆర్థిక సహాయం.

**చిట్యాల, నేటిధాత్రి :**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గుర్రపు గట్టయ్య వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతూ పడిపోగా వెన్నుపూస నడుము విరిగి రెండు సంవత్సరాలుగా మంచానికి పరిమితమైన ఇటీవల అప్పన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న పత్రికలో వచ్చిన ప్రకటనకు స్పందించి రెండు సంవత్సరాలుగా మంచానికి పరిమితమైన గట్టయ్య కుటుంబం దీనస్థితిని చూసి చలించిపోయిన చిట్యాల పోలీసులు కుటుంబానికి 25 కిలోల బియ్యం బస్తా, రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని నిరూపించుకుని..ప్రజల చేత శభాష్ పోలీస్ అన్నలు అనిపించుకుంటున్నారు. పోలీస్



ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సహచర ఉద్యోగులు వీరిని అభినందిస్తున్నారు. ఆర్థిక సహాయం చేసిన వారిలో పోలీసులు సిద్ధార్థ, లాల్ సింగ్, వెంకటేష్, సుమన్, రాజేందర్, అనిల్ తదితరులున్నారు.

# నేటిధాత్రి కథనానికి స్పందించిన ఎమ్మెల్యే

▸▸ "సింగరేణి మండలంలో రైతు పచ్చిపాల భద్రయ్య భూమి ఆక్రమణ" అనే శిర్షికకు స్పందన
▸▸ కబ్జా అయిన భూమిని తిరిగి పచ్చి పాల భద్రయ్యకు అప్పగించిన వైరాఎమ్మెల్యే.
▸▸ భూవివాదం కు తెరదించి సమస్యను పరిష్కారించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్.






సింగరేణి మండలంలో రైతు పచ్చి పాల భద్రయ్య భూమి ఆక్రమణ



**కారేపల్లి, నేటిధాత్రి :**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని ఉసిరికాయలపల్లి రెవెన్యూ పరిధిలోని ఆల్యతండా గ్రామంలో ఉన్న పచ్చి పాల భద్రయ్య భూవివాద పరిష్కరించి హద్దులు పెట్టించి నా భూమిని నాకు తిరిగి ఇప్పించిన మంచి మనిషి వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కి ఎన్నటికి రుణపడి ఉంటా అయ్యా నేను అన గా పచ్చిపాల భద్రయ్య అయిన నా భూమి సర్వే నెంబర్ 548/37/అ/4లో 1-20.ఎకరాలు గలది బీఆర్ఎస్ ప్రభుత్వంలో కబ్జా కి గురై నాకు జరిగిన అన్యాయానికి ఎన్నో చోట్ల తిరిగినా గాని కోర్టుల చుట్టూ ఆర్డిఓ ఆఫీస్ కలెక్టర్ ఆఫీస్ ఎంఆర్ఓ చుట్టూ ప్రదక్షిణలు చేసినా గాని నాకు ఎక్కడా జరగని న్యాయం వైరా ఎమ్మెల్యే చొరవతో తమరి సమక్షంలో నాకు న్యాయం జరిగింది అన్యాయంపై న్యాయం విజయం సాధించింది తమరి దయవల్లనే నా భూమికి 14-7-2024న హద్దులు పెట్టించి నా భూమిని నాకు తిరిగి ఇప్పించిన మీ మేలును నేను నా కుటుంబం సభ్యులు ఎన్నటికి మరువలేము మేము మీకు జీవితాంతం రుణపడి ఉంటామని మాకు తిరిగి మాభూమిని అప్పగించినందుకు ఆ భూమి లో పండె ప్రతిపంట లోపండె పంటలో మీ గుర్తులు గుర్తు కోస్తాయి ఆజ్ఞ పుకాలే స్తిరస్తాయిగ గుర్తుంటాయి మీమెలుని ఎన్నటికి మరువలేమయ్య మా భూపోరాటంలో భాగస్వాములై మాకు వెన్నంటి తోడు నీడగా ఉన్న నేను పుట్టిన నా ఊరు నాకన్నా తల్లినా ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీకి చెందిన పెద్దలు ప్రజలు నాకు సహా కరించి నాకు వెన్నంటి ఉండి సహకరించిన నా సింగరేణి మండలకు పెరున దన్య వాదాలు రాష్ట్ర ప్రజలంతా హర్షించదగ్గ విషయం ఏమిటంటే డబ్బు బలం రాజకీయ బలం కండ బలం మీద పేదవాడి తరఫున మీరు చేసినటువంటి న్యాయం మరువలేనిది గత మూడు సంవత్సరాలుగా నాకు తోడుగా నిడగ అండగా నిలబడ్డటువంటి అఖిలపక్ష నాయకులు అన్ని పార్టీల వారికి ప్రింట్ ఆండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సోదరులందరికీ చిన్న పెద్ద అక్క తమ్ముళ్ల అందరికీ పేరు పేరునా పాదాభివందనం చేస్తున్న నా భూమి నాకు తిరిగి ఇప్పించినందుకు ప్రతి ఒక్కరి కృషి ఎంతగానో నాకు తోడ్పాటు అందించి ముందుకు నడిపించి నటువంటి ప్రతి ఒక్కరికి నమస్కరిస్తున్న అదేవిధంగా మన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువళ్ళ దుర్గాప్రసాద్ కి రాష్ట్ర మహిళా పిసిసి ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల కి కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా సెక్రటరీ దాసరి ఐలయ్య కి సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య కి పోలంపల్లి మాజీ సర్పంచ్ ధారావత్ భద్రు కి ఉసిరికాయలపల్లి మాజీ ఎంపీటీసీ గద్దం వెంకటేశ్వర్లు కి అలియా తండా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ధారావత్ సక్రు కోండెబోయిన నాగేశ్వరరావు వై ప్రకాష్ బోళ్ళ రామస్వామి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాచకోండ నాగేశ్వరరావు తోపాటు మరికొందరు నాకు న్యాయం జరగడం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా అందరికి పాదాభివందనం చేస్తున్నమీపచ్చిపాల భద్రయ్య కుటుంబ సభ్యులము.

నేటిధాత్రి
వరంగల్ హన్మకొండ
14-07-2024 ఆదివారం

# ఘనంగా అమ్మ మాట - అంగన్వాడీ బాట కార్యక్రమం



**నర్సంపేట (టౌన్), నేటిధాత్రి :**
నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని నర్సంపేట - 4 అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట - అంగన్వాడి బాట కార్యక్రమంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి కేంద్రం అలాగే పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు రవీందర్, వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్స్ నల్ల భారతి, ఎండీ గౌసియా, ఆయా సునీత,మౌనిక, అనిత, పద్మ,విద్యార్థులు పాల్గొన్నారు.

# భాహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు తప్పవు

- రోడ్లకు ఇరువైపులా వాహనాలు నిలిపి ఇబ్బంది కలిగించవద్దు
- పరకాల సీఐ క్రాంతికుమార్



**పరకాల, నేటిధాత్రి :**
హన్మకొండ జిల్లా పరకాల పట్టణ ప్రాంతంలో భాహిరంగాగా మద్యం సేవించిరాదనీ,మద్యం సేవించి వాహనాలు నడపితే చర్యలు తప్పవని,వాహనంపై వెళ్లేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ మర్చిపోకుండా ధరించాలని డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ ఉపయోగించరాదన్నారు.మీ భద్రత మీ చేతుల్లోనే ఉందని ఎల్లప్పుడు గుర్తుంచుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.రోడ్డుకు ఇరువైపున పలు వ్యాపార సముదాయాల ముందు ద్విచక్ర వాహనాలు ఆటోలు ఇతర వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, అతివేగం, ప్రమాదకరమైన డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం,హెల్మెట్ లేకుండా వాహనం నడపడం,ద్విచక్ర వాహనంపై త్రిబుల్ రైడింగ్ చేయడం ఇట్టి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం పరకాల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామ ని సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

# ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చాలి

**ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్**



**హన్మకొండ, నేటిధాత్రి :**
ముదిరాజ్‌లను బీసీ - ఏలో చేర్చాలని, ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ బస్టాండ్ వద్ద ఉన్న ఎమ్మార్వో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు సోమవారం రోజున వినతిపత్రం అందజేచేశారు. అనంతరం పెద్ద ఎత్తున ముదిరాజులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ముదిరాజుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ... రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలను అందించే కార్యక్రమాన్ని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందని వివరించారు. తెలంగాణలో అధిక జనాభాగల ముదిరాజ్ లు సమాజములో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామని అన్నారు. ప్రభుత్వంలోని మంత్రివర్గంలో ముదిరాజులకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజుల అభివృద్ధి కోసం ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ను ఏర్పాటుతో పాటు ప్రతి సంవత్సరానికి రూ? 1000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్య శాఖలోని సొసైటీలకు ఎన్నికలు జరపాలని, మత్స్యకారులకు 50 ఏండ్లకే ఆసరా పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ముదిరాజ్‌లకు ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని అన్నారు.
జనాభా ప్రాతిపదికన ముదిరాజ్లకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వే (2014 ) అనంతరం ముదిరాజ్‌ల జనాభా 60 లక్షల కాగా, నేడు మళ్లీ జనగణన చేపట్టాలని కోరారు. ముదిరాజ్‌ల జనాభా తెలపాలని, ఆ దామాషాలో అన్ని అభివృద్ధి ఫలాలను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేశబోయిన శ్రవణ్, బయ్య శోభన్, ఇప్ప సాంబమూర్తి, పులి ప్రభాకర్, రామ్‌రాజ్, సమ్మయ్య, నర్సింగరావు, శంకర్, రమేష్, ప్రకాశ్, రవికుమార్, మహేందర్, కోటేశ్వర్, రాజ్ కుమార్, కృష్ణ, హరికృష్ణ, గోపి కృష్ణ, పెద్ద ఎత్తున ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య



**శాయంపేట, నేటిధాత్రి :**
అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకునే ఘటన శాయంపేట మండలంలోని పెద్ద కోడెపాక గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెద్దకోడేపాక గ్రామానికి చెందిన కారంగుల శంకర్ అనే వ్యక్తి వ్యవసాయ పెట్టుబడి, ట్రాక్టర్ కొనుగోలు, చికెన్ షాప్ పెట్టడం కొంత అప్పు చేయడం జరిగింది ఈ అప్పులు తీర్చలేక భార్యతో చెప్పుతూ తరచూ బాధపడు తూ ఉండేవాడు ఈ అప్పులు తీర్చడం ఎలాగో అని మదనప దేవాడు అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది ఈ క్రమంలో ఆదివారం రోజున రాత్రి 10 గంటలకు కుటుంబ సభ్యులందరూ కలిసి అన్నం తిని పడుకున్న తర్వాత ఉదయం నాలుగున్నరకు లేచి చూసి వాళ్ళ ఇంట్లో పైకప్పు దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయిన వ్యక్తి యొక్క భార్య కారంగుల లలిత యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ రాణా



**నర్సంపేట, నేటిధాత్రి :**
నర్సంపేట పట్టణంలోని 18 వ వార్డు చెందిన కోట పురుషోత్తం తండ్రి కోట వీరస్వామి అనారోగ్యంతో మరణించగా వరంగల్ జిల్లా బిజెపి నాయకులు డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి మృతదేహంపై పూల మాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు శీలం రాంబాబు గౌడ్, నియోజకవర్గ యువ మోర్చా ఇంచార్జ్ కొంకీస విగ్నేష్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్ మహిళా మోర్చా వరంగల్ జిల్లా నాయకురాలు సూత్రపు సరిత,జిల్లా ఎస్సీ మోర్చా కో కన్వీనర్ కూనమల్ల పృథ్వీరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నూనె రంజిత్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కుసుమ భవాని శంకర్, ఖానాపూర్ మండల యువ మోర్చా ప్రధాన కార్యదర్శి మధుకర్, పట్టణ యువ మోర్చా కార్యదర్శి చిలువేరు అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెగిన రోడ్డును పరిశీలించిన రెవెన్యూ అధికారులు



**నడికూడ, నేటిధాత్రి:**
మండలంలోని కంఠాత్మకూర్ గ్రామం వద్ద ఉన్న బ్రిడ్జి కొత్తగా నిర్మాణంలో ఉన్నందున తాత్కాలికమైన రోడ్డును ఏర్పాటు చేసి పరకాల నుండి హనుమకొండకు వెళ్ళు ప్రజలందరూ ఇట్టి రోడ్డు నుండి పోయేవారు కానీ అట్టి నిర్మాణంలో ఉన్న రోడ్డు తెగిపోవడంతో అట్టి బ్రిడ్జి వద్దకు తహసిల్దార్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసిల్దార్ ఆర్ సత్యనారాయణ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ లావుడియా హేమా నాయక్ పరిశీలించడం జరిగింది. ఇట్టి రోడ్డు నుండి ప్రజలు ఎవ్వరు ప్రయాణించవద్దని ఇట్టి రోడ్డును నిలుపుదల చేయడం జరిగింది కావున ప్రజలందరూ గమనించి సహకరించ వలసిందిగా కోరుచున్నాము.

# అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం




**నడికూడ, నేటిధాత్రి:**
మండల కేంద్రంలో అమ్మ మాట అంగన్వాడీ బాట తేదీ 15 -7-24నుండి 20-7-24 జరిగే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ తీయడం జరిగింది. ముఖ్య అతిథిగా సిడిపిఓ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యనుకు సంబంధించిన అంగన్వాడి పిల్లలను అంగన్వాడీలో చేర్పించి వారి భవితకు పునాది వేయాలని పిల్లలకు వారిశారీరక అభివృద్ధి తోడ్పడతాయని తదితర అంశాలు తల్లులకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కే శ్రీదేవి, ఏం రాజా రాణి, అంగన్వాడీ టీచర్లు అనిత, సంపూర్ణ, కళావతి, వినోద, హేమలత, సుగుణ, భాగ్యలక్ష్మి గర్భిణీలు బాలింతలు కిషోర బాలికలు ప్రీస్కూల్ పిల్లల తల్లులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చెయ్యండి

- వీఆర్వో లను తిరిగి రెవెన్యూ శాఖకే కేటాయించాలి
- ఉపముఖ్యమంత్రి కి రెవెన్యూ అధికారుల విన్నపం



**నేటిధాత్రి, వరంగల్ :**
రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని, వీఆర్వోలను తిరిగి రెవెన్యూ శాఖకే కేటాయించాలని, గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేశ్వర్ రావు, ఫణి కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్ కుమార్‌లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిని కోరారు. సోమవారం నాడు వరంగల్ లో జరుగుతున్న రైతు భరోసా కార్యక్రమానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన తహసీల్దార్లు రద్దు చేసిన వీఆర్వో వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని, వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ లుగా పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులను తిరిగి రెవెన్యూ శాఖకు వీఆర్వోలుగా నియమించి, రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి సహకరించాలని కోరారు. దీనికి ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఫణికుమార్, ఇతర రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన వర్సిటీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి

**కేయూ క్యాంపస్, నేటిధాత్రి :**
ఇటీవల డిగ్రీ పూర్తి చేసుకొని ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ లో సీటు సాధించిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఏ .అనిల్ ను యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగ అధ్యాపకులు మరియు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ అభినందించారు. మహబూబాద్ జిల్లా వేమునూర్ గ్రామానికి చెందిన విద్యార్థి అనిల్ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు మీడియంలో చదువుతూ సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ఎంట్రన్స్ లో మంచి మార్కులు సాధించి సీటు సాధించడం పట్ల గణిత విభాగ అధ్యాపకులు డాక్టర్ టీ నాగయ్య డాక్టర్ అంజన్ రావు డాక్టర్ శ్రీ లక్ష్మి విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు గౌడ్, విద్యార్థులు , మణికంఠ, రాఘవేంద్ర, సాయి కిరణ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్**



**పరకాల, నేటిధాత్రి :**
ఒకటో వార్డు సీఎస్ఐ కాలనీ, దుబాసి వాడ,ఒంటేరు గడ్డలలో సానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ సంపత్ కుమార్ చేపడుతున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం ప్రారంభమై వాతావరణ మార్పులతో ప్రజలు రకరకాల వ్యాధులు,సీజనల్ వ్యాధులు, మలేరియా,టైఫాయిడ్,డేంగి, చికెన్ గున్యా,వైరల్ జ్వరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరినారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో పరిశుభ్రంగా లేని ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెందుతాయని దోమల వలననే వ్యాధులన్నీ వస్తాయని అన్నారు.పారిశుద్ధ్యం చక్కగా జరిగేలా చూడాలని ఇంటింటికి చెత్త సేకరణ చేయాలని,పాగింగ్ చేయించాలని,బ్లీచింగ్ చల్లించాలని,డ్రైనేజీల వెంట, రోడ్ల వెంట పిచ్చి మొక్కలు తీపించాలని,చైర్ పర్సన్ ని, కమిషనర్ ని కోరినారు.

# కులగణన చేసే వరకు పోరు ఆపేది లేదు

- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు కులగణన సాధన యాత్ర.
- జులై 18న హన్మకొండ లో కుల గణన సాధన యాత్ర సభ.
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైర రవి కృష్ణ గౌడ్.




**హనుమకొండ జిల్లా, నేటిధాత్రి :**
రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా ప్రకారం పెంచే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. ఆదివారం హన్మకొండ ప్రెస్ క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరీ రవి కృష్ణ గౌడ్ మాట్లడుతూ కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీలకు తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతంకు బీసీ రిజర్వేషన్లను పెంచుతామని స్పష్టమైన హామీనిచ్చిందని, ఇచ్చిన హామీని ఎన్నికల్లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ను ప్రభుత్వానికి గుర్తు చేయడానికి, ప్రభుత్వం పైన నిరంతరం ఒత్తిడి పెంచడానికి, బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల ఐకాస ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సాధన యాత్రను నిర్వహిస్తున్నామని, ఈ యాత్ర ఈనెల 14న కామారెడ్డి నుంచి ప్రారంభమై కరీంనగర్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 రోజుల పాటు ఉంటుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 18న హన్మకొండ హంటర్ రోడ్ సత్యం కన్వెన్షన్ హాల్ లో సమగ్ర కులగణన సాధన యాత్ర సభ ఉంటుందని, ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీ కులస్తులందరూ, కులాల కతీతంగా, పార్టీలకతీతంగా ఏకమై సమగ్ర కులగణన సాధన యాత్ర సభలో అత్యధికంగా పాల్గొని, బీసీల ఐక్యతను చాటలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు ఆనందం, దాడి మల్లయ్య యాదవ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తౌటం రవీందర్, బీసీ మహిళ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మేల శోభరాణి, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు కాసగాని అశోక్ గౌడ్, పంజాల మధు, డా. ఒడితల రాము, అరెగంటి నాగరాజు, కురిమిళ్ల శ్రీనివాస్ గౌడ్, మారగోని రవి, తంగళ్లపల్లి రమేష్, పెరుమాండ్ల అనిల్, రాధిక, ప్రమోద, కాశెట్టి రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మన ఉపాధిని, కులవృత్తులను కాపాడుకునే అవసరం చాలా ఉంది

- తాడిశెట్టి క్రాంతి కుమార్ హన్మకొండ జిల్లా జేఏసీ కన్వీనర్
- తెలంగాణ జిల్లాల యువజన సంఘం కన్వీనర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి



**హసన్ పర్తి, నేటిధాత్రి :**
గత రెండు దశాబ్దాలుగా కొద్దిమంది తో మొదలైన ఉత్తరాది రాష్ట్రాల పెట్టుబడిదారీ వ్యవస్థ తెలంగాణలో దక్షిణ భారతదేశంలో పాగా వేస్తూ స్థానిక ఉపాధి మరియు వ్యాపార రంగాల్లో వారు కైలాస మాటలు పెద్ద పాము మింగినట్టు మన ఉపాధిని మరియు వ్యాపార రంగాన్ని పూర్తిగా కుదేలు చేస్తూ వారి వ్యాపారాన్ని విస్తృతంగా విస్తరించడం జరిగింది దీనివల్ల స్థానికులు దక్షిణాది రాష్ట్రాల అమాయక ప్రజలు పూర్తిగా నష్టాల్లోకి వెళ్లిపోయి తమ వ్యాపారాలను వదిలేసి కూలి పనులకు పోయే స్థితికి తీసుకు రావడం జరిగింది.
ఈ ఉత్తరాది రాష్ట్రాల నుండి వచ్చినటువంటి ఈ వ్యాపారస్తులు ఒక ముఠాగా మారి వారి బంధువులకు వారి కులాలకు వారికి సంబంధించిన వ్యక్తులకు అతి తక్కువ రేట్లలో వ్యాపారం చేసుకునే లాభం ఎక్కువగా వచ్చే విధంగా ఒకరికి ఒకరు సహకరించుకుంటూ కొన్ని సందర్భాల్లో కంపెనీలు అమ్ముతున్న వస్తువుల ధరల కంటే కూడా వీర్ అమ్ముతున్న ధరలే తక్కువగా ఉండడం ఇది స్థానిక వ్యాపారస్తులకు చాలా నష్టాలు గురి చేసింది ముఖ్యంగా వీళ్లు జీరో మాల్ జీఎస్టి లేకుండా అక్రమ వస్తువుల రవాణా చేసుకుంటూ వారి వ్యాపారాన్ని విస్తృతంగా పెంచుకుంటూ పోయారు ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం నీళ్లు నిధులు నియామకాల మీద పెద్ద ఎత్తున పోరాటం జరిగింది ఇదే పోరాటం దక్షిణాది రాష్ట్రాలు చేయాల్సిన అవసరం వచ్చింది ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్య పట్టణంలో కూడా ఒక పెద్ద ఎత్తున ఉద్యమం చేసి వీరి వ్యాపారాలను అరికట్టకపోతే స్థానికులు పొట్ట చేత పట్టుకొని మరొకసారి తెలంగాణ వాదులు వలస వెళ్లాల్సిన అవసరం వస్తుందని ఆ ప్రమాదాన్ని ఇప్పుడే గ్రహించాలి అని ప్రభుత్వాలకి తెలంగాణ ఉద్యమకారులు మేధావులు దక్షిణాది రాష్ట్రాల హక్కులు కోసం పోరాడుతున్నటువంటి వ్యక్తులు సూచనలు ఇవ్వడం జరుగుతుంది వాస్తవంగా ఈ దేశంలో పెట్టుబడిదారుల చేతిలో రాజకీయాలు కీలుబొమ్మలా మారుతున్న రాజకీయ నాయకులను మనం చూస్తూనే ఉన్నాం భవిష్యత్తులో ఈ ఉత్తరాది రాష్ట్రాల నుండి వచ్చినటువంటి వ్యాపారస్తులు స్థానిక రాజకీయాలలో కూడా వారు నిర్ణయించినటువంటి వ్యక్తులకే పార్టీల టికెట్లు ఇచ్చే విధంగా మరియు వాళ్లకు కావాల్సిన వ్యక్తులను గెలిపించుకునే విధంగా వారు సామ్రాజ్యాన్ని సృష్టించుకుంటున్నారు ఆ వ్యాపార సామ్రాజ్యంలో మామూలు వ్యక్తి సగటు మానవుడు తన జీవితాన్ని పూర్తిగా కోల్పోయే స్థితికి వస్తుంది కాబట్టి తెలంగాణ ప్రజలు ముఖ్యంగా వ్యాపారస్తులు ఉపాధి కోసం పని చేస్తున్నటువంటి అన్ని కుల సంఘాలు దీనిపైన పెద్ద ఎత్తున స్థానిక ఎమ్మెల్యేలు మంత్రులు ముఖ్యమంత్రులు రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి ఈ ఉత్తరాది వ్యాపారస్తుల మీద మరియు ఉత్తరాది నుండి అతి తక్కువగా పనిచేస్తున్నటువంటి వ్యక్తుల పైన ఒక జీవో గాని మరియు ఒక కొత్త విధానాలని తీసుకువచ్చి స్థానికులకు లాభం జరిగే విధంగా చేయాల్సిన అవసరం ఉన్నది ఒకవైపు వీళ్ళు వస్తువులను నాణ్యతలేని డూప్లికేట్ వస్తువులుగా తయారుచేసి పేరు మోసినటువంటి కంపెనీలకు చెందినటువంటి వస్తువులకు బదులుగా వీరి వస్తువులను తయారు చేసి వారి వ్యాపారాలలో తక్కువ రేట్లకు అమ్మడం వల్ల ఒకవైపు వినియోగదారుడు మరియు అదే కంపెనీ యొక్క వస్తువులు అమ్ముతున్న స్థానిక వ్యాపారస్తులు పూర్తిగా నష్టపోతున్నారు జీరో మాల్ వితౌట్ జీఎస్టీ ల ద్వారా వచ్చే వస్తువులు మార్కెట్లో విచ్చలవిడిగా అందుబాటులోకి రావడం వల్ల తక్కువ ధరల కోసం ఎదురు చూస్తున్నటువంటి సామాన్యుడు వీళ్ళకు అట్రాక్ట్ అయి వారి దగ్గర వస్తువులను కొని మోసపోతున్నారు ఒకవైపు ఈ దక్షిణాది నుండి వచ్చినటువంటి వ్యాపారస్తులు కొన్ని సంవత్సరాల వరకు వ్యాపారాన్ని విస్తరించి తమ నష్టాలను కూడా బయటికి కనిపించకుండా లాభాల్లో నడుస్తున్నట్టు చేసి స్థానికుల దగ్గర కంపెనీల దగ్గర ఉత్తరకు అప్పులు చేసి వస్తువులను తీసుకొచ్చి ఎవరికి చెప్పా పెట్టకుండా రాత్రికి రాత్రి ఉదయించడం ఇక్కడ జరుగుతుంది దీనివల్ల తానిగుడు చేసే వ్యాపారం నష్టం లోకి వెళ్లిపోయి తన వ్యాపారాన్ని వదులుకునే స్థితికి తీసుకొస్తున్నారు కాబట్టి అభ్యుదయవాదులు ప్రజాహితం కోరేవాళ్లు దక్షిణాది రాష్ట్రాల హక్కుల కోసం పోరాడే తత్వం ఉన్నటువంటి వ్యక్తులందరూ కూడా ఏకమై దీనిపైన దృష్టిసాదించే ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకొచ్చి మన హక్కులను మన వ్యాపారాలని మన ఉపాధిని మన కులవృత్తులను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నది ముఖ్యంగా దీనివల్ల నష్టపోయేది స్థానికులే కాబట్టి వీళ్లంతా కూడా సంఘటితం కావాలి మనకంటూ హక్కులను ఇచ్చే విధంగా మన వ్యాపారాలకు బ్యాంకు రుణాలు ఇచ్చే విధంగా ట్యాక్స్ ఎగ్జామ్స్ స్థానికులకు ఉండే విధంగా కలెక్టర్ ఎమ్మార్వో ఆర్డీవోల చేతిలో మనకు కావలసినటువంటి వసతులు రుణాలు గాని టాక్స్ ఎగ్జామ్స్ గాని ఒక కొత్త విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చి స్థానిక వ్యాపారస్తులను కాపాడాలని కోరుకుంటూ ఒకవైపు ప్రైవేట్ బిల్డర్స్ అసోసియేషన్ వాళ్లు కాంట్రాక్టర్లు వీళ్లంతా కూడా తక్కువ కూలికి చేస్తున్నటువంటి ఉత్తరాది రాష్ట్రాల నుండి వచ్చినటువంటి వ్యక్తులను పనికి తీసుకోవడం వల్ల చాలా వరకు స్థానికులకు కూలి పనులకు కూడా అవకాశం లేకుండా పోతుంది దీనివల్ల స్థానికుల పని లేకుండా చేస్తున్న ఉత్తరాది రాష్ట్రాల నుండి వస్తున్నటువంటి వలస కూలీలకు కూడా ఒక హక్కులను ఇస్తూ స్థానికులు మరియు వలస కూలీలు ఒకే దినసరి వేతనం మీద పనులు చేసుకునేందుకు వ్యసులుబాటు కల్పించాలి లేనిపక్షంలో కన్స్ట్రక్షన్ రంగంలో ఇతర రంగాలలో కూడా వీరు లాభాలు ఆశించినటువంటి వ్యాపారస్తులు ఈ ఉత్తరాది రాష్ట్రాల నుండి వచ్చినటువంటి వలస కూలీలను పెట్టుకుంటూ స్థానికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారు కాబట్టి ఈ విచ్చలవిడి వ్యాపారం విచ్చలవిడి వలస కూలీల దోపిడిని అరికట్టాలంటే కొత్త చట్టాలు మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది కాబట్టి అందరం కలిసి మరొకసారి స్థానిక నాయకులకు కలెక్టర్లకు ఎమ్మార్వోలకు ఆర్డీవోలకు మన విన్నపాలను పంపించుకుంటూ మనం మన ఉద్యమాన్ని ముందుకు నడపాలని కోరుకుంటూ దక్షిణాది రాష్ట్రాల వ్యాపార ఉపాధి పైన దండయాత్ర చేస్తున్న ఉత్తరాది రాష్ట్రాల అగ్రవర్ణాలు చివరిగా వ్యాపారాలకు పెట్టిన పేరు కోమటి కులస్తులు వారు కూడా ఈ ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారస్తులు చేస్తున్నటువంటి దందాలకు తట్టుకోలేని స్థితికి వచ్చింది.

# బీటీ రోడ్డు కొరకు శంకుస్థాపన

## పాలమూరు ఎంపీ డీకే అరుణ.



**మహబూబ్ నగర్ జిల్లా, నేటిధాత్రి :**
మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని నవబుపేట మండల కేంద్రం నుండి తిరుమలపూర్ గేట్ వరకు పాలమూరు ఎంపీ డీకే. అరుణ బీటీ రోడ్డుకొరకు శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్ సభ్యురాలు డీకే. అరుణమ్మ కి నవాబుపేట మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు కమ్మరి లక్ష్మీ శాలువాగప్పి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆర్.బాలత్రిపుర సుందరి,బీజేవైఎం నవాబుపేట్ మండల అధ్యక్షులు బుడ్డోళ్ల ఆంజనేయులు, బిజెపి మండల అధ్యక్షులు గవిడ్ల రాజు, జీఎస్.రామకృష్ణ, జిల్లా మెంబర్స్ పసుపుల యాదన్న, లక్ష్మీనారాయణ, బిజెపి నాయకులు డాక్టర్ శివాజీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఏలో ఉత్తీర్ణత సాధించిన పూజితకు సన్మానం చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్



**భూపాలపల్లి, నేటిధాత్రి :**
భూపాలపల్లి పట్టణంలోని హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థిని చెరుకుపల్లి పూజిత ఇటీవల వెలువడిన సిఏ(చార్టెడ్ అకౌంటెంట్)ఫలితాలలో ఉత్తీర్ణత సాధించగా, ఆ విద్యార్థిని పూజితకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శాలువా కప్పి, స్వీటు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ.. మెడిటేషన్ ద్వారా అమోఘమైన శక్తిని పొంది, ఏకాగ్రతతో ఎలాంటి ఒత్తిడి లేకుండా మొదటి అటెంప్ట్ లోనే చిన్న వయసులోనే పూజిత కఠినతరమైన సిఏ(చార్టెడ్ అకౌంటెంట్)పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం పలువురు విద్యార్థులకు ఆదర్శనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు నిర్వాహకులు శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. కాగా, పూజిత తల్లిదండ్రులు చెరుకుపల్లి రవీందర్ – మాధవి దంపతులిద్దరూ హార్ట్ ఫుల్ మెడిటేషన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గా ప్రిసెప్టర్ గా పనిచేస్తుండటం విశేషం. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.

# ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి



**భద్రాచలం, నేటిధాత్రి :**
భారీగా తరలి వచ్చిన అంగన్వాడి కార్యకర్తలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొనసాగిస్తున్న ధర్నా అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు క్యాంపు కార్యాలయాన్ని భద్రాచలం నియోజకవర్గం అంగన్వాడి టీచర్లు హెల్పర్లు సోమవారం నాడు ముట్టడించారు. ఉదయం 10 గంటలకే నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి అంగన్వాడి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం చేరుకొని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు జిలకర పద్మ మాట్లాడుతూ అంగనవాడి కార్యకర్తలను బలవంతపు పదవి విరమణ ఆపివేయాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ పొందిన అంగన్వాడీ కార్యకర్తలకు సగం జీతం పెన్షన్ రూపంలో అందించాలని కోరారు. అదేవిధంగా అంగన్వాడీ కార్యకర్తలు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న పెండింగ్ బిల్లుల సమస్యను వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుల భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముందు నిరసన ధర్నా కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరసన శిబిరాల వద్దకు వచ్చి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని ఆరోపించారు. అంగనవాడిలతో పెట్టుకుంటే గత ప్రభుత్వాలకి పట్టిన గతే రేవంత్ ప్రభుత్వాన్ని కూడా పడుతుందని హెచ్చరించారు. అంగనవాడి ల సమస్యలు పరిష్కరించే అంతవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంపీ నర్సారెడ్డి సీనియర్ నాయకులు గడ్డం స్వామి ఎర్రంశెట్టి వెంకట రామారావు బండారు శరత్ బాబు అప్పారి రాము చుక్కా మాధవరావు అంగన్వాడి కార్యకర్తలు నాగశీల సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పసుపు కార్డు, ఎరుపు కార్డు ఉత్తర్వులు రద్దు చేయాలి

## గని కార్మిక సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రగిరి శంకర్



**భూపాలపల్లి, నేటిధాత్రి :**
తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రగిరి శంకర్ విలేకరుల సమావేశం నిర్వహించారు అనంతరం మాట్లాడుతూ కార్మికుల క్రమ శిక్షణా చర్యలకు సంబంధించి ఇటీవల సింగరేణి యాజమాన్యం జారీ చేసిన పసుపు కార్డు,రెడ్ కార్డు ఉత్తర్వులు నిరంకుశమైనవని ఈ సర్క్యులర్ అమలు తో కార్మికులు విధి నిర్వహణలో తీవ్ర భయ భ్రాంతులకు గురవుతున్నారన్నారు, వెంటనే పసుపు కార్డు, ఎరుపు కార్డులను రద్దు చేయాలనీ భూపాలపల్లి ఏరియా టీబిజీకేఎస్ కార్మిక సంఘం డిమాండ్ గనులలో లేదా పని ప్రదేశాలలో ప్రమాదాలు జరిగితే కేవలం కార్మికుల్ని మాత్రమే పూర్తి బాధ్యుల్ని చేసే అప్రకటిత నిర్బంధం ప్రయోగించి చార్జ్ షీట్లు, మెమోలు, సస్పెండెడ్ పెండింగ్ ఎంక్వయిరీ ,షోకాస్ నోటీసులు ఇవ్వడంతో పాటు కార్మికుల్ని మానసికంగా వేధించే ఈ సర్క్యులర్ రద్దు చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు,ఉత్పత్తి లక్ష్య సాధనతో పాటు పూర్తిస్థాయి రక్షణ చర్యలపై కూడా యాజమాన్యం దృష్టి పెట్టాలి అప్పుడు మాత్రమే ప్రమాదాలు నివారించబడతాయని వారు అభిప్రాయపడ్డారు, ఏ తరహా నేరస్తుడో పలకపై అక్షరాలు దిద్ది దోషి మెడలో వేలాడదీసిన నాటి బ్రిటిష్ బానిస సామ్రాజ్యపు కఠిన నిబంధనలు ప్రజాస్వామిక దేశంలో సరికాదని ఈ విధానం కార్మికుల పట్ల యాజమాన్యం వ్యవహరించే అమర్యాద చర్యగా వారు అభివర్ణించారు,వెంటనే సంబంధిత సర్క్యులర్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామూ, దీనికి ఐ ఎన్ టీ యూ సి ఏఐటీయూసి యాజమాన్యంతో చర్చించి ఈ సర్క్యులర్ ను రద్దు చేసే బాధ్యత వీరిదే. ఈ కార్యక్రమంలో తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు రాజేశం.. రాములు, రమేష్ ,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోగస్ సంస్థలపై దృష్టి సారించండి

## – సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



**సిరిసిల్ల, (నేటిధాత్రి):**
ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసం చేసిన సంస్థలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్లలోని సిపిఐ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్లోబల్ ఫౌండేషన్ అనే సంస్థ ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఉద్యోగాలు ఇప్పిస్తామని అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఒక్కో ఉద్యోగానికి రెండు నుండి మూడు లక్షల వరకు రూపాయలు వసూలు చేసి బోగస్ నియామక పత్రాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ దృష్టి సారించి చట్ట పరిధిలో వారిని కఠినంగా శిక్షించి మోసపోయిన బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ ఎండి బాబర్ ఈ వసూళ్లతో ఎలాంటి సంబంధం లేదని చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని, ఈ అక్రమ వసూళ్ల వెనుక ఎవరున్నా సిబిఐ చేత విచారణ జరిపించి ఈ కుంభకోణంలో ఉన్న వారందరినీ వెలికి తీసి కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మంద సుదర్శన్, పంతం రవి, సోమ నాగరాజు, అంగూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలి



- జూలై 22న ధర్నాను జయప్రదం చేయండి.
- కరపత్రాల ఆవిష్కరణ చేయడం జరిగింది.

**భద్రాచలం, నేటిధాత్రి :**
సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ భద్రాచలం డివిజన్ నాయకుడు దాసరి సాయన్న. చ%ఓ%ర్ల మండల కేంద్రంలోని కామ్రేడ్ డీవీకే భవన్లో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ మండల కమిటీ సమావేశం సోమవారం సీనియర్ నాయకులు పాలెం చుక్కయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ నాయకుడు దాసరి సాయన్న మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని అర్హులైన పేదలకు ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వ వాగ్దానం ప్రకారం పెన్షన్లు పెంచి అర్హులైన వారందరికీ ఇవ్వాలని రైతాంగ రుణాలను రద్దు చేయడంతో పాటు వారికి కొత్త రుణాలు ఇవ్వాలని పంటల భీమా పథకం జూలై ఆగస్టు నెలలోనే అమలు చేయాలని వాస్తవ సాగుదారులందరికీ రైతు భరోసా అందాలని 20 ఎకరాల లోపు ఉన్నవారికి ఎంపిక చేసి పది ఎకరాల వరకు రైతు భరోసా అందించాలని అలానే కవులు రైతుల గుర్తింపునకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలని ధరణి సమస్యలను తక్షణమే పూర్తిగా పరిష్కరించాలని వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన 12 వేల రూపాయల ఆసరా పథకాన్ని తక్షణమే అమలు చేయాలని దీనిని కూడా జీవన వ్యయానికి అనుగుణంగా పెంచాలని నిర్మాణరంగా కార్మికులు ఇతర అసంఘటిత రంగ కార్మికులకు కూడా ఆసరా పథకాన్ని అమలు చేయాలని స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని నిరుద్యోగ కాళీపై శ్వేత పత్రం ప్రకటించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని పోడు సాగు దారులందరికీ పట్టాలు సాగు హక్కులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కై జూలై 22న తహసిల్దార్ ఆఫీస్‌ల ముందు జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని జూలై 29న కలెక్టరేట్స్ ముందు జరగనున్న ప్రదర్శనలు ధర్నాలను జయప్రదం చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలకు సానుభూతి పరులకు మండల ప్రజానీకానికి పిలుపునిచ్చారు అనంతరం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ చర్ల మండల కార్యదర్శి కొండ కౌశిక్, పార్టీ మండల నాయకులు శిమిడి సుజాత, మెహమూద, చెన్నాం మోహన్ %అట్‌బ% నాయకులూ ఎంఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో సమస్యల కుప్పలు

- పరిష్కారం ఎప్పుడు అని అడుగుతున్న ప్రజలు
- రామాయంపేట మున్సిపాలిటీలో పరిష్కారం కాని సమస్య
- డబుల్ బెడ్ రూమ్ కోసం నిర్వాసితుల దరఖాస్తులు

**రామాయంపేట (మెదక్), నేటిధాత్రి :**
తాసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో సమస్యల వెల్లువ ప్రవహిస్తున్నది. అనేక సమస్యలతో పట్టణ ప్రజలు ఇతర కార్యాలయాలకు పోక పోయినాక సమస్య పరిష్కారం కాక ప్రజావాణికి క్యూ కడుతున్నారు. రామాయంపేట మున్సిపాలిటీ ఆధీనంలోని ఐదో వార్డులో పెట్రోల్ బంక్ వెనుక ఉన్న కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా నీరు కాలనీ మధ్యలో చిన్న చెరువుగా మారి ఆ ప్రాంతమంతా బురద మయంగా మారడంతో కాలనీ వాసులకు వాహనాలకు గాని నడిచి వచ్చేవారికి కానీ, ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ కౌన్సిలర్ ఐదో వార్డ్ శోభ కొండల్ రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్య లక్షల్లో తీరేది కాదని కోట్లల్లో అయితేనే పరిష్కారం అవుతుందని బీసీ కాలనీ నుంచి వచ్చే నీరు ఇక్కడ పడడంపై ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఇప్పట్లో మాత్రం తక్షణంగా ఈ సమస్య పరిష్కారం కాదని తేల్చి చెప్పారు. మళ్లీ బడ్జెట్ వచ్చినపుడు కోట్లలో పనిచేయడం జరుగుతుందని అప్పటివరకు ఏమి చేయలేమని ఆయన తెలిపారు. కాలనీవాసులు మాత్రం ఎంత కాలం వేచి ఉండాలి కష్టకాలంలో ఆదుకోకపోతే ఏమి లాభమని పెద విధిస్తున్నారు. కాలేజీకి వెళ్లే విద్యార్థులకు అక్కడ బ్రిలియంట్ పాఠశాలను మెదక్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆశ్రయంగా అప్పగించడం జరిగింది. బాలికలు కాలేజీకి వెళ్లడానికి రావడానికి కూడా ఇబ్బందులు అవుతున్నాయని స్థానికులు అంటున్నారు. వెంటనే ఏమైనా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పరిష్కారం చేయకపోతే మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాకు దిగడానికి వెనుకాడమని కాలనీవాసులు హెచ్చరించారు. అలాగే రామాయంపేట తహసిల్దార్ రజని కుమారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతున్నదని ఆమె అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 80 కి పైగా ఫిర్యాదులు వచ్చాయని వాటిని పరిష్కరించడానికి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. దరఖాస్తుల్లో బుడగ జంగాల కులానికి చెందిన ఎల్లవ్వ గత 40 సంవత్సరాలుగా రామయంపేట పట్టణంలో నివసిస్తున్న తాము పింఛన్ కూడా రాలేదని కనీసం నివసించడానికి ఇల్లు లేదని ఆమె వాపోయారు. తమ భర్తకు కూడా పింఛన్ రావడం లేదని ఎలా బతకాలని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వవలసిందని తాము అర్హులమని వెంటనే తమకు డబుల్ బెడ్ రూమ్ అన్న ఇవ్వాలని ఆమె దీనంగా అర్థించారు.





# దేవాలయం నిర్మాణానికి ఆర్థికసాయం అందించిన కార్పొరేటర్



**కూకట్పల్లి, నేటిధాత్రి :**
124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ పోచమ్మ దేవాలయానికి స్లాబ్ నిర్మాణం కొరకు ఆర్థికసహాయం అందించిన డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగింది. దేవాలయం నిర్మాణానికి ఆర్థిక సాయం అందించి, సహకరించిన కార్పొరేటర్‌కి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియ చేసారు.కార్యక్ర మంలో సయ్యద్, జి.ర వి,అగ్రవాసు,సంగమేష్,బాలస్వామి, రవీందర్,అజామ్,బాలస్వామి సాగర్,నరసింగ్, శ్రీనివాస్, మనోహర్, పరశురాం, బాబు, దేవా, రాజయ్య, చక్రధర్, అరుణ, పుట్టం దేవి, బుజమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ రైట్స్ డే టోనే వెనుకబడ్డ కులాలకు న్యాయం జరుగుతుంది

## గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని జాతీయ అంబేద్కర్ సంఘం వినతి పత్రం.



**మహాదేవపూర్ – నేటిధాత్రి:**
ఎస్సీ ఎస్టీ వాళ్లతో పాటు వెనుకబడ్డ బలహీన వర్గాల ప్రజలకు సివిల్ రైట్స్ డే నిర్వహించడంతోనే వారి సమస్యలు పరిష్కరించబడతాయని జాతీయ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డే కచ్చితంగా నిర్వహించాలని అధికారులకు సూచించాలని జాతీయ అంబేద్కర్ సంఘం నాయకులు వినతి పత్రంలో కోరారు. అలాగే ప్రభుత్వ పథకాల నుండి బడుగు బలహీన వర్గాలు అనర్హులుగా ఉండకుండా అధికారులు సివిల్ రైట్స్ దేను నిర్వహించి పథకాలను లబ్ధి పొందే విధంగా చేయాలని జాతీయ అంబేద్కర్ సంఘం తాసిల్దార్ కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొనడం జరిగింది. వినతి పత్రం అందించిన వారిలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగాల రామయ్య ఉన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

## – వివరాలను వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహజన్



**సిరిసిల్ల, (నేటిధాత్రి):**
దేవాలయాల్లో వరస దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని పట్టుకుని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. వేములవాడ రూరల్ మండలం ఫాజిల్ నగర్‌లో ఉంటున్న హుస్నాబాద్ కు చెందిన శివరాత్రి సంపత్, వేములవాడ పట్టణం అగ్రహారం కు చెందిన అల్లిపు పరుశురాము అనే వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలో నిందుతులపై మొత్తం 17 కేసులు ఉన్నట్లు తెలిపారు. సిరిసిల్ల డిఎస్పి ఆధ్వర్యంలో రూరల్ సీఐ మొగిలి ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో స్పెషల్ టీం ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టగా సోమవారం రోజున పొత్తూరు బ్రిడ్జి వద్ద వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి 8 తులాల బంగారు అభరణాలు, రెండు తులాల వెండి అభరణాలు, ఒక ద్విచక్ర వాహనం, ఇనుప రాడ్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వివిధ జిల్లాల్లో దేవాలయాల్లో వరస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ మొగిలి, ఎస్ఐ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్స్ మధు, చంద్రశేఖర్లను జిల్లాఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి, సిఐ మొగిలి, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన చట్టలకు వ్యతిరేకంగా పరకాల న్యాయవాదుల నిరసన



**పరకాల, నేటిధాత్రి :**
కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన క్రిమినల్ చట్టాలలో కొన్ని ప్రొవిజన్స్ లోపాలు భూయిష్టంగా ఉన్నాయని ఢిల్లీలోని ఆల్ డిస్ట్రిక్ట్ కోర్టుల బార్ అసోసియేషన్ పిలుపుమేరకు సోమవారం పరకాల న్యాయవాదులు తమ విధులకు వెళ్లకుండా స్థానిక కోర్టు ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బందుల స్వామి మాట్లాడుతూ ఇలాంటి ప్రొవిజన్స్ వల్ల చట్టాల అమలులో అనేక ఇబ్బందులు తలెత్తుతాయని ఇందువల్ల కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా అమలులోకి తెచ్చిన చట్టాలను నిపుణులచే అధ్యయనం చేయించి వాటిని తొలగించాలని ఆయన డిమాండ్ చేసారు. ఇలాంటి ప్రొవిజన్స్ వల్ల కక్షిదారులకు జరిగే అసౌకర్యాన్ని గుర్తించి సుప్రీంకోర్టు మరింత లోతుగా ఈ అంశాలను పరిశీలించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బందెల స్వామి,సీనియర్ న్యాయవాదులు ఒంటేరు రాజమౌళి,శ్రీనివాస్,కూకట్ల శ్రీనివాస్,గండ్ర నరేష్ రెడ్డి,వేణు, లక్కం శంకర్,రాజు,రమేష్, రాహుల్ విక్రమ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ వారి కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**జైపూర్, నేటిధాత్రి:**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో సోమవారం రోజున ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది.లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల,లయన్స్ క్లబ్ఆఫ్ గోల్డెన్ జూబ్లీ, విజన్ కేర్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఉచిత కంటి చికిత్స శిబిరం చేపట్టారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మదేకర్ ఉదారకంటి ఆసుపత్రి రేకుర్తి కరీంనగర్ వారి సౌజన్యంతో చైర్మన్ లయన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో సోమవారం రోజున జైపూర్ మండల కేంద్ర స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి .సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన శిబిరానికి వివిధ గ్రామాల నుండి 150 మంది వచ్చేసి తమ పేరును నమోదు చేసుకొని, బి పి, షుగర్, కంటి పరీక్షలు చేయించుకున్న అనంతరం 50 మంది కంటి ఆపరేషన్ కోసం అర్హత సాధించనట్లు నిర్వాహకులు తెలిపారన్నారు.నిబంధన ప్రకారం ఈ రోజు 36 మందిని కంటి ఆపరేషన్ కోసం రేకుర్తి కంటి ఆసుపత్రికి, రేకుర్తి బస్సు ద్వారా పంపనున్నట్లు వివరించారు. నేత్ర చికిత్స కోసం వెళ్లే వారికి ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కంటి ఆపరేషన్, ఉచిత భోజనం ,వారి వెంట వెళ్లే సహాయక వ్యక్తులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత భోజనం వసతి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి. సత్యనారాయణ గౌడ్, డిస్టిక్ క్యాబినెట్ సెక్రెటరీ లయన్ శ్రీనివాసరావు, ఐ క్యాంపు చైర్మన్ డా.సుగుణాకర్ రెడ్డి, ఐ క్యాంపు కో– చైర్మన్ లయన్ ఎం. వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు లయన్ పుల్లూరి బలమోహన్, రీజియన్ చైర్ పర్సన్ లయన్ రాజమౌళి, కోశాధికారి లయన్ వెంకటేశ్వర్, లయన్ డా.అభిషేక్, లయన్ డా.రాకేష్ రెడ్డి, లయన్ డా.సయ్యద్ ఇలియాజ్,ఈ జోన్ చైర్ పర్సన్ లయన్ ఏ. శ్రీనివాస్, సెక్రెటరీ ఉదయ్, చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ లింగస్వామి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మి నరసింహ స్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్

# నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

## అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన సిహెచ్ నరసింహ, జె సుధాకర్



**కాప్రా, నేటిధాత్రి :**
చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం చీఫ్ అడ్ వైజర్, కాలనీ పెద్దలు ముకుంద భరత్ సాగర్ సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షులుగా సిహెచ్ నరసింహ, జనరల్ సెక్రటరీగా జె సుధాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ చారి, కనకయ్య, శ్రీధర్, కోశాధికారిగా శ్రీనివాస్ చారి, దామోదర్, కె మల్లేష్, అడ్ వైజర్స్ గా గోపాల్ రెడ్డి, రాజయ్య, ఎస్ కృష్ణపాండు, జాయింట్ సెక్రటరీస్‌గా ఎం సంతోష్, లింగస్వామి, తిరుమల రావు, పరమేష్ చారి, కమిటీ మెంబర్స్‌గా పి రవి, టి ప్రవీణ్, బి లక్ష్మీనారాయణ, ఎన్ సురేష్, కె సురేష్ సాగర్, రామచందర్, శివ, సత్యనారాయణ, కిరణ్ కుమార్ యాదవ్, డాక్టర్ శ్రీను, కె అరుణ్ కుమార్, వి శ్రీనివాస్, కె తిరుమలేష్, మాదేశ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఎల్లవేళలా కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తూ, అధికారులను, ప్రజా ప్రతినిధులను కాలనీలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లి కాలనీ అభివృద్ధికి సాయి శక్తుల కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, కమిటీ సభ్యులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను తిడుతూ పోతే ఎలా?

**నేటిధాత్రి డెస్క్:**
కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ మోడీ ఇచ్చిన నినాదం బెడిసి కొట్టింది. ఏదో ఒక పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తూ పాలన సాగించడం ఉత్తమ నాయకుడి లక్షణం కాదు. కాంగ్రెస్‌ను గత పదేళ్లుగా తిట్టి పోస్తూనే ఉన్నారు. ఆ తిట్లే వారికి వరంగా మారాయి. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సంఖ్య వందకు చేరింది. ప్రతిపక్ష హోదా కూడా లేని స్థాయి నుంచి ప్రతిపక్ష హోదాకు వచ్చారు. అలాగే ఇటీవలి ఉప ఎన్నికల్లో కూడా ఇండియా కూటిమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుకేసుకుని వాటిని పరిష్కరించకుండా పరజలను మభ్యపెట్టడం వల్ల మోడీ బలహీనం అయ్యారు. అయినా మార్పు కానరావడం లేదు. ఎమర్జెన్సీని రాజ్యాంగ హత్యా దివస్‌గా ప్రకటించడం కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట. ఈ కాలం ప్రజలకు ఇందిర పాలన గురించి పెద్దగా తెలియదు. తెలుసుకునే ఓపిక కూడా లేదు. మోడీ ఏం చేస్తున్నారన్నదే గత పదేళ్లుగా పరిశీలిస్తున్నారు. దేశంలో ప్రధానంగ నిరుద్యోగ సమస్యల విపరీతంగా ఉంది. చదువులు మోయలేని భారంగా మారాయి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మధ్య తరగతి ప్రజలకు జిఎస్టీ వాతలు తట్టుకోలుకుండా ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం వల్ల మరింత నిరుద్యోగం పెరుగుతుందన్న ఆందోళన కలుగుతోంది. అగ్నివీర్ పథకంతో నాలుగేళ్లకే ఆర్మీ ఉద్యోగాలు పోతున్నాయి. ఇవన్నీ ప్రధాన సమస్యలు. వీటి గురించి ఎక్కడా మాట్లాడడం లేదు. రాజకీయాలు అదేపనిగా చేయరాదు. ఎన్నికల సమయంలో మాత్రమే వాటిని ఉపయోగించాలి. ఇంకా ఇందిర విధించిన ఎమర్జెన్సీ గురించి చర్చిస్తూ..అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తే..ప్రజలు కూఆ మోడీని పక్కదారి పట్టించడం ఎలా అన్నది ఆలోచిస్తారు. పెరుగుతున్న జనాభాను తగ్గించడం, ధరలను తగ్గించడం, జిఎస్టీని తగ్గించడం, ఉద్యోగాలు పెంచడం లక్ష్యంగా పనిచేయకుంటే భారత్ మరింత అథఃపాతాళానికి విసిరివేయబడడం ఖాయం. ఈ సమస్యలపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలి. పరిష్కారాలు కనుగొనాలి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ పదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేసే సంకల్పం లోపించింది. అయితే అవినీతి మరక అంటకుండా దేశాన్ని పాలించామని చెప్పుకుంటున్నా..కార్పోరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న తీరుపై సర్వత్రా విమర్శలు ఉన్నాయి. అయితే కాంగ్రెస్ తరహా రాజకీయాలకు పెద్ద ఎత్తున తెరతీసారు. తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా తొలినాళ్లలో పాలన సాగించిన మోదీ ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకుంటున్న తీరు సరికాదు. పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జిఎస్టీతో ప్రజలకున్న ఆశలు అడియాశల య్యాయి. తాజాగా 2వేల నోట్ల రద్దు కూడా ఇదే కోవలోకి వస్తుంది. ప్రధానంగా ధరల పెరగుదల విషయంలో పట్టింపు లేకుండా పోయాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా వాటికి ధరలు దక్కడం లేదు. రైతులు ఆందోళ చేస్తున్నా వ్యవసాయాన్ని బలోపేతం చేసే చర్యలు కానరావడం లేదు. గోదాముల్లో ధాన్యం మగ్గుతుత్నా బయటకు రావడం లేదు. అలాగే దిగుమతులు కూడా తగ్గడం లేదు. కాంగ్రెస్ తరహా రాజకీయాలు చేస్తున్నారే తప్ప ఆదర్శ రాజకీయాలకు పెట్టింది పేరయిన బిజెపి ఇప్పుడా ముసుగు నుంచి బయటపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠ మసకబారినా, ప్రధానంగా బిజెపికి రాజకీయాలకు చెరగని మచ్చని తెచ్చి పెట్టాయి. పాలన ఎలా ఉన్నా అవినీతి రహితంగా సాగుతుందన్న పేరు ప్రచారం చేసుకోవడం మినహా ఇతర విషయాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. అవినీతి లేకున్నా అక్రమ రాజకీయాలు సాగుతూనే ఉన్నాయి. అమిత్‌షా, మోడీ ద్వయం రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి సఫలం అయ్యారు. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు ఒక్కోసారి వెగటుగా ఉంటాయనడానికి ఇటీవలి పరిణామాలు ఉదాహరణగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టు కోలేం. అలాగే గతంలో మీరు చేయలేదా అని ఎదురుదాడి చేయడం ఇటీవల అలవాటయ్యింది. మిగతా నాయకులకు, మిగతా పార్టీలకు, భారతీయ జనతా పార్టీకి చెందిన మోదీ, షాలకు కూడా తేడా లేదని ప్రజలు గుర్తించారు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం



రెపరెపలాడా లన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టి పోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోదీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. పార్టీ ఫిరాయింపు లను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది. ఇప్పుడు అదే పంథాను మోడీ నేతృత్వంలోని బిజెపి అనుసరిస్తోంది. మొత్తంగా బిజెపి కాంగ్రెస్‌కన్నా భిన్నంగా ఉండలేకపోతోంది. ఈ పరిస్థితి మారాలి. దేశం కోసం కష్టపడతానంటున్న మోడీ ప్రధాన సమస్యలను పట్టించుకోవాలి. తాను నిర్మించుకున్న కోటనుంచి బయటకు రావాలి. ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలి. ప్రజల కోసం పనిచేయడం అలవాటు చేసుకోవాలి. సామాన్యులు, మధ్య తరగతి ప్రజల బతుకులు దుర్భరంగా మారినవేళ వారిని కష్టాల కొలిమి నుంచి బయటపడేసే మార్గాలను ఆలోచన చేయాలి. అప్పుడే మోడీకి ఆదరణ వస్తుంది.



# ఉక్కు పరిశ్రమల ఏర్పాటుకు అడుగేయాలి

## నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలి

**కడప,నేటిధాత్రి:**
దేశంలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం ముఖ్యం. అలాగే ఈ విషయంలో కొంత నష్టం లేదా కష్టం కలిగినా యువతకు ఉపాధి లక్ష్యంగా ముందుకు సాగాలి. అంతేగానీ వీటి ఏర్పాటు సాధ్యం కాదనుకుంటే దేశంలో లక్షలాదిగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కదు. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు సాధ్యం కాదని చెప్పడం వల్ల యువతో ఆందోళన నెలకొని ఉంది. అలాగే స్థానికంగా లభ్యమవుతున్న ముడిసరుకుని విదేశాలకు తరలిస్తున్న తీరును అడ్డుకునేలా లేదు. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు సాధ్యం కాదంటూ కాలయాపన చేయడం వల్ల ఎందరో యువత ఆశలను దెబ్బతీశారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలున్నాయనీ, అనంతపురం గనుల ఖనిజం నాణ్యత ఎక్కువనీ మెకాన్ సంస్థ నిర్ధారించింది. కడప ఉక్కు కర్మాగారానికి ఆ ఖనిజ నిక్షేపాలను కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతనూ తెలిపింది. వీటన్నిటి ఆధారంగా కడప ఉక్కు కర్మాగార ఏర్పాటు సాధ్యమేనని మెకాన్ సంస్థ సమర్పించిన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. ఇలాంటి విషయాల్లో కాలయాపన చేసి చివరికి చేతులెత్తేయడం ద్వారా బృహత్తర లక్ష్యాన్ని దెబ్బతీయడం కాకా మరోటి కాదు. ఇలా చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉన్న అవకాశాలను దెబ్బతీయడం తప్ప మరోటి కాదు. సామాన్య ప్రజలనేగాక న్యాయ వ్యవస్థనూ మోడీ సర్కారు పక్కదారి పట్టించందనే అనుకోవాలి. కడప ఉక్కు విషయంలో మోసాన్ని రాష్ట్ర ప్రజలు ముక్త కంఠంతో నిరసిస్తున్నారు. కడప ఉక్కుపట్ల కేంద్రం ఎంత ప్రతికూలంగా వుందో స్పష్టమవుతోంది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు మూడేళ్ల మాత్రమే ఇచ్చి, తర్వాత నిలిపివేసింది. పోర్టు ఏర్పాటుకూ తిలోదకాలిచ్చింది. ఇలా అనేక అంశాల్లో తెలుగు ప్రజలపట్ల మోడీ సర్కారు ద్వేషపూరితంగా వ్యవహరిస్తోంది. సంకుచిత స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు విరుద్ధంగా అభివృద్ధి సాగాలి. అప్పుడే ఉక్కు పరిశ్రమల ఏర్పాటు సాకారం కాగలదు.

# స్త్రీజనోద్ధరణ పాటుపడిన యోధురాలు

## దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా



**విజయవాడ,నేటిధాత్రి:**
తన జీవితమంతా సమాజ సేవకు ముఖ్యంగా స్త్రీజనోద్ధరణకు అంకితం చేసిన స్ఫూర్తిప్రదాత శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్. ఈమె దేశభక్తురాలిగా, స్వాతంత్ర్య సమరయోధు రాలిగా, సంఘ సంస్కర్తగా, కార్యకర్తగా, రచయిత్రిగా… తన కాలంలో మరెవరూ చూపని ధైర్యసాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచిపోయారు. మన ఆంధ్రరాష్ట్రం గర్వించదగ్గ మహిళా మూర్తుల్లో దుర్గాబాయిని అగ్రగణ్యులుగా చెప్పుకోవచ్చు. 1909 వ సంవత్సరం జూలై 15వ తేదీన కాకినాడలో కృష్ణవేణమ్మ, రామారావు దంపతులకు దుర్గాబాయి జన్మించారు. ఈమె బాల్యంనుండీ ప్రతిభాపాటవాలను కనబరుస్తూ పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసులవారికీ విద్యాబోధన కావించేవారు. అందరూ మనిషులుగానే పుడతారు.. కానీ కొందరు మాత్రమే మహామనుషులుగా నిలుస్తారు. నేటి సమాజంలో వేనూళు కున్న స్వార్థం.. నేను, నావాళ్లు.. అనే పదాలకు పూర్తి భిన్నంగా మేము మావాళ్లు అనే భావనతో సమాజంలో మార్పుకు.. సంఘహితం కోసం చేసిన కార్యక్రమాలకు తమ సొంత డబ్బులు, అస్తులు కూడా అమ్మి నేటికి ఆ కార్యక్రమాలతో మానవ జాతిలో చిరస్థాయిగా తరతరాలుగా నిలిచిపోయిన వారే మహనీయులు. అలాంటి వారిలో దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ఒకరు. ఆమె వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ, ఓ గొప్ప మహోన్నత శక్తి. మేధావిగా, న్యాయ కోవిదు రాలుగా, మానవతావాదిగా, ఆంధ్రమహిళాసభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహామనిషిగా కీర్తి సాధించారు. దుర్గాబాయి తన 11 సంవత్సరాల ప్రాయంలో ఖాదీ ప్రదర్శన జరుగుతున్న సమయంలో ఆమెను వాలంటీర్‌గా నియమించినపుడు ఆ ప్రదర్శనను తిలకించడానికి వచ్చిన పండిట్ నెహ్రూగారిని టికెట్ లేని కారణంగా అనుమతించలేదు… బ్రిటిష అధికారులచే 'ఆడసింహం'గా అభివర్ణించబడ్డ ధీరవనితగా, తనను తాను సంఘానికి సమర్పించుకున్న పూజనీయ వ్యక్తిగా, చైతన్య సేవా స్రవంతిగా అందరినోటా కీర్తించబడ్డ దుర్గాబాయి… 1981 మే 9వ తేదీన హైదరాబాదులో పరమ పదించారు.

# ప్రజాస్వామ్యానికి గంతలు కట్టి కొల్లగొట్టారు

- గనలును దోచేశారు..భూములను లాగేశారు
- ఫేక్ డాక్యుమెంట్లతో అడ్డంగా దోచుకున్నారు
- గనుల శాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు

**అమరావతి,నేటిధాత్రి:**
సహజ వనరులైన భూములు, గనులు, అటవీ సంపదపై కూటమి ప్రభుత్వం సోమవారం శ్వేతపత్రం విడుదల చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ… ప్రజాస్వామ్యానికి గంతలు కట్టి ఆఫీసుల పేరుతో కొట్టేశారన్నారు. చివరకు ల్యాండ్‌ను ఎవ్వరిని అడగకుండా దోచేసేందుకు ఓ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ తెచ్చారని మండిపడ్డారు. గనులశాఖపై సిఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. విశాఖపట్నంలో ఇచ్చిన రామానాయుడు స్టూడియోను రెసిడెన్సియల్ అని చూపించి కొట్టేయాలని చూశారన్నారు. చివరకు సుప్రీకోర్టుకు వెళ్లారన్నారు. హయగ్రీవ భూములు అప్పటి స్థానిక ఎంపీ, శారధాపీఠం, షాహీ హియరింగ్ కాలనీల పేరుతో కొట్టేయాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దస్పల్లా భూములు బలవంతంగా ట్విస్ట్ చేసి అక్కడ భూములు కొట్టేసి నిర్మాణాలు చేశారన్నారు. ఎంవీవీ, ఎంవీకే హౌసింగ్ పరుతో అసంబద్ధమైన ఒప్పందాలు చేసుకొని కొట్టేశారని ఆరోపించారు. ఒంగోలులో ఎన్నో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టిస్తే 77 మందిపై కేసులు పెట్టారన్నారు. ఇది ఇన్వెస్టిగేషన్‌లో ఉందని తెలిపారు. తివరకు తిరుపతిలో సెటిల్మెంట్ ల్యాండ్‌లు, మఠం భూములను 22ఏ ఉపయోగించి కొట్టేశారన్నారు. ఎవ్వరి భూమి అయినా 22ఏ పెట్టి వీరు రిజిష్ట్రేషన్ చేయించుకొని మార్చేశారని తెలిపారు. 982ఎకరాలు పుంగనూరులో అరాచకంగా ఇచ్చేశార న్నారు. రైత్వారీ పట్టాలు ఇచ్చి ఇచ్చేశారని…. అది పెద్దిరెడ్డి నియోజకవర్గమని వెల్లడించారు. 10 వేల ఎకరాలు ఎస్సీ, ఎస్టీ,బిసి, మైనార్టీ భూములు ఎస్సైన్డ్ ల్యాండ్ పేరుతో లాగేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతి లెక్కలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బయటపెడుతున్నారు. ఇందులో భాగంగానే శ్వేతపత్రాలను విడుదల చేస్తున్నారు. తాజాగా సహజ వనరులైన భూములు, గనులు, అటవీ సంపదపై విడుదల చేశారు. స్వయంగా సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గత ప్రభుత్వం అవినీతి ద్వారా సహజ వనరులు ఎలా దోచుకుంది..? పర్యవరణానికి ఎలాంటి ఇబ్బందులు గురించేసింది..? అనే విషయాలను పూసగుచ్చినట్లుగా వివరిస్తున్నారు. గత ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం సహజవనరులు దోపిడీ చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం అడవులను కూడా ధ్వంసం చేసిందని ఆరోపించారు. భూములు, ఖనిజాలు, అటవీ సంపద దోపిడీ జరిగిందని, వైసీపీ ప్రభుత్వం కొత్త విధానంతో దోపిడీ జరిగిందని విమర్శలు చేశారు. విశాఖ, ఒంగోలు, చిత్తూరులో భూకబ్జాలు చేశారని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణం పేరుతో వైసీపీ నేతలు దందాలకు దిగారని సీఎం చంద్రబాబు ఆరోపణలు చేశారు. అవినీతి ద్వారా సహజవనరులు ఎలా దోచు కుంటారు, పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు తెస్తారో చూశాం. గత ప్రభుత్వంలో పంచభూతాలను దోపిడి చేశారు. భూములు లిటిగేషన్ తెచ్చి కొట్టేయడం. గతంలో ఇండియన్ ఫారెస్ట్



సర్వీసును సైతం ఏర్పాటు చేసి అడవులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చాం. అయితే ఇప్పుడు అడవులను కూడా వైసీపీ నేతలు ధ్వంసం చేశారు. ఇప్పుడు నేను చెప్పే రికార్డులు ఒకవంతు అయితే వాస్తవానికి మూడు, నాలుగు రెట్లు విధ్వంసం జరిగింది. పట్టణప్రాంతాల్లో ఉన్న భూములు అంటే ఉదాహరణకు కావాలి, నెల్లూరు, ధర్మవరంలో కూడా మార్నింగ్ వాక్ పేరుతో దోచేశారు. హౌస్ సైట్స్ పేరుతో ఈ దందాను నడిపించారు. ప్రజాస్వామ్యా నికి గంతలు కట్టి ఆఫీసులు పేరుతో కట్టేశారు. చివరకు ల్యాండ్‌ను ఎవ్వరిని అడకుండా దోచేసేందుకు ఓ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ తెచ్చారు' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎవ్వరి భూమి అయినా 22ఏ పెట్టి వీరు రిజిష్ట్రేషన్ చేయించుకొని మార్చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో 982ఎకరాలు పుంగనూరులో అరాచకంగా ఇచ్చేశారు. రైత్వారీ పట్టాలు ఇచ్చి ఇచ్చేశారు. 10వేల ఎకరాలు ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ భూములు అసైన్డ్ ల్యాండ్ పేరుతో ఆక్రమించారు. హౌసింగ్ కాలనీ ఎక్కడ రావాలో వైసీపీ నేతలే డిసైడ్ చేస్తారు. వాటికి ఎక్కువ రేటు పెట్టి కొట్టేశారు. ఆవభూములు, ఊరుకు దూరంగా ఉన్న భూములు, పొలాలకు వెళ్లే భూములు, శ్మశానాలు కూడా ఇళ్లనిర్మాణానికి ఇచ్చారు. 361 ఎకరాలు 161 కోట్ల రూపాయలుకు ఇచ్చారు. నివాసయోగ్యం కాని భూములు ఇచ్చారు. 286ఎకరాలను రూ.185కోట్లుకు కొనుగోలు చేశారు. గన్నవరంలో కూడా మార్కెట్ రేట్ల కంటే 5 రెట్లు ఎక్కవ ఇచ్చి దోచేశారు' అని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అనే ఓ చట్టాన్ని తెస్తున్నాం. ఇందులో నిరూపించుకోవవాల్సిన బాధ్యత గ్రాబర్‌కు ఉంటుంది. గుజరాత్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 2020 లైన్స్ లోనే ఈ చట్టం తెస్తాం. మైనింగ్ విషయంలో భారీగా పెనాల్టీ వేసి ఇబ్బందులు పెట్టారు. ఒక్క మైనింగ్ విషయంలోనే రూ.20వేల కోట్లు దోపిడీ చేసి ఉండొచ్చు అయితే అంతకు మించి అవినీతి చేసి ఉంటారు. ఇసుక మైనింగ్‌లో రూ.7వేల కోట్లు, డబ్బులు ఎగ్గొట్టాలని చూస్తున్నారు. ఇప్పుడు కూడా సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసి కేసును ఆగస్టు నెలకు వాయిదా వేసింది. టా÷–గ్గ÷ట్ చేస్గి÷న్లు వేయడం, నిబందనలు పాటించకుండా మైనింగ్‌లో దోపిడీ చేశారు. 2016లో ఉచిత ఇసుక ఉండేది నిర్మాణ రంగానికి బూస్టు ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక నియంత్రణ చేసి 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉద్యోగాలు లేకుండా చేశారు. 130మంది భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు' అని సీఎం చంద్రబాబు తెలిపారు.



# ప్రజలను తప్పదోవ పట్టించేలా ప్రకటనలు

## బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ షబ్బీర్ అలీ

**కామారెడ్డి,నేటిధాత్రి:**
ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని మాజీమంత్రి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల పేరుతో 9ఏళ్లల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారీగా సంపాదించారని షబ్బీర్ ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, కరెంట్, జీతాలు తదితర విషయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ చేస్తోందని అన్నారు,. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. మిషన్ భగీరథ పెద్ద ఫ్రాడ్ అని తేలిందని అన్నారు. ధరణి ఒక దుర్మార్గమైన సాఫ్ట్‌వేర్ అని కూడా తేలిపోయిందని మండిపడ్డారు. ఏ గ్రామంలో మిషన్ భగీరథ నీళ్ళు రావడం లేదన్నారు. పైపులు, ట్యాంకులు ఉన్నాయి గానీ నీళ్ళు రావడం లేదన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని స్పష్టం చేశారు. కరెంట్ కోసం బీఆర్ఎస్ చేసింది ఏంటి అని ప్రశ్నించారు. అప్పుడు చేసి మింగారని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల పేరుతో నిధులు దిర్వినియోగం చేశారని అన్నారు. అయినా బీఆర్ఎస్ నేతలకు అవగాహన రావడం లేదని విమర్శించారు. ఉచిత విద్యుత్‌పై బీఆర్ఎస్ చేసింది ఏంటి అని ఆయన ప్రశ్నించారు. 1999 మేనిఫెస్టో లోనే ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పామన్నారు. 'మేము చేసిన పనిని కంటిన్యూ చేస్తూ మేం చేస్తున్నాం అని చెప్తే ఎలా?' అంటూ నిలదీశారు. బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్, హరీష్ పని అయిపోయిందన్నారు. ఎత్తిపోయిన బీఆర్ఎస్ గురించి ఏం మాట్లాడుతాం అంటూ వ్యాఖ్యలు చేశారు. లక్షల కోట్ల రూపాయలు దండుకోవడం తప్పా కేసీఆర్ ఏం చేయలేదన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని కుటుంబం ఉండకూడదు అనేది కాంగ్రెస్ పాలసీ అని అన్నారు. అందుకే ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అందరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సింగరేణి సంస్థ రాష్ట్ర అస్థి. గనులన్ని సింగరేణికి ఉండేలా చూస్తామన్నారు. ప్రభుత్వ అండతో ప్రైవేట్ సంస్థలు శ్రమ దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. ధరణి వల్ల లక్షల మంది తమ భూములపై హక్కులు కోల్పోయారన్నారు. ధరణి వల్ల ప్రజలకు చాలా నష్టం కలిగిందని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ద్వారా ప్రజల సంపద ప్రజలకు పంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజల అవసరాలే తమ అజెండా అన్నారు. గతంలో సంపద, వనరులు, స్వేచ్ఛ పాలకులకే పరిమితమయ్యాయని అన్నారు. తాము ఏం చేశామో ప్రజలకు తెలుసన్నారు. తొమ్మిది ఏండ్లలో ఏదో అద్భుతం జరిగినట్టు కేసీఆర్ భ్రమ కల్పిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ వనరులను ప్రభుత్వ పెద్దలు దోచేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ యువత కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు. ధరణితో తమ భూములు తమకు కాకుండా చేసారని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పూర్తిగా ఫెయిల్ అయిందన్నారు. కేసీఆర్ పాలనలో ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని చెప్పుకొచ్చారు. తెలంగాణలో స్వేచ్ఛనే లేకుండ పోయిందన్నారు. భయం భయంగా బతకాల్సిన పరిస్థితి తెలంగాణలో ఉండేదన్నారు. పోలీస్ వ్యవస్థ అధికార పార్టీ ఎమ్మెల్యేల చేతిలోకి పోయిందన్నారు. ఇవన్నీ పోయి ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛగా బతుకుతున్నారని, ఇచ్చిన హామీల అమలుకు సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

# మాకొద్దీ తెల్లదొరమంటూ.. ఎలుగెత్తిన మహాకవి

## జాతీయ కవి శ్రీ గరిమెళ్ల సత్యనారాయణ



**శ్రీకాకుళం,నేటిధాత్రి:**
గరిమెళ్ల సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించారు. 'మాకొద్దీ తెల్లదొర మంటూ..' గేయం రాసి పాడి నాటి ఉద్యమకారుల్లో స్ఫూర్తి రగిలించిన మహోన్నత వ్యక్తి గరిమెళ్ల సత్యనారాయణ.. జాతీయ గేయకవిగా ప్రసిద్ధి పొంది తన గీతాల తూటాలతో బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించడమే కాకుండా వారి ఆగ్రహానికి గురై జైలు జీవితాన్ని అనుభవించిన వ్యక్తి గరిమెళ్ల.. దేశభక్తిపై గరిమెళ్ల రాసిన కవితలు అప్పటి కలెక్టర్ బ్రేకన్ ఆగ్రహానికి గురై జైలుశిక్ష అనుభవించిన వారిలో మొదటి వారు.. జాతీయోద్యమంలో శ్రీకాకుళం జిల్లా కీర్తిని ఇనుమడింపజేసిన జాతీయ గేయకవి, గరిమెళ్ల సత్య నారాయణ స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా ప్రియాగ్రహారం.. 1920 డిసెంబర్‌లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో సహాయ నిరాకరణ తీర్మానంతో స్ఫూర్తి పొంది ఆ వీరావేశంతో ఉద్యమంలోకి గరిమెళ్ల ప్రవేశించారు. 'మాకొద్దీ తెల్లదొర తనమూ.. దేవ' రాసిన గీతానికి జైలుశిక్ష అనుభవించారు. ఆ తరువాత బయటకు వచ్చిన ఆయన ప్రజల్లోకి వెళ్లి బ్రిటిష్ వారికి గడగడలాడించే అనేక గేయా లు రాసి పాడి గంభీరంగా పాడి స్ఫూర్తి రగిలించారు. దీనిని గమ నించిన నాటి బ్రిటీష్ అధికారులు ఆయనకు కాకినాడ మేజి స్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ రెండేళ్ల కారాగార శిక్ష విధించారు. ఆయన జైలులో ఉండ గానే 1923లో తండ్రి వెంకటనరసింహం మృతి చెందారు. క్షమాపణ చెబితే విడిచిపెడతామని అధికారులు పేర్కొన్నా దానిని ధిక్కరించి ఆయన శిక్షను పొందారు. కొద్ది రోజుల్లోనే భార్య మరణించారు. అప్పుల పాలై తన ఆస్తులను కూడా విక్ర యించుకోవాల్సి వచ్చింది. ఎన్నో రచనలు చేయడమే కాకుండా ఆల్‌ఇండియా రేడియో ప్రసారానికి రచనలు చేశారు. చివరిదశలో ఆరోగ్యం క్షీణించి దుర్భర జీవితాన్ని అనుభవించి మద్రాసు వీధుల్లో భిక్షాటన చేసుకుంటూ గడిపాడు..స్వాతంత్ర్యానంతరం దేశంలో ప్రబలిన అవినీతికి విసిగి వేసారిన గరిమెళ్ల మిత్రుల్లో కొందరు ఆయనను 'మాకొద్దీ నల్లదొరతనము..' అంటూ కొత్త పాట రాయాల్సిందిగా కోరారు. అయితే, నరనరానా దేశభక్తిని జీర్ణించుకున్న ఆయన అందుకు అంగీకరించలేదు. 1952 డిసెంబరు 18న మృతి చెందారు. స్వాతంత్య సమరంలో చేసిన సేవలకు గుర్తుగా 1993లో స్వగ్రామం ప్రియాగ్రహారంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు.

# ఎంత ఎదిగినా ఒదిగి ఉండాల్సిందే

**గుంటూరు,నేటిధాత్రి:**
వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డుపైకి రావాలంటే భయమేసే పరిస్థితి ఉండేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టాలంటే భయం. ఇంట్లో వాళ్లపై కూడా దుర్భాషలాడిన పరిస్థితిని చూశామని అన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల భేటీలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు సభ్యుడిని బంధించి కొట్టించిన తీరు చూశాం. సుదీర్ఘ అనుభవం, సీఎంగా పనిచేసిన చంద్రబాబును కూడా జైలులో పెట్టారు. అడ్డగోలుగా ఇసుక దోపిడీ, భూ కుంభకోణాలు చేశారు. అందుకే ఐదు కోట్ల మంది ఒక్కటై అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని అన్నారు. నేను ప్రధాని మోదీ గుండెల్లో ఉన్నా.. ఆయన పక్కన నిల్చొని ఫొటో దిగాల్సిన అవసరం లేదు. అధికారం కోసం కాదు.. ప్రజల కోసం పోరాటం చేశాం. జనసేన తీసుకున్న మంత్రి పదవులు కూడా ప్రజలతో నిత్యం సంబంధం ఉన్నవి. మన పార్టీ ఎంపీలు ప్రజా సమస్యలపై పార్లమెంటులో మాట్లాడాలని అన్నారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఎంత సాధించినా తగ్గి ఉండటం అవసరం. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కూడా ఇలాంటి మెజార్టీ రాలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నాతో అన్నారు. వైకాపా వాళ్లు మనకు ప్రత్యర్థులు మాత్రమే, శత్రువులు కాదు. చేతగాక కాదు.. కక్ష సాధింపు చర్యలు ఎవరికీ మంచిది కాదు. వైకాపా చేసిన తప్పులు మనం చేయకూడదని అన్నారు. అలాగని వాళ్లు చేసిన తప్పులు సహించేదిలేదు.. చట్టపరంగా చర్యలు ఉంటాయి. జనసేన తరపున పోటీ చేసిన మొత్తం 21 మందిని గెలిపించారు. పోటీ చేసిన చోటే కాదు.. చేయని చోట్లా వీర మహిళలు, జనసైనికులు తీవ్రంగా పోరాడారు. బాధ్యతలు మోసే ప్రతిఒక్కరికీ నేను అండగా ఉంటానని అన్నారు. జనసైనికులు, వీర మహిళలు నావైపు బలంగా నిలబడ్డారు. ఎలాంటి పదవి ఆశించకుండా పోరాడారు. ఊహించని మెజారిటీతో గెలవడం గొప్ప విషయం. పంచాయతీల్లో బ్లీచింగ్‌కు కూడా డబ్బులు లేవు. ఏడీబీ ద్వారా నిధులు తెచ్చేందుకు మాట్లాడుతున్నాం. సీఎం చంద్రబాబు అనుభవం
రాష్ట్రానికి అవసరం. నేను ప్రధాని మోదీని ఇప్పటివరకూ ఏం అడగలేదు. ఇప్పుడు రాష్ట్రం కోసం అడుగుతా. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దని చెబుతా. రైల్వే జోన్ ఏర్పాటు గురించి, 25 లక్షల ఉద్యోగాలు కావాలని అడుగుతా అని పవన్ తెలిపారు. పార్టీని అంచెలంచెలుగా పెరిగేలా చేయడంలో పవన్ చాలా ఓపికతో.. వ్యూహంతో వ్యవహరించారని మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ తరపున గెలిచిన ప్రజా ప్రతినిధులను అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సత్కరించారు. ముందుగా మంత్రి నాదెండ్లను సత్కరించారు. ప్రజా ప్రతినిధులకు శాలువా కప్పి, గిఫ్ట్ గా కూరగాయలు అందించి పవన్ సన్మానించారు. అనంతరం పవన్ కళ్యాణ్‌ను జనసేన ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ… కూటమి ప్రభుత్వంలో ఉన్నామని… మిత్రపక్షాలతో సమన్వయంతో వెళ్లాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బంది.. మచ్చ రాకుండా అందరూ పని చేయాలని మంత్రి సూచించారు. పదవులు మనకొచ్చాయి.. కానీ మన కోసం పని చేసిన జనసైనికులు, వీర మహిళలను మరువద్దు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి. పార్టీ మీద, ప్రభుత్వం మీద దుష్ప్రచారం మొదలు పెడతారు.. తిప్పి కొట్టాలి. కూటమి ప్రభుత్వం అమలు చేసే పథకాలు.. అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలి. నిజాయితీగా పని చేయాలి. గత ప్రభుత్వం సంక్షేమం పేరుతో దోపిడీ చేసింది. త్వరలో క్రియాశీల సభ్యత్వాన్ని ప్రారంభించనున్నాం. గతంలో తక్కువ సంఖ్యలోనే క్రియాశీలక సభ్యులను చేర్పించాం. ఇప్పటి వరకు సుమారు కార్యకర్తలకు ఆర్థిక సాయం కింద రూ. 18 కోట్లు అందించామని చెప్పుకొచ్చారు.
ప్రభుత్వంలో ప్రతి జనసైనికుడూ భాగస్వామే అని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసే శ్వేత పత్రాలపై అవగాహన పెంచుకోవాలని.. ప్రజలకు వివరించాలన్నారు. ఇది మన ప్రభుత్వమని.. పార్టీకి.. పవన్‌కు మంచి పేరు వచ్చే విధంగా పని చేయాలన్నారు. పవన్ కళ్యాణ్ టీం అంటే ఇదీ అని అందరూ గొప్పగా చెప్పుకునేలా పని చేయాలన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు సైలెంటుగా ఓటేశారని.. ఎన్నికల ముందు వరకు ఏ మాత్రం బయటపడని ప్రజలు.. ఎన్నికల్లో తామేంటో చూపించారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# ఆగస్టు నాటికి రైతులకు రుణమాఫీ



**హనుమకొండ ,నేటిధాత్రి:**
రైతు భరోసా పథకం అమలుపై తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. రైతు భరోసా 5 ఎకరాలకు ఇవ్వాలా, 10 ఎకరాల వరకు ఇవ్వాలనే అంశంపై క్షేత్ర స్థాయిలో రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకుంటుంది. ఉమ్మడి జిల్లాల వారీగా రైతు భరోసాపై ప్రభుత్వం వర్క్ షాప్‌లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రైతులతో సమావేశమై వారిచ్చే సలహాలు, సూచనలను కూడా మంత్రి వర్గ ఉప సంఘం ఆచరణలోకి తీసుకుంటుంది. ఈ రోజు(సోమవారం) వరంగల్లోని కలెక్టర్ కార్యాలయంలో రైతు భరోసాపై వర్క్‌షాప్ నిర్వహించారు.
ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. రైతు భరోసా పథకానికి సంబంధించి విధి, విధానాలపై మంత్రులు ఈ సమావేశంలో చర్చించారు. ఈ కమిటీ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పరిస్థితులు, సాగు విస్తీర్ణం, రైతాంగ స్థితిగతులపై అధ్యయనం చేస్తుంది. అయితే రైతులతో చర్చించిన తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలు కీలక విషయాలు మీడియాకు వెల్లడించారు.
రైతు భరోసా సదస్సులో పాల్గొన్న రైతుల అభిప్రాయం క్రోడీకరిస్తామని తెలిపారు. అందరి సలహాలు నోట్ చేసుకున్నామన్నారు. అన్నింటినీ ప్రభుత్వం పరిశీలిస్తుందని అన్నారు. అందరి అభిప్రాయానికి తగినట్టుగా సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. వరంగల్ నుంచే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రైతు భరోసా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్ లాంటి పథకాలు అమలు చేశామని వివరించారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు ఒక సారి ఇచ్చామని.. ఇప్పుడు రైతు భరోసాపై అమలుకు విధి విధానాల రూపకల్పన కోసం విస్తృత స్థాయిలో అభిప్రాయ సేకరణ చేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీలో ఒక రోజంతా చర్చిస్తామని అన్నారు. రైతులకు అందించే భరోసా సొమ్ము ప్రజలు టాక్స్ రూపంలో చెల్లించినవేనని అన్నారు. అందుకే ప్రతి పైసా సక్రమంగా వినియోగం కోసం అన్నివర్గాల నుంచి సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటున్నామని తెలిపారు.
రైతులకు బీమా సౌకర్యం కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ఇన్సూరెన్స్ కంపెనీలతోను చర్చలు జరుపుతున్నారని వివరించారు. తమ ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చేశామని రైతులు స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. రైతుల అభిప్రాయాలు క్రోడీకరించి శాసన సభలో చర్చిస్తామని అన్నారు.
చర్చించిన తర్వాతే రైతు భరోసా అమలు చేస్తామని అన్నారు. వచ్చే ప్రతీ చిన్న ఆదాయాన్ని పొగిచేసి ప్రజలకే పంచుతామని చెప్పారు. ప్రజల అభిప్రాయమే గవర్నమెంట్ జీవోగా వస్తుందని చెప్పారు. త్వరలోనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతున్నామని అన్నారు. రైతు భరోసాతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ లాంటి అంశాలు కూడా పరిగణనలోకి తీసుకుంటామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు..

# స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు



**హైదరాబాద్,నేటిధాత్రి:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంచాయతీల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.
గత పంచాయతీ ఎన్నికల అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు సీఎం రేవంత్‌కు వివరించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని సీఎం అధికారులను ప్రశ్నించారు. కర్ణాటకలో 2015 లో, బిహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేసిన వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు.
2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కుల గణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందని, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కుల గణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు.
బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సమావేశంలో రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది.
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర మాజీ మంత్రి కె.జానారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.
ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాల క్రమ పట్టిక రూపొందించాలని, ఏవైనా సందేహాలు వస్తే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వకేట్ జనరల్‌తో చర్చించాలని సూచించారు.
మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విషయాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఇదేనా కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు..?



**హైదరాబాద్ ,నేటిధాత్రి:**
మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఆర్కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారిన సంగతి తెలిసిందే. ప్రొటోకాల్ ఉల్లంఘించి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకునితో చెక్కులు పంపిణీ చేయించడంపై మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేజ్ కిందనే కూర్చొని ఆమె నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఓడిపోయిన అభ్యర్థులు స్టేజ్ పైన.. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ఎమ్మెల్యే స్టేజ్ కిందనా.. అంటూ రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ నిలదీశారు. అఫీషియల్ ప్రోగ్రాంలో ఓడిపోయిన అభ్యర్థులకు పని ఏంటి..? ఇదేనా కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు..? ఇదేనా ప్రజా పాలన..? అంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మాజీ మంత్రి, ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సబితా ఇంద్రారెడ్డి ఒక ఎమ్మెల్యేగా తన హక్కుల కోసం నిరసన తెలపాల్సి వచ్చింది. ప్రజలచే తిరస్కరించబడిన వారేమో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇదేం దౌర్జన్యం అంటూ తెలంగాణ సీఎంవో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజా పాలనలో ప్రజా ప్రతినిధులను ఇలాగే గౌరవిస్తారా..? అని నిలదీశారు కేటీఆర్.

# రైతు రుణమాఫీకి మార్గదర్శకాలు విడుదల

## రేషన్ కార్డు ఆధారంగా రైతుల గుర్తింపు



**హైదరాబాద్,నేటిధాత్రి:**
పంటల రుణమాఫీకి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాల బకాయిలకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుందని, రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్‌కార్డు ప్రామాణికమని తెలిపింది. పంట రుణమాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయనున్నారు. రుణమాఫీ నగదు నేరుగా లబ్దిదారుల రుణఖాతాల్లోనే జమకానుంది. ఆరోహణ క్రమంలో రుణమాఫీ సొమ్ము విడుదల చేస్తారు. ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఆర్ఎంజీ, ఎల్ఈసీఎస్ రుణాలకు, రీషెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు. రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రైతు సమస్యలు ఉంటే 30 రోజుల్లో పరిష్కారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్ చూడొచ్చు. లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించవచ్చని తెలిపింది.
అన్ని వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార బ్యాంకుల నుంచి రైతులు ఈ కాలంలో రుణాలు తీసుకుంటే వారికి కూడా రుణమాఫీ వర్తించనుంది. వ్యవసాయశాఖ కమిషనర్, సంచాలకులు (డీఓఏ) పంట రుణమాఫీ 2024 పథకాన్ని అమలు చేస్తారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పథకానికి భాగస్వామిగా ఉంటుంది. వ్యవసాయశాఖ సంచాలకులు, ఎస్బీఐ కలిసి ఐటి పోర్టల్ నిర్వహిస్తారు. ఆ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఐటి పోర్టల్ ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌కి బిల్లులు సమర్పించడం, పథకానికి సంబంధించిన భాగస్వాములతో సమాచారం పంచుకోవడం, రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయి. పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికారిగా (బీఎన్) నియమిస్తారు. బ్యాంకు నోడల్ అధికారి బ్యాంకులకు వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. బ్యాంక్ నోడల్ అధికారులు తమ సంబంధిత బ్యాంక్ యొక్క పంట రుణాల డేటాను డిజిటల్ సంతకం చేయాల్సి ఉంటుంది.

# ఢిల్లీలో నిరసనలు తెలపాలి

## ఢిల్లీలో తెలంగాణ నిరుద్యోగుల దీక్షకు అనుమతి కోరిన మోతీలాల్ నాయక్



**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
తెలంగాణలోని నిరుద్యోగులంతా నిరసన బాట పట్టిన సంగతి తెలిసిందే. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 పిలవాలని, గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలని, డీఎస్సీని వాయిదా వేయాలని గత కొద్ది రోజుల నుంచి నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం నిరుద్యోగులు ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్ నగర్, చిక్కడపల్లి లైబ్రరీతో పాటు ఎక్కడికక్కడ నిరసన వ్యక్తం చేశారు. వారం పది రోజుల క్రితం టీజీపీఎస్సీ ముట్టడికి కూడా యత్నించారు.
కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల డిమాండ్లపై ఇప్పటికీ స్పందించలేదు. దీంతో నిరుద్యోగులు ఢిల్లీలో తమ నిరసనలు తెలపాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ.. జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందుకు అనుమతి కోసం ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ పోలీసు ఆఫీసర్‌ను నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్ నాయక్ కలిశారు. జంతర్ మంతర్ వద్ద ఈ నెల 16వ తేదీన తెలంగాణ నిరుద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.
ఇక రెండు రోజుల క్రితం అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు భారీ ధర్నా చేపట్టారు. తెల్లవారుజాము 3 గంటల వరకు తమ నిరసనను కొనసాగించారు. దీంతో నిన్న ఉదయం అశోక్‌నగర్‌లో పోలీసులు భారీగా మోహరించారు. సోమవారం చిక్కడపల్లి లైబ్రరీ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తంగా చిక్కడపల్లి లైబ్రరీ లోపలనే వందలాది మంది నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్ -2, 3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా, డీఎస్సీని వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# రైతుల వలపోతల కంటే వడపోతలపైనే ఎక్కువ దృష్టి..



**హైదరాబాద్,నేటిధాత్రి:**
రుణమాఫీ పథకం అమలు విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు చూస్తే, రైతుల వలపోతల కంటే వడపోతలపైనే ఎక్కువ దృష్టి పెట్టిందనే విషయం స్పష్టంగా అర్థమవుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. పంటల రుణమాఫీ విషయంలో ఎన్నికల సమయంలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఒక మాట మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. చెప్పేది ఒకటి, చేసేది ఒకటి అనే పద్ధతి చెయ్యి గుర్తు పార్టీకి అలవాటుగా మారింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.
డిసెంబర్ 12, 2018 వరకు ముందున్న రైతులకు వర్తించదు అనే నిబంధన అసమంజసం. రైతుకు రుణభారం తగ్గించే ప్రయత్నం కన్నా ప్రభుత్వ భారం తగ్గించుకునే ప్రయత్నమే ఎక్కువ కనపడుతున్నది. ఆహార భద్రత కార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికం అని ప్రకటించడం అంటే లక్షలాది రైతుల ఆశలపై నీళ్లు చల్లడమే. ఎన్నికలప్పుడు మభ్య పెట్టారు, అధికారం చేజిక్కించుకున్న తర్వాత ఆంక్షలు పెట్టారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

### మార్గదర్శకాలు ఇవే..

1. తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుంది.
2. ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు వర్తిస్తుంది.
3. తెలంగాణలో రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు.. వాటి బ్రాంచ్‌ల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది.
4. 12.12.2018 తేదీన లేదా ఆ తర్వాత మంజూరైన లేక రెన్యువల్ అయిన రుణాలకు, 09.12.2023 తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది.
5. ఈ పథకం కింద ప్రతి రైతు కుటుంబం రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీకి అర్హులు. 09.12.2023 తేదీ నాటికి బకాయి ఉన్న అసలు, వర్తింపయ్యే వడ్డీ మొత్తం పథకానికి అర్హత కలిగి ఉంటుంది.
5. రైతు కుటుంబం నిర్ణయించడానికి పౌరసరఫరాల శాఖ వారు నిర్వహించే ఆహార భద్రత కార్డు(రేషన్ కార్డు) డేటాబేస్ ప్రామాణికంగా ఉంటుంది. కాబట్టి అట్టి కుటుంబంలో ఇంటి యజమాని జీవిత భాగస్వామి పిల్లలు మున్నగు వారు ఉంటారు.
6. అర్హత గల రుణమాఫీ మొత్తాన్ని డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్దిదారుల రైతు రుణఖాతాలకు జమ చేయబడుతుంది. పీఏసీఎస్ విషయంలో రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీ లేదా బ్యాంకు బ్రాంచికి విడుదల చేస్తారు. ఆ బ్యాంకు వారు రుణమాఫీ మొత్తాన్ని పీఏసీఎస్‌లో ఉన్న రైతు ఖాతాలో జమ చేస్తారు.
7. ప్రతి రైతు కుటుంబానికి 09.12.2023 తేదీ నాటికి ఉన్న రుణ మొత్తం ఆధారంగా ఆరోహణ క్రమంలో రుణమాఫీ మొత్తాన్ని జమ చేయాలి.
8. ప్రతి రైతు కుటుంబానికి 09.12.2023 నాటికి కలిగి ఉన్న మొత్తం రుణం కానీ లేక రూ. 2 లక్షల వరకు ఏది తక్కువ అయితే ఆ మొత్తాన్ని ఆ రైతు కుటుంబం పొందే అర్హత ఉంటుంది.
9. ఏ కుటుంబానికి అయితే రూ. 2 లక్షలకు మించిన రుణం ఉంటుందో, ఆ రైతులు రూ. 2 లక్షలకు పైబడి ఉన్న రుణాన్ని మొదట బ్యాంకులకు చెల్లించాలి. ఆ తర్వాత అర్హత గల రూ. 2 లక్షల మొత్తాన్ని రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేస్తారు.
10. రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న పరిస్థితుల్లో కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేసి, మిగులు మొత్తాన్ని దామాషా పద్ధతిలో కుటుంబంలో పురుషుల పేరు మీద తీసుకున్న రుణాలను మాఫీ చేయాలి.

# ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారం

- అక్రమ తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్
- ఆగస్ట్ 2 వరకు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. అక్రమ తవ్వకాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. మరిన్ని వివరాలు కోర్టు ముందుంచేందుకు కొంత సమయం కోరింది. గతంలో అధికారులు దాఖలు చేసిన నివేదికలపై అనుమానాలున్నాయని పేర్కొంది. వాస్తవాలు దాఖలు చేయలేదంటూ మీడియాలోనూ కథనాలు వచ్చాయని గుర్తుచేసింది. నివేదికలన్నీ పునఃపరిశీలించి ఆధారాలతో వివరాలు సేకరిస్తామని తెలిపింది. పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు చెప్పారు. మరోవైపు పూర్తిస్థాయి నివేదిక సమర్పణకు తమకూ సమయం కావాలని కేంద్రం కోరింది. 6 వారాల సమయం కావాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇప్పటికే తాము 7 జిల్లాల్లో తనిఖీలు జరిపి నివేదికను కోర్టు ముందుంచినట్లు చెప్పింది. మిగిలిన జిల్లాల్లోనూ తనిఖీలు జరిపేందుకు 6 వారాల సమయం కావాలని కోరింది. తమ ఆధారాలు పరిగణనలోకి తీసుకోవాలని పిటిషనర్ దండా నాగేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న జస్టిస్ అభయ్ ఎస్ వోకా ధర్మాసనం విచారణను ఆగస్టు 2కు వాయిదా వేసింది. ఆగస్టు 2 కల్లా ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.
గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమాలకు సంబంధించి పిటిషన్‌పై సోమవారం సుప్రీంలో విచారణకు వచ్చింది. జస్టిస్ అభయ్ ఒకా ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. తదుపరి విచారణను ఆగస్టు 2కు ఉన్నతన్యాయస్థానం వాయిదా వేసింది. ఏపీలో ప్రభుత్వం మారిందని ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాది హుజెఫా అహ్మదీ... సుప్రీంకోర్టుకు తెలిపారు. గత అధికారులు ఇసుక తవ్వకాల్లో పెద్దగా ఉల్లంఘనలు జరగలేదని నివేదిక ఇచ్చారన్నారు. అదే సమయంలో మీడియాలో అందుకు విరుద్ధంగా ప్రసారాలు వచ్చాయని.. అందువల్ల రెండిటినీ పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం సమయం కోరిందని కోర్టుకు తెలిపారు. నివేదికతో పాటు ఉల్లంఘనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో 7 జిల్లాల్లో అక్రమ ఇసుక తవ్వకాలపై తనిఖీలు పూర్తి చేసామని, మరో ఆరు జిల్లాల్లో తనిఖీలు చేయాల్సి ఉందని సుప్రీంకోర్టుకు కేంద్ర పర్యావరణ శాఖ తరపు న్యాయవాది తెలిపారు. మరో ఆరు జిల్లాల్లో సర్వే పూర్తి చేసేందుకు ఆరు వారాల సమయం ఇవ్వాలని కోరారు. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలపై కేంద్ర పర్యావరణ శాఖ మధ్యంతర నివేదిక ఫైల్ చేసింది. ఏపీలో ఇసుక అక్రమాలపై పూర్తి స్థాయి నివేదిక ఫైల్ చేస్తామని సుప్రీంకోర్టుకు పర్యావరణ శాఖ తరపు న్యాయవాది తెలియజేశారు. ఈ క్రమంలో ఏపీలో ఇసుక అక్రమాలపై విచారణను సుప్రీం ధర్మాసనం ఆగస్టు 2కు వాయిదా వేసింది. కాగా... ఏపీలో ఇసుక అక్రమాలపై గతంలో కూడా సుప్రీం సీరి యస్ అయిన విషయం తెలిసిందే. ప్రతి ఇసుక రీచ్‌ను సందర్శించి అక్కడ జరిగిన అక్రమాలపై నివేదిక ఇవ్వాలని కేంద్ర కమిటీకి సుప్రీం ఆదేశించింది. ఇసుక అక్రమాలను ఖరారు చేసి గతంలో జేపీ వెంచర్స్‌కు గ్రీన్ ట్రిబ్యునల్ భారీ జరిమానా విధించిన సంగతి విధితమే.

# డీఎస్సీని వాయిదా వేయాలి



**హైదరాబాద్,నేటిధాత్రి:**
తెలంగాణ సెక్రటేరియట్ వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయడం సహా, బీసీ కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు వంటి ప్రధాన డిమాండ్లతో బీసీ జనసభ నాయకులు, నిరుద్యోగులు సచివాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సచివాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా ఆందోళన కారులను అరెస్ట్ చేసి డీసీఎం వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగుల సెక్రటేరియట్ ముట్టడి పిలుపులో భాగంగా బీసీ జనసభ కార్యకర్తలు సచివాలయంలోకి చొచ్చుకెల్లేందుకు ప్రయత్నిం చారు. ఈ క్రమంలో నిరుద్యోగలు, జనసభ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకున్నది. సెక్రటేరియట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీసీ జనసభ కార్యకర్తలను పోలీసులు పట్టుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో హోరెత్తింది. జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా కార్యకర్తలను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో డీఎస్సీని వాయిదా వేయాలని రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదావేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్ 2, 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్-1 మెయిన్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలనే డిమాండ్లతో నిరుద్యోగులు, ఉద్యోగార్థులు రాష్ట్ర సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సెక్రటేరియట్ పోలీసుల వలయంలోకి వెళ్లింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలిరానున్న నేపథ్యంలో సచివాలయం వద్ద భారీగా పోలీసులును మోహరించారు. బాహుబలి బారికేడ్లు, ఇనుపకంచెలు, వాటర్ క్యానన్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి సచివాలయ ముట్టడికి తరలివస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. ఇదిలావుంటే నిరుద్యోగ యువకులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం దుర్మార్గ పూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వారి సమస్యలను సానుకూల దృక్పథంతో నెరవేర్చాల్సింది పోయి నిర్బంధం పెడతూ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల డిమాండ్ల కోసం సెక్రటేరియేట్ ముట్టడికి ప్రయత్నించిన రాజారాం యాదవ్ సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయటాన్ని కేటీఆర్ ఖండించారు. రాజారాం యాదవ్ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని నమ్మబలికిన సర్కార్ ఇప్పుడు వారిని గాలికి వదిలేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకురావటం, శాంతియుతంగా ఆందోళన చేయటం కూడా ఈ ప్రజాపాలన నిషేధమా అని కేటీఆర్ ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం అణిచివేత ధోరణిని సాగిస్తుందని ఇది ఎంత మాత్రం మంచిది కాదని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన రాజారాం యాదవ్ సహా మిగతా విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వారిని ఇప్పుడు పట్టించుకోవటం మానేసిందని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న డిమాండ్లను పరిష్కరించకుంటే ఏ నిరుద్యోగులను రెచ్చగొట్టి గద్దెనెక్కారో ఇప్పుడు వాళ్లే ఈ ప్రభుత్వం పతనానికి కారణమవుతారన్నారు. నిరుద్యోగ డిమాండ్లను పరిశీలించకుండా ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి అవలంభిస్తే తప్పకుండా బీఆర్ఎస్ తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# స్వీట్ షాప్‌లో స్వీట్ల మీద ఈగలు, దోమలు, బొద్దింకలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నేటిధాత్రి :
చుంచుపల్లి మండలం.రుద్రంపూర్ గ్రామపంచాయతీ. మార్కెట్ సెంటర్ లో ఉన్న రాంబాబు స్వీటీషాప్ నందు స్వీట్స్ లో ఈగలు దోమలు మరియూ బొద్దింకలు స్వేచ్చగా సంచరిస్తున్నాయి , వర్షాకాలం వలన. టైఫాయిడ్ మలేరియా. డెంగ్యూ. మరియు ఇతర వ్యాధులు వచ్చే. ప్రమాదం ఉన్నది కానీ స్వీట్ షాప్ యజమాని రాంబాబు. ఈగలు. దోమలు బొద్దింకలు. రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోకుండా. స్వీట్ షాప్ నడిపిస్తున్నారు. కనీసం పంచాయితీ. సెక్రటరీ గాని మరియు స్పెషల్ అధికారులు. కానీ. తనిఖీ చేయడం లేదు ప్రభుత్వ రూల్ ప్రకారం గా ఫుడ్ ఇన్స్పెక్టర్. మండల పరిధిలో గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి ఒక్క స్వీర్ షాప్ మరియు బేకరీలను. తనిఖీ చేయాల్సి ఉన్నది. కానీ ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ షాపులు బేకరీ వాళ్ళు తన సంధాన తను అమ్ముకుంటూ పోతున్నారు అని రుద్రంపూర్ గ్రామ ప్రజలు వాపోతున్నారు దయచేసి రుద్రంపూర్ గ్రామ సెక్రెటరీ. మరియు. స్పెషల్ ఆఫీసర్ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా రుద్రంపూర్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# గీతా కార్మికులకు సేఫ్టీ మోకులు అందించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

## జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశంకర్ గౌడ్



గణపురం, నేటిధాత్రి :
గణపురం కల్లుగీత వృత్తిలో ప్రమాద నివారణకు సేఫ్టీ మోకులు గీత కార్మికులకు పంపిణీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి కి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశంకర్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కల్లుగీత వృత్తిలో సంవత్సరానికి 500 మందికి పైగా చనిపోతున్నారని కొందరు వికలాంగులు అవుతున్నారన్నారు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చొరవతో రూపొందించిన సేఫ్టీ మోకు డెమో ఇప్పించడం జరిగిందన్నారు. కల్లుగీత కార్మిక సంఘం చేసిన పలు సూచనలతో రూపుదిద్దుకొన్న సేఫ్టీ మోకు లు లస్కర్ గూడలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి వాటిని పంపిణీ చేసినందుకు జిల్లా కమిటీ తరపున అభినందనలు తెలిపారు అందుకు కృషి చేసిన బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఐఏఎస్ కు మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌట్ కు ఎక్సైజ్ శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు కు టాడి కార్పొరేషన్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్రంలో మతోన్మాదుల అకృత్యాలను సామాజిక శక్తులు సమైక్యంగా ప్రతిఘటించాలి

## కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ పిలుపు.

హనుమకొండ జిల్లా, నేటిధాత్రి:
కేంద్ర రాష్ట్ర పాలకులు మారినప్పటికి దళితుల బ్రతుకులు మారడం లేదని రాజ్యాంగం రిజర్వేషన్లు ప్రభుత్వ రంగాన్ని రద్దు చేసే మతోన్మాద పాలకుల గద్దె నెక్కడంవల్ల అట్టడుగు ప్రజలైన దళితులపై అకృత్యాలను పెరుగుతున్నాయని వాటిని సామాజిక శక్తులు సమైక్యంగా అడ్డుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ దీప విద్యుత్ భవన్‌లో కెవిపిఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతిలో ప్రారంభ సూచకంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ జెండాలు ఎగరవేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సర్కార్ పదేళ్ల కాలంలో దళితులపై 300 రెట్లు దాడులు దౌర్జన్యాలు పెరిగాయి అన్నారు ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మడం ద్వారా రిజర్వేషన్లను సామాజిక న్యాయాన్ని సమాధి చేసిందన్నారు గోరక్షక దళాల పేరిట దళితుల ప్రాణాలతో చెలగాటమాడిందన్నారు ప్రత్యేకించి బిజెపి పాలిత రాష్ట్రాల్లో హింస పెరిగిందన్నారు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరించిందన్నారు. దేశంలో దళితులు 20 శాతం ఉండగా జనాభా దామాషాలో నిధులు కేటాయించలేదు అన్నారు. బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా వివక్ష పాటించిందన్నారు. ఉత్తరప్రదేశ్ కేంద్రంగా దళితులపై దౌర్జన్యాలు పెరిగాయి అన్నారు. రాజ్యాంగం రద్దు చేయడానికి ఆర్ఎస్ఎస్ ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తుందన్నారు ఇటీవల ఎన్నికల్లో కొన్ని




రాష్ట్రాల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పినప్పటికీ దేశ ప్రజలు సంఘటితంగా మతోన్మాదులను ప్రతిఘటించలేకపోవడం వల్ల దాని ప్రమాదం పొంచి ఉందన్నారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలు ఓ వైపు సామాజిక న్యాయానికి విరోధిగా మరో వైపు కార్పొరేట్లకు అనుకూలంగా మారాయని చెప్పారు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో గత టిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే దళితులపైన దాడులతో పెరిగాయి అన్నారు.చట్టాలు అమలు చేయాల్సిన స్థానంలో ఉన్న ఒక దళిత ఎస్ఐ ఆత్మహత్య చేసుకునే దుస్థితి నెలకొని ఉందన్నారు. దానిమ్మ చెట్టును ముట్టుకున్నాడని దళిత మైనర్ బాలుడిని కట్టేసి కొట్టే కులం పేరుతో దూషించిన సంఘటన మన రాష్ట్రంలో జరిగింది అన్నారు.కుల దురహంకారహత్యలు పెట్రేగి పోతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం దళిత బంధువు ఇస్తే అది అవినీతిమయమైంది మేము అధికారం లేకుంటే 12 లక్షలతో అంబేద్కర్ బందు పెడతామని చెప్పిన వాగ్దానం ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైందని చెప్పారు. రాష్ట్రంలో దళితుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతులకు కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు.ఉదయం పూట సమాజ పరిణామ క్రమం శాస్త్రీయ ఆలోచన అనే అంశంపై విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు టి రమేష్ క్లాస్ బోధించారు. సాయంత్రం రాజకీయ అర్థశాస్త్రం అనే అంశంపై ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి అబ్బాస్ క్లాస్ బోధించారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ మంద సంపత్, నందిపాటి మనోహర్, ఆరూరి కుమార్ ,దయ్యపు రాధాకృష్ణ, టి. సురేష్, కోట, గోపి ,మస్కు ప్రకాష్ కరత్, పల్లేర్ల లలిత, డి.రామ్మూర్తి,దుర్గం దినకర్ ,హనుమకొండ జిల్లా నాయకులు ఓరుగంటి సాంబయ్య,దూడేపాక రాజేందర్, కావ్య శ్రీ, కుమార్, రాజేందర్ ,రాంబాబు,రాంకీ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సొసైటీ చైర్మన్

మొగుళ్ళపల్లి , నేటిధాత్రి :
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ సాయి గార్డెన్ లో డాక్టర్ విక్రమ్-డాక్టర్ హెప్సిభా వివాహ రిసెప్షన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన సింగిల్ విండో చైర్మన్ సంపెల్లి నరసింగారావు నూతన వధూవరులను ఆశీర్వదించారు. మూడుముళ్ల బంధంతో ఏకమైన ఈ నూతన జంట నిండు నూరేళ్లు కలకాలం అష్టైశ్వర్యాలతో, పిల్లాపాపలతో కలకాలం వర్ధిల్లాలని



దీవించారు. ఆయన వెంట నేటి ధాత్రి జర్నలిస్ట్ చెక్క శ్రీధర్ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# 11 వార్డు చిట్టి రామవరం తండాను గ్రామపంచాయతీగా గుర్తించాలి

- ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు పరచాలి
- భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ అధికారికి వినతిపత్రం అందజేత
- బానోత్ శ్రీనివాస్ నాయక్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నేటిధాత్రి :
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు పరచాలి భారతీయ జనతా పార్టీ నాయకులు బానోత్ శ్రీనివాస్ నాయక్ భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ అధికారికి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా బానోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు గిరిజన విద్యా గురుకులు యువజన కార్యక్రమాలు హెల్త్ క్యాంపులు పైన అధికారులు దృష్టి సారించాలనీ కోరారు ముఖ్యంగా భద్రాచలం ఐటీడీఏ ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను గిరిజనులకు అందించాలనీ కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోనీ ఉన్న 11వార్డును చిట్టి రామవరం తండాను గ్రామపంచాయతీగా గుర్తించాలనీ పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమనీ 1/70 1/59 పిసా చట్టం రాజ్యాంగం ఐదో షెడ్యూల్లో గుర్తింపు పొంది ఉన్నాయని కొంతమంది రాజకీయ నాయకుల స్వలాభం కోసం ఏజెన్సీ చట్టాలను తూట్లు



పొడుస్తూ గిరిజన హక్కులను కాలరాస్తున్నారని 11వార్డు చిట్టి రామవరం తండాను మునిసిపాలిటీలో కలపటం వలన గిరిజనుల రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా వెనకబడిపోయారని అన్నారు భద్రాచలం ఐటిడిఏ ద్వారా గిరిజనులు సంవత్సరానికి రెండు పంటలు పండించాలనీ లక్ష్యంతోనే ఆనాడు ప్రభుత్వాలు గిరివికాస్ పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు రానున్న రోజుల్లో గిరి వికాస్ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు పరచాలనీ కోరారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు మా చిట్టిరామవరం తండాను గ్రామ పంచాయతీగా గుర్తించాలనీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలనీ కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోత్ రాజ్ కుమార్ నాయక్ లక్ష్మణ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ పట్టణం నెహ్రూ నగర్ రోడ్డు విషయంలో స్పందించిన జాయింట్ కలెక్టర్

## ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన నెహ్రూ నగర్ స్థానికులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నేటిధాత్రి :
కొత్తగూడెం నియోజకవర్గం పాల్వంచ పట్టణం నెహ్రూ నగర్ స్థానికులు ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమములో జాయింట్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు గత రెండు సంవత్సరాల కాలంగా రోడ్డు లేక వర్షం పడితే చాలు మోకాలి లోతు నీరు నిండుతుంది కరెంట్ స్థంభాలు విధి లైట్స్ లేక కొంచం చీకటి పడితే చాలు పాములు రోడ్డు మీద సైర విహారం చేస్తున్నాయి ఇట్టి విషయం కోసం గతంలో కలెక్టర్ కి మున్సిపాలిటీ అధికారులకు పిర్యాదు చేసిన ఫలితం లేకపోయింది మున్సిపాలిటీ అధికారులను అడుగగా రోడ్డు సంక్షన్ పెట్టం టైం పడుతుంది సమాధానం చెప్తున్నారు మరి రోడ్డు అయ్యే వరకు మిము నడవడం ఎలా?వర్షం నీళ్ళతో పాములతో కాలక్షేపం చేయాలా.నీ తెలిపారు అనంతరం జాయింట్



కలెక్టర్ పత్రిక విలేకరులు మానవతా హృదయంతో రాసిన ఖాదనాలు చూసి జాయింట్ కలెక్టర్ తక్షణం మున్సిపాలిటీ సిబ్బంది నీ పిలిపించి స్పందించారు తక్షణం తాత్కాలికంగా ఏదో ఒకటి చేయాలని తెలిపారు వారికి ప్రత్యేక ధన్యవాదాలు అదే విధంగా మా మిము పడుతున్న భాద చూసి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారు స్పందించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు నెహ్రూ నగర్ స్థానికులు తెలిపారు ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని రోడ్డు వేయాలని నిర్లక్ష్యం వహిస్తే ముఖ్యమంత్రి కి ఫిర్యాదు చేస్తాం నీ తెలిపారు.ఈ కార్యక్రమములో బాదావత్ జ్యోతి,వాణి,శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు

## పలు సమస్యల పైన కమిషనర్‌కు వినతిపత్రం

# అందజేసిన కార్మిక పారిశుద్ధ్య సిబ్బంది

కూకట్పల్లి, నేటిధాత్రి :
సోమవారం రోజు జిహెచ్ఎంసి గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్‌కి ప్రజావాణిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులం దరికీ వారాంతపు సెలవులు అమలు కావడం లేదని ఏదైనా అత్య వసర పరిస్థితుల వల్ల వారంలో ఏదో ఒక రోజు పనికిరానందువల్ల ఆరోజు వారాంతపు సెలవులు కూడా కలిపి రెండు బదులు నాలుగు రోజులు జీతాల నుండి కోతలు విధించి నెల జీతంలో తక్కువ వస్తున్నది ఈ పరిస్థితులలో పారిశుద్ధ్య కార్మికులు అయోమయంలో ఉన్నారు, స్థానికుడి పూటి కమిషనర్, ఎంహెచ్ఓ గార్లను యూనియన్ నాయకత్వన వాళ్ళని అడిగినట్లయితే వారు నాకు ఏమీ తెలియదు గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ నె సంప్రదించాలని దాట వేసినారు అందువలన ఏఐటీయూసీ మున్సిపల్ నాయకత్వాన సీఎంకి దర ఖాస్తు చేసుకుంటే గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్నటువంటి అధికారులు గ్రేటర్ కమిషనర్‌కు ప్రజావాణిలో దరఖాస్తు ఇవ్వమని




చెప్పినందువలన ఈరోజు ప్రజా వాణిలో కార్మికుల సమస్యలు, వారాంతపు సెలవులు పండగ సెలవులు సి ఎల్ కూడా ఇవ్వాలని కోరినాము గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్నటువంటి పారిశుద్ధ్య 1500 ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, చనిపోయిన వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, దీర్ఘకాలికంగా ఒకే చోట పని చేసినటు వంటి పారిశుద్ధ్య కార్మికులను,ఎస్ ఎఫ్ ఏలను బదిలీ చేయాలని,వినతి పత్రం ఇవ్వడం జరి గింది,అల్వాల్ మున్సిపాలిటీలో జిపిఎ ఫ్,ఎల్ఐసి డబ్బులు సంబంధిత ఆఫీసు లకు పంపలేదు వెంటనే పంపియ గలరని డిమాండ్ చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కే యేసు రత్నం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి మహేందర్ చర్లపల్లి రాములు కోశాధికారి వి హరినాథరావు మేడ్చల్ జిల్లా కార్యదర్శి డియర్ శేఖర్ జిల్లా నాయకులు మిర్యాల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల ఆశయ సాధనకై ఉద్యమించాలి




## సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం

నల్లగొండ జిల్లా, నేటిధాత్రి :
అమరవీరుల ఆశయ సాధన కోసం ఉద్యమించాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ్మా అన్నారు. సోమవారం గట్టుప్పలమండల పరిధిలోని తెరటుపల్లి లో బండ యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసిపిఎం పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ, పేద ప్రజల కోసం ఎనలేని సేవలు చేశారని వారు కొనియాడారు. రైతు కూలి పోరాటంలో ప్రజల కోసంముందుండి పోరాటం చేశారనిఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే వారని, ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు వారి వెన్నంటూ ఉండి ప్రజా పోరాటంలో ముందుండే వారనిఆయన అన్నారు. సిపిఎం పార్టీ గ్రామ శాఖ సభ్యునిగా, రైతు కూలీ సంఘం నాయకునిగా ఆయన పని చేశారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆయన అన్నారు. బండ యాదయ్య ఆశయాలు నెరవేర్చినపుడే ఆయనకునిజమైన నివాళి అర్పించినట్లుఅని ఆయన అన్నారు. సిపిఎం పార్టీ అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ,అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, మాజీ సర్పంచ్ లు మల్లే శ్రీశైలం, వీరమల్ల శ్రీశైలం, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పగిళ్ల బిక్షం, సిపిఎం నాయకులుజెర్రిపోతుల ధనంజయ గౌడ్, మాజీ ఎంపీటీసీ గొరిగే సత్తయ్య, పార్టీ సీనియర్ నాయకు లుపబ్బు మారయ్య, అచ్చిన లెనిన్,అచ్చిన బీరప్ప,బండారి కృష్ణయ్య, కట్ట వెంకన్న,కట్ట లింగస్వామి, కట్ట కృష్ణయ్య, కట్ట యాదగిరి, బండ లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 10ని రద్దు చేయాలి

నల్లగొండ జిల్లా, నేటిధాత్రి:
జీవో నెంబర్ పదిని రద్దుచేసి రిటైర్మెంట్ బిజినెస్ పెన్షన్ పెంచుతూ విఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవోను ఇవ్వాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య , సిఐటియు మునుగోడు మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు డిమాండ్ చేశారు . సోమవారం మండలంలోని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక క్యాంపు కార్యాలయం ఎదురుగా మునుగోడు , చింతపల్లి అంగన్వాడి ప్రాజెక్టు అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ తో కలసి సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్పర్లకు పాత పద్ధతిలో ప్రమోషన్స్ ఇవ్వాలని అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ గత



ప్రభుత్వ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా నాయకురాలు కే రజిత ఆర్ శోభ సిహెచ్ సువర్ణ విజయలక్ష్మి విగ్నేశ్వరి. సులోచన ఆర్ శారద అరుణ విమలాదేవి మరియమ్మ సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

## వేములవాడ టౌన్ సీ.ఐ వీరప్రసాద్..

వేములవాడ, నేటిధాత్రి :
జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఐపిఎస్ ఆదేశాల మేరకు నిషేధిత గంజాయి అక్రమ రవాణాను నిరోధించడానికి నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలతో ఈ రోజు వేములవాడ పట్టణ పరిధిలోని బస్టాండ్, పాన్ షాప్ లు,కిరణ షాప్ ,మొదలగు ప్రాంతల్లో తనిఖీలు చేపట్టడం జరిగిందని టౌన్ సి.ఐ వీరప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ సి.ఐ మాట్లాడుతూ...యువత భవిష్యత్తును నాశనం చేస్తూ,అక్రమార్జనే ధ్యేయంగా నిషేధిత గంజాయిని రవాణా చేసే వ్యక్తులను పట్టుకోవడానికి వాహన తనిఖీలు చేపట్టడంతో పాటు పోలీస్ జాగిలాల సహాయంతో కూడా వారిని పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని,జిల్లాలో విస్తృత కార్యక్రమాల ద్వారా ప్రజలకి మత్తు పదార్థాల వల్ల కలుగు అనార్థాల




గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎవరైనా వ్యక్తుల వద్ద , పాన్ షాప్ లలో కిరాణా షాపుల్లో మరే ఇతర షాపుల్లో నైనా ప్రభుత్వం నిషేధించిన గంజాయి, మత్తు పదార్థాలు కలిగి ఉన్నా లేక విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే ప్రజలు వెంటనే డయల్ 100 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ప్రజావాణి వినతుల సమస్యలను సత్వర పరిష్కరిస్తాం

## మండలంలో 46 భూ సంబంధిత దరఖాస్తులు.

మహదేవపూర్- నేటిధాత్రి :
ప్రజావాణిలో వచ్చిన వినతుల సమస్యలను సత్వర పరిష్కారం అందేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తాసిల్దార్ ప్రహ్లాద్ అన్నారు. సోమవారం రోజున మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో మండల ప్రజల నుండి భూ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్థానిక తహసిల్దార్ ప్రహ్లాద్ స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ వివిధ గ్రామాలకు సంబంధించిన 46 భూ సంబంధిత వినతులు రావడం జరిగిందని వాటిని పరిశీలించి సాధ్యమై




నంత త్వరలో వినతుల సమస్యలను పరిష్కరిస్తామని తాసిల్దార్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో తహసిల్దార్ ప్రహ్లాద్ తో పాటు రెవెన్యూ ఇన్స్పెక్టర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## నేడు ఎంపీడీవో కార్యాలయంలో

# 17 గ్రామసభల వివరణ

## గణపురం ఎంపీడీవో ఎల్ భాస్కర్

గణపురం, నేటిధాత్రి :
గణపురం మండల కేంద్రంలో మంగళవారం రోజున మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించబడునని ఈ కార్యక్రమానికి గణపురం మండలం కింద గల 17 గ్రామపంచాయతీలో గ్రామసభలు ఏర్పాటు చేసి జాతీయ ఉపాధి హామీ సంబంధించిన విషయాలను గురించి సామాజిక తనిఖీ వారు వివరణ కోరగా వారికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన అధికారులు వివరణ ఇచ్చారు 16వ తారీఖున గణపురంమండలం కింద గ్రామాలలో గ్రామ సభలలో జరిగిన విషయాలను గురించి పూర్తిగా అధికారుల ముందు జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సిబ్బందిని ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రజలు ఉపాధి హామీ కూలీలు పాల్గొని వారికి సంబంధించిన విషయాలను తెలుసుకోవాల్సిందిగా మండల ప్రజా పరిషత్ అధికారులు కోరారు.

# ఆక్రిడేషన్ లేని విలేకరులను మంత్రుల పర్యటనలో అనుమతించకపోవడంపై ఆగ్రహం



వనపర్తి, నేటిధాత్రి :
వనపర్తి జిల్లా కేంద్రంలో రైతు భరోసా కార్యక్రమానికి వచ్చిన మంత్రుల పర్యటనకు అక్రిడేషన్ లేని విలేకరులను అధికారులు అనుమతించకపోవడంపై పట్టన బిజెపి అధ్యక్షులు బచ్చు రాం నాయకులు సీతారాముల రాయన్న సాగర్ గోవిందు శివ ఏర్పుల జ్ఞానేశ్వర్ యాదవ్ ఒక ప్రకటనలో ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా వార్తల ద్వారా సమాచారం చేర వేసే విలేకరుల ను అనుమతించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ అసెంబ్లీ సమావేశాలకు విలేకరుల ను వార్తలు సేకరించడానికి అధికారులు అనుమతిస్తారని వారు గుర్తు చేశారు. అక్కడి రూల్స్ వనపర్తిలో అధికారులు అమలు చేయాలేదని వారి తెలిపారు. గతంలో విలేకరులకు స్వేచ్ఛ లేకుండా చేశారని ప్రజలు తగిన తీర్పు ఇచ్చారని వారు గుర్తు చేశారు. భవిష్యత్తులో మున్సిపల్ ఎన్నికలు సర్పంచు జెడ్పిటిసి ఎన్నికల సమీపిస్తున్న వేళ ఇలాంటి చర్యలకు పాల్పడడం ఎంతవరకు సమంజసం అని విలేకరులను ప్రజాస్వా మ్యంలో అణిచివేయాలని చూస్తే ప్రజలు తగిన తీర్పు ఇస్తారని వారు పేర్కొన్నారు. రైతు భరోసా సభకు అక్రిడేషన్ ఉన్న విలేకరులను న్యూస్ కవర్ చేయడానికి అధికారులు ఆహ్వానించి వారికి కూర్చోవడానికి కుర్చీలు లేవని వెంటనే జిల్లా కలెక్టర్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు టీఎస్ పిఎస్ సి డీఎస్సిఅభ్యర్థులు సెక్రటేరియట్ ముట్టడలో భాగంగా వనపర్తి లో ముందస్తుగా బీజేపీ నేతలను అరెస్ట్ చేయడము వారు ఆందోళన వ్యక్తం చేశారు అనంతరం పోలీసులు స్వంత పూచి కత్తు పై విడుదల చేశారు.

# చినుకు పడితే చిత్తడే... చిత్తడి

♦ఈ దారిన నడిచేదెట్లా

♦జర మా సమస్యలను తీర్చండి సారు



**కరకగూడెం,, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నేటిధాత్రి:** కరకగూడెం మండలం బట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బట్టుపల్లి ప్రధాన రోడ్డు నుంచి లక్ష్మీపురం గ్రామం వరకు ప్రధాన రహదారి చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంతమంది ఎమ్మెల్యేలు మారిన తమ భవిష్యత్తు మారడం లేదని రోడ్డు మీద నడవాలంటే అత్యంత భయంగా ఉంటుందని బండి మీద పోతే జారి పడాల్సిందే పరిస్థితి ఏర్పడిందని లక్ష్యం పురం గ్రామస్తులు వాపోతున్నారు. లక్ష్మీపురం పెద్ద బ్రిడ్జి నుంచి ఊళ్లోకి గల ప్రధాన రహదారి బురద మాయంమై ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్న పంచాయతీ అధికారులు అటువైపు చూసే పనే గాని చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి బురద మయమైన రోడ్డును శుభ్రం చేసి గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజల కోరుకుంటున్నారు.

# మా భూమి మాకు ఇప్పించండి, జర్నలిస్టుల ఆవేదన

♦ప్రజావాణిలో కాళేశ్వరం ప్రెస్ క్లబ్ దరఖాస్తు.



ప్రజావాణిలో తహసిల్దార్ కు దరఖాస్తు అందిస్తున్న కాళేశ్వరం ప్రెస్ క్లబ్ సభ్యులు

**మహాదేవపూర్, నేటిధాత్రి:** ప్రభుత్వం కేటాయించిన జర్నలిస్ట్ ఇంటి స్థలాల భూమిపై ఫారెస్ట్ శాఖ రిజర్వ్ ఫారెస్ట్ అని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమ భూమి తమకు కేటాయించి తమకు న్యాయం చేయాలని కాళేశ్వరం ప్రెస్ క్లబ్ ప్రజావాణిలో వినతి పత్రాన్ని తహసిల్దార్ ప్రహ్లాద్ కు అందించడం జరిగింది. కాళేశ్వరం గ్రామంలోని సర్వే నెంబర్ 119/1లో గత ప్రభుత్వం అక్టోబర్ నెలలో కాళేశ్వరం ప్రెస్ క్లబ్ పరిధిలోని 12 మంది జర్నలిస్టులకు 121 గజాల చొప్పున ఇంటి స్థలాలను కేటాయిస్తూ పట్టాలు జారీ చేయడంతో హద్దులు కేటాయించే విషయంలో అటవీ శాఖ ఫారెస్ట్రీ అని ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందని ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు వినతి పత్రంలో తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ మరియు ఫారెస్ట్ జైంట్ సర్వే నిర్వహించి ప్రెస్ క్లబ్ పరిధిలోని 12 మంది జర్నలిస్టులకు కలెక్టర్ ఆదేశాల అనుసారం పట్టాలు అందించి వాటిలో కేటాయించిన 121 గజాల ఇంటి స్థలాలకు హద్దులు ఏర్పాటు చేసి తమకు ఇప్పించి న్యాయం చేయాలని కాళేశ్వరం ప్రెస్ క్లబ్ తాసిల్దార్ కు వినతి పత్రంలో కోరింది. వినతి పత్రం అందించిన వారిలో జర్నలిస్ట్ టీవీ9 వెంకటేష్, ఎస్ కే దిన్, రాజ్ న్యూస్ రిపోర్టర్ ఉన్నారు.

# ఇవ్వవాన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ ముఖ్య అతిథులు


చిన్నారి ఇవ్వవాన్ ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసి నారు

**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలోని మండల పార్టీ అధ్యక్షులు రేపాక రాజేందర్ కృష్ణవేణి దంపతుల పుత్రుడు ఇవ్వవాన్ మొదటి జన్మదిన వేడుకలకు గణపురం మండల కేంద్రంలోని వారి స్వగృహంలో జరగగా ఇట్టి వేడుకల్లో కావటి రవి సొసైటీ వైస్ ఛైర్మన్ పోనగంటి మలహాళ్ రావు మాజీ సొసైటీ చైర్మన్ రాస మడుగు సత్యనారాయణ రావు గ్రామ శాఖ అధ్యక్షులు పళ్ళపాటి స్వామి రావు చింతకుంట్ల శ్రీనివాస్ మాజీ వైస్ఎంపీపీ ఇట్టి కార్యక్రమంలో పాల్గొని

# ఐక్యమత్యం తో పండగలు జరుపుకోవాలి



**నిజాంపేట, నేటిదాత్రి:** మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధి లోని నస్కల్ గ్రామం లో సోమవారం నాడు స్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యం లో శాంతి కమిటీ ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రానున్న మొహరం పండుగను ప్రజలు ఐక్యమత్యంతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎస్ఓ ద్వారా లక్ష రూపాయల డిపాజిట్



**నిజాంపేట, నేటిదాత్రి:** మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని చెల్మెడ గ్రామానికి చెందిన బాజే లావణ్య గణేష్ అనే మహిళ అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేయడానికి స్కూటీ పై వస్తున్న సమయంలో తూప్రాన్ సమీపంలో యక్సిడెంట్ అయి మరణించింది. ఇట్టి విషయం తెలవగానే ఆ రోజు మైనంపల్లి హన్మంతరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ రోజు చనిపోయిన లావణ్య కు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నందున వారి భవిష్యత్తు కోసం ఒక లక్ష రూపాయల ఫిక్స్ డిపాజిట్ కు ఆమె భర్త గణేష్ కు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా మైనంపల్లి వాణి అందచేసారు.

# అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడిగా నాగేందర్


జాతీయ అంబేద్కర్ సంఘం గ్రామ మండల శాఖ సభ్యులు

**మహాదేవపూర్, నేటిధాత్రి:** జాతీయ అంబేద్కర్ సంఘం కుదురుపల్లి గ్రామ శాఖ అధ్యక్షునిగా గూగుల్ నాగేందర్ ను నియమించడం జరిగింది. సోమవారం రోజు మండల అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో గ్రామ శాఖ కార్యవర్గానికి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు రాజశేఖర్ ప్రధాన కార్యదర్శి నాగరాజు సహాయ కార్యదర్శి రాజేందర్ కోశాధికారి రత్నం నాగరాజు కార్య నిర్వహణ సెక్రటరీ మధుకర్, 15 కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నుకోబడ్డ జాతీయ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు ప్రజల్లో తీసుకువెళ్లడమే లక్ష్యంగా సంఘం ముందుకు వెళుతుందని, భారతదేశ మహానాయుని ఆశయాలను కొనసాగించే అవకాశం ఇచ్చినందుకు సంఘం మండల అధ్యక్షుడు అలాగే జాతీయ అధ్యక్షులకు కుదురుపల్లి గ్రామ శాఖ నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

# జైపూర్ లో అమ్మ మాట

## అంగన్వాడీ బాట కార్యక్రమం నిర్వహణ



**జైపూర్, నేటిధాత్రి:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని రెండవ అంగన్వాడి కేంద్రంలో అమ్మ మాట – అంగన్వాడి బాట కార్యక్రమం. నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రాం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆర్. కవిత ముఖ్యఅతిథిగా పాల్గొని పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యత గురించి, అంగన్వాడి కేంద్రం ప్రాముఖ్యత గురించి బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు, మహిళలకు వివరించి 3 నుండి 6 సంవత్సరాల పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వచ్చేలా చూడాలని, అంగన్వాడి అనేది పిల్లలకు అమ్మ ఒడి లాంటిదని సూచించడం జరిగింది. అంగన్వాడి కేంద్రం ఆట పాటలతో కూడిన నాణ్యమైన విద్య మరియు పిల్లల వయస్సు తగిన శారీరక పెరుగుదల, విజ్ఞాన, వికాస అభివృద్ధికి నిలయమని పేర్కొనడం జరిగింది. అంగన్వాడి బడి బాట గురించి ర్యాలి తీయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆర్. కవిత, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ ప్రేమల, అంగన్వాడి టీచర్ ఉమాదేవి, ఉపాధ్యాయులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

# పెన్షన్ బెనిఫిట్ అందించాలి



**సిరిసిల్ల(నేటి ధాత్రి):** తెలంగాణలోని 398 రూపాయల స్పెషల్ టీచర్స్ కు తెలంగాణ ప్రభుత్వం బెనిఫిట్ మంజూరు చేయాలని సిరిసిల్ల జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు వి. మధుకర్ రావు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో జిల్లా కలెక్టరేట్ ముందు తెలంగాణ పెన్షనర్ల జేఏసీ పిలుపుమేరకు టీజీపీ జేఏసీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 398 రూపాయల వేతనంతో పని చేసిన స్పెషల్ టీచర్లకు పనిచేసిన కాలానికి ఆంధ్రప్రదేశ్ లో ఇచ్చిన విధంగా రెండు నేషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేస్తూ పెన్షన్ బెనిఫిట్ ఇవ్వాలని బకాయి ఉన్న నాలుగు డీఏలను తక్షణమే మంజూరు చేసి నిధులు విడుదల చేయాలన్నారు. ఉచిత నగదురహిత వైద్యం అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందించాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పంజాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, సిహెచ్ జనార్ధన్, ఎండి రియాజుద్దీన్, కె రమేష్, భూమారావు, డి సత్తయ్య, అంజయ్య, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి గూడ నుండి రాజాపూర్ రహదారి పనులకు శంకుస్థాపన



**మహబూబ్ నగర్ జిల్లా, నేటిధాత్రి:** సోమవారం రోజు మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండల కేంద్రము లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి , ఎంపి, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి రంగారెడ్డి గూడ నుండి రాజాపూర్ మండల కేంద్రానికి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మిడ్జిల్ మండలం లోని కొత్తపల్లి నుడి కొత్తూరు వరకు, బాలానగర్ నుండి గంగాపూర్ వరకు బిటి రోడు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎంపీ శ్రీమతి డి కె అరుణ, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే శ్రీ అనిరుధ్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూధన్ రెడ్డి, మహబూబ్ నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి, ఎస్పీ శ్రీమతి డి జానకి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆర్ బాలా త్రిపుర సుందరి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోండి

♦పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత

♦శిథిలావస్థలో పాఠశాల భవనాలు

♦చెట్ల కిందనే చదువులు

♦పట్టించుకోని విద్యాశాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే

♦ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం

♦ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేని రంజిత్ డిమాండ్




**సిరిసిల్ల, (నేటి ధాత్రి):** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేని రంజిత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, ఎన్నిసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదన్నారు. అనేక పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని కొన్ని పాఠశాలలో తరగతి గదులు సరిపోక చెట్ల కిందనే చదువుకుంటున్నారని తెలిపారు. అనేక సమస్యలతో సమస్యల వలయంగా మారిన ప్రభుత్వ పాఠశాలలను స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ పట్టించుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, శశాంక్, సాయి అరవింద్, సాయికిరణ్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు సేఫ్టీ మోకుల పంపిణీ పట్ల హర్షం



**నల్లగొండ జిల్లా, నేటిధాత్రి:** కల్లుగీత వృత్తిలో ప్రమాద నివారణకు సేఫ్టీ మోకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పంపిణీ చేయడం తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండ వెంకన్న, చౌగాని సీతారాములు హర్షం వ్యక్తం చేశారు. సోమవారంనల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కల్లుగీత వృత్తిలో సంవత్సరా నికి500 మందికి పైగాతాడిచెట్లపైనుండిపడి చనిపోవడం, వికలాంగులవడం జరుగుతుందన్నారు. వీటి నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని గత అనేక సంవత్సరాలుగా కల్లుగీత కార్మిక సంఘం ప్రభుత్వాలకు విన్నవిస్తూ వస్తుందని 2022 అక్టోబర్ 21న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా యాదగిరిగుట్టలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం చొరవతో రూపొందించిన సేఫ్టీ మొకు డెమో ఇప్పించడం జరిగిందనివారన్నారు. కల్లుగీత కార్మిక సంఘం చేసిన సూచనల తో రూపుదిద్దుకున్న సేఫ్టీ మోకు లను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి పంపిణీ చేశా రనివారన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు గీత వృత్తిపైనే జీవిస్తున్నారని, సంవత్సరానికి సుమారు 550 మంది చెట్టు పైనుండి జారి పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులకు ప్రస్తుతం పెన్షన్ ఎలాంటి షరతులు లేకుండా 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి చేయూత పథకం ద్వారా 4000 ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆగస్టు 18 లోపు ట్యాంక్ బండ్ పై నిర్మించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర బడ్జెట్లోగీత కార్మికుల కోసం 5000 కోట్లు కేటాయించాలని, టాడి కార్పొరేషన్ సమర్థవంతంగానిర్వహించాలన్నారు. ప్రభుత్వం నుఅందుకు కృషిచేసిన బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రిజూపల్లి కృష్ణారావు, టాడి కార్పొరేషన్ అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుపామనగుల్ల అచ్చాలు, జిల్లా ఉపాధ్యక్షులుఉప్పల గోపాల్, కొప్పుల అంజయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు మక్తాల లింగస్వామి, జెర్రిపోతుల ధనుంజయ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు నేలపట్ల నరసింహ, జినుకుంట్ల స్వామి, దండంపల్లి సైదులు, నాగేష్, పంతంగి శ్రీను, మారయ్యతదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ పత్తుల మద్దతు ధరల కు చట్టబద్ధత కల్పించాలి

▶▶తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ డిమాండ్



**వరంగల్, నేటిధాత్రి:** తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సమావేశం వరంగల్ నగరం అడ్డుకుంటాలో రైతు సంఘ భవనంలో సోమడి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్మించడం జరిగింది ఈ సందర్భంగా సంఘ నిర్మాణ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రత్యక్షంగాను పరోక్షంగాను నేటికీ 75% మందికి ఉపాధినిస్తున్న మన వ్యవసాయం సంక్షేమంలోకి నెట్టివేయబడుతుంది మారుతున్న సాంకేతిక నాగరిక విలువలకు తగిన విధంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు ప్రణాళిక బద్ధంగా నిర్మానితంగా పనిచేయడంలో చిత్తశుద్ధిని చూపలేక పోయి న కారణంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కూడా నష్టాల లోనే మూతపడాయి లక్షలాది మంది కార్మికులు ఉద్యోగులు నిరుద్యోగులుగా మారిపోయారు ప్రభుత్వాలు రైతాంగానికి అరకొర సదుపాయాలు పేరుతో నగదు సహాయాలను అందిస్తూ రైతాంగం వ్యవసాయాన్ని నెట్టు కు వచ్చేలా చూస్తున్నారు కానీ శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వాలు ఆలోచించకపోవడం దురదృష్టకరమని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షులు సో మీ డి శ్రీనివాస్ ఈ సందర్భంగా అన్నారు జిల్లా కమిటీ ఈ కింది డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని లాభచాటుగా మార్చాలని చిత్తశుద్ధి ఉంటే ఈ కింది డిమాండ్లను వెంటనే అమలు చేయాలని

1 మద్దతు ధరను చట్టబద్ధత చేయాలి

2 వ్యవసాయ రంగానికి జాతీయ ఉపాధి హామీ పథకం వర్తింప చేయాలి

3 రైతుల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి, మద్దతు ధర వ్యవస్థను రద్దు చేయాలి

4 వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారికి ఉచిత విద్య వైద్యం అందించాలి

5 ప్రభుత్వం గ్యారంటీతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు 75% సబ్సిడీతో ప్రభుత్వమే అందించాలి

పై డిమాండ్లు అమలు కొరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంఘ ఆధ్వర్యంలో గ్రామ మండల కమిటీలను నియమించుకోవాలని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ పై డిమాండ్ల అమల వరకు పోరాటం కొనసాగించాలని కమిటీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించుకోవడం జరిగినది

ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వదల రాజయ్య కోశాధికారి సెల్ల రవీందర్ ఉపాధ్యక్షుడు అంశాల్ రెడ్డి కమిటీ సభ్యులు బరపటి రవీందర్ సోమిరెడ్డి సాంబయ్య పేరయ్య బుల్లయ్య రాజమౌళి పైడి జెండా అంబయ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మహిళకు తీవ్ర గాయాలు

**మహాదేవపూర్– నేటిధాత్రి:** ప్రయాణ ప్రాంగణం వద్దకు వెళ్తున్న మహిళలకు ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పంకెన గ్రామానికి చెందిన సమ్మక్క (65 ) అనే వృద్ధురాలు పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్లడం కొరకు ప్రయాణ ప్రాంగణానికి వస్తున్న క్రమంలో మండల కేంద్రానికి చెందిన కంకణాల రవీందర్ తన ద్విచక్ర వాహనం తో వృద్ధురాలు సమ్మక్కకు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు కావడం జరిగింది, గమనించిన స్థానికులు సమ్మక్కకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం భూపాల పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. వృద్ధురాలు కావడంతో తలకు గాయం ఎక్కువ అయి రక్త ప్రసరణ జరగడంతో సమ్మక్క ఆరోగ్యంపై సందిగ్ధ పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.







# ఆగస్టునాటికి దేశవ్యాప్తంగా అందుబాటులోకి యూ-విన్ పోర్టల్

**న్యూఢిల్లీ, నేటిధాత్రి:** దేశవ్యాప్తంగా సాధారణ టీకాల కార్యక్రమ ట్రాకింగ్, నమోదు కోసం ఆగస్ట్ చివరి నాటికి యూ-విన్ పోర్టల్ అందుబాటులోకి రానుందని అధికార వర్గాలు తెలిపాయి. కొవిడ్ వ్యాక్సినేషన్ పోర్టల్ కొ-విన్‌కు నకలుగా ఉండే ఈ పోర్టల్‌ను పశ్చిమ బెంగాల్ మినహా మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాం తాల్లో ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నారు. గర్భిణులు, అయిదేండ్ల లోపు పిల్లలకు వేసే ప్రతి టీకాను యూ-విన్‌లో నమోదు చేయనున్నారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా పని చేసే ఈ పోర్టల్‌లో ఈ-టీకా ధ్రువీకరణ పత్రాన్ని ఒక్క క్లిక్ ద్వారా పౌరులెవరైనా పొందొచ్చు. రియల్ టైమ్‌లో పనిచేసే ఈ పోర్టల్ లేదా ఆండ్రాయిడ్ మొబైల్ అప్లికేషన్‌లో కోరుకున్న టీకా కేంద్రాల్లో టీకాలు పొందడానికి పౌరులు స్వీయ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. టీకా వేయించుకొనే టైమ్‌ను షెడ్యూల్ చేసుకోవచ్చు.




# ఛత్తీస్‌గఢ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ స్కామ్

**న్యూఢిల్లీ, నేటిధాత్రి:**

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పబ్లిక్ సర్వీస్ కమీషన్ స్కామ్ లో సీబీఐ దర్యాప్తు మొదలుపెట్టింది. 2020-22 సంవత్సర కాలంలో ఆ నాటి పీఎస్సీ చైర్మెన్, అధికారులు, రాజకీయవేత్త బంధువులు, కుటుంబసభ్యులకు వివిధ జిల్లా కలెక్టరేట్లలో ఉద్యోగాలు ఇప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీజీపీఎస్సీ చైర్‌పర్సన్ తమన్ సింగ్ సోన్‌వాని, కార్యదర్శి జేకే ధ్రువ్‌లపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. బంధుప్రీతితో ఉద్యోగాలు ఇప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తమ కుమారులు, కూతుళ్లు, బంధువులను మెరిట్ లిస్టులో ముందు నెట్టి, జిల్లా కలెక్టరేట్లలో రిక్రూట్ అయ్యేరీతిలో అవినీతికి పాల్పడినట్లు చైర్మన్‌పై ఆరోపణలు ఉన్నాయి. తమన్ సింగ్ సోనవాని, ధ్రువ్ నివాసాల్లో సోమవారం సీబీఐ దర్యాప్తు చేపట్టింది. రాయ్‌పూర్‌తో పాటు బిలాయిలో ఉన్న ఇండ్లల్లో సోదాలు జరిగాయి. సోనావానీ కుమారుడు నితీశ్‌ను అక్రమ రీతిలో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక చేశారని సీబీఐ ఆరోపించింది. సోనావానీ సోదరిడి కుమారుడు సాహిల్‌ను డిప్యూటీ ఎస్పీ, ఆయన సోదరి కుమార్తె సునితా జోషిని లేబర్ ఆఫీసర్‌గా ఎంపిక చేశారు. మరో బంధువు నిషా కోసలే, దీపా అదిల్‌ను జిల్లా అధికారులుగా నియమించడాన్ని సీబీఐ తప్పుపట్టింది. సీపీఎస్సీ కార్యదర్శి ధ్రువ్ కుమారుడు సుమిత్‌ను డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక చేశారని సీబీఐ ప్రతినిధి ఒకరు ఆరోపించారు. సీపీఎస్సీ పరీక్ష ద్వారా 171 మంది ఉద్యోగాలు ఇచ్చారని, దాంట్లో ఆ నాటి ప్రభుత్వ సీనియర్ అధికారుల బంధువులు, ఇంటి సభ్యులే మెరిట్ లిస్టులో ఉన్నట్లు సీబీఐ ఆరోపించింది.







# అనంత్ అంబానీ పెళ్లి..

## పాకిస్థానీ డిజైనర్ల డ్రెస్సుల్లో మెరిసిన ఇండియన్ సెలబ్రిటీలు

**ముంబై, నేటిధాత్రి:**

ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ పెళ్లి ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఆ పెళ్లి వేడుకకు హాలీవుడ్, బాలీవుడ్ తారలతో పాటు అనేక మంది సెలబ్రిటీలు హాజరయ్యారు. రకరకాల దుస్తుల్లో ఆ సెలబ్రిటీలు మెరిసిపోయారు. అయితే పాకిస్థాన్‌కు చెందిన డిజైనర్ల రూపొందించిన దుస్తుల్లోనూ ఇండియన్ స్టార్స్ వెలిగిపోయారు. ఇక్బాల్ హుస్సేన్, ఫరాజ్ మన్నన్, మోషిన్ నవీద్ రాంజా రూపొందించిన దుస్తులను ఇండియన్ సెలబ్రిటీలు ధరించారు. సైఫ్ అలీ ఖాన్ కుమార్తె సారా అలీ ఖాన్, నటి ఆలియా భట్, కెనిడియన్ సింగర్ ఏపీ ధిల్లాన్, భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యాలు.. పాక్ డిజైనర్లు తయారు చేసిన దుస్తుల్లో ధగధగలాడారు. ఆలియా భట్ బ్లాక్ డ్రెస్సులో జిగేల్మంది. సంగీత్ సర్మనీ కోసం ఆ డిజైన్ డ్రెస్సు వేసుకుందామె. దీన్ని ఫరజ్ మన్నన్ డిజైన్ చేశారు. సోషల్ మీడియాలో ఆలియా భట్ డ్రెస్సుపై ప్రశసంలు వచ్చాయి. శుభ్ వివాహ్ సెర్మనీకి నటి సారా అలీఖాన్ హాజరైంది. ఇక్బాల్ హుస్సేన్ డిజైన్ చేసిన ఓలీవ్ గ్రీన్ డ్రెస్సులో ఆమె మెరిసింది. శుభ్ అశీర్వాద్ వేడుక కోసం ఆమె లాంగ్ ఫ్రాక్, గోల్డెన్ లెహంగాలో కనిపించింది. లైట్ పింక్ డ్రెస్సులో హార్దిక్ పాండ్యా మెరిశాడు. ఆ డ్రెస్సును ఫరాజ్ మన్నన్ డిజైన్ చేశారు. దిల్లాన్ కూడా మన్నన్ డిజైన్ చేసిన డ్రెస్సు ధరించాడు.

# స్పేస్ ఎక్స్ రాకెట్ ప్రయోగం విఫలం

## కుప్పకూలనున్న 20 శాటిలైట్లు!



**కాలిఫోర్నియా, అమెరికా, నేటిధాత్రి:**

కాలిఫోర్నియా, అమెరికా ప్రైవేట్ అంతరిక్ష కంపెనీ 'స్పేస్ ఎక్స్' (ఎలాన్ మస్క్ సొంత సంస్థ) తాజాగా చేపట్టిన 'ఫాల్కాన్-9' రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఒకేసారి 20 శాటిలైట్లను రాకెట్ భూ కక్ష్యలో చేర్చలేకపోయింది. సాంకేతిక లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలో కాకుండా, దానికన్నా దిగువన ఉన్న కక్ష్యలోకి శాటిలైట్స్ ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో ఆ శాటిలైట్స్ త్వరలో భూమి మీదకు దూసుకొచ్చి.. కుప్పకూలనున్నాయి అంటూ 'స్పేస్ ఎక్స్' అధికారిక వెబ్‌సైట్ వెల్లడించింది 'గురువారం రాత్రి కాలిఫోర్నియా నుంచి చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ నేపథ్యంలో ఆ శాటిలైట్స్ భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించి.. నశిస్తాయి.'అని ఒక ప్రకటనలో తెలియజేసింది.



# చంద్రుడిపై నావిగేషన్ వ్యవస్థ

**బీజింగ్, నేటిధాత్రి:** భూమిపైన ఉన్నట్టుగానే చంద్రుడిపైన కూడా శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు పలువురు చైనా శాస్త్రవేత్తలు ప్రణాళికను రూపొందించారు. బీజింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్‌క్రాఫ్ట్ సిస్టమ్ ఇంజినీరింగ్‌కు చెందిన బృందం చంద్రుడి చుట్టూ 21 ఉపగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. చంద్రుడి అణువణువూ తెలుసుకునేలా ఈ నావిగేషన్ వ్యవస్థ పని చేస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. నాలుగు కక్ష్యల్లో, మూడు దఫాల్లో ఈ ఉపగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది సుస్థిరమైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న ప్రతిపాదన అని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు చైనీస్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. చంద్రుడిపై పరిశోధనలకు గానూ చైనా లక్ష్యాలకు ఈ నావిగేషన్ వ్యవస్థ ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా, ప్రస్తుతం భూమిపై అమెరికాకు చెందిన జీపీఎస్ ఉన్నట్టుగానే, చైనాకు సైతం బీదౌ పేరుతో సొంత నావిగేషన్ వ్యవస్థ ఉంది.

# కర్ణాటకలో బస్సు చార్జీల మోత

- ఏకంగా 20% మేర పెంపు?
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- కేఎస్ఆర్టీసీ చైర్మన్ శ్రీనివాస్
- గత నెల పెట్రోల్, డీజిల్‌పై పన్నును 4 శాతం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

**తుమకూరు/బెంగళూరు, నేటిదాత్రి:**

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సామాన్య ప్రజలపై మరో భారం పడనున్నది. రాష్ట్రంలో త్వరలో బస్సు చార్జీలు భారీ స్థాయిలో పెరుగనున్నాయి. దీనిపై కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(కేఎస్ఆర్టీసీ) చైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ప్రభుత్వ బస్సుల్లో చార్జీల పెంపు అనేది అనివార్యమని ఆయన పేర్కొన్నారు. బస్సు చార్జీలను 15-20 పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేఎస్ఆర్టీసీ ఇప్పటికే ప్రతిపాదనలు పంపిందని వెల్లడించారు. 'రెండు రోజుల క్రితం మా బోర్డు సమావేశం జరిగింది. బస్సు చార్జీలను 15-20 పెంచాలని మేం ప్రతిపాదనలు పంపాం. మిగతాది సీఎం సిద్ధరామయ్య విచక్షణపై ఆధారపడి ఉంటుంది. కేఎస్ఆర్టీసీ మనుగడ సాగించాలంటే, చార్జీల పెంపు తప్పనిసరి' శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇంధన, బస్సుల విడి పరికరాల ధరలు పెరిగాయని చెప్పారు. 2019 నుంచి రాష్ట్రంలో చార్జీల పెంపు లేదని, అదేవిధంగా కేఎస్ఆర్టీసీ ఉద్యోగుల వేతనాల సవరణ కూడా 2020 నుంచి జరుగలేదని, కాబట్టి టికెట్ ధరలను పెంచడం అవసరమని చెప్పుకొచ్చారు. గత మూడు నెలల కాలంలో కార్పొరేషన్‌కు రూ.295 కోట్ల నష్టం వచ్చిందని వెల్లడించారు.

### గత ఏడాదిలో పన్నుల మోత

ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల మోత మోగిస్తున్నది. వివిధ రకాల పన్నులు, ఇతరత్రా రూపాల్లో సామాన్యుడి జేబును గుల్ల చేస్తున్నది. ఇప్పటికే గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్‌ను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను దాదాపు 4 శాతం చొప్పున పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. మరోవైపు పాల ధరలను కూడా లీటర్, అర లీటర్ ప్యాకెట్లపై రూ.2 చొప్పున కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పెంచిన విషయం తెలిసిందే.

### గ్యారెంటీలకు అడ్డంగా కోతలు

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐదు గ్యారెంటీల ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టింది. ఆ గ్యారెంటీలను అమలు చేయాలంటే వేలాది కోట్ల రూపాయలు అవసరం. అయితే నిధుల అందుబాటును పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా హామీలిచ్చేసిన కాంగ్రెస్.. అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్యారెంటీలకు ఆంక్షలు, కోతలతో ఎగనామం పెడుతున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశారని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలుజోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్‌లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.



# అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ గే!



**వాషింగ్టన్, నేటిదాత్రి:**

అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ గే అని తాజా డాక్యుమెంటరీ చెప్తున్నది. 'లవర్ ఆఫ్ మెన్ : ది అన్‌టోల్డ్ హిస్టరీ ఆఫ్ అబ్రహం లింకన్' పేరుతో రూపొందించిన ఈ డాక్యుమెంటరీలో పురుషులతో లింకన్ రొమాంటిక్ రిలేషన్‌షిప్స్ గురించి వివరించారు. ప్రముఖ లింకన్ స్కాలర్స్ చెప్పిన విషయాలు, ఇప్పటి వరకు బయటపడని ఫొటోలు, లేఖలు వంటివాటి ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. హార్వర్డ్, కొలంబియా తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలకు చెందిన చరిత్రకారుల ఇంటర్వ్యూలు ఈ డాక్యుమెంటరీలో ఉన్నాయి. సెక్సువల్ నియమాలు 19వ శతాబ్దంలో ఎలా ఉండేవి? ఇప్పుడు ఎలా ఉన్నాయి? వాటి మధ్య తేడాలు ఏమిటి? అనే అంశాలను దీనిలో వివరించారు.






# ప్రభాస్ కొత్త సినిమాకు క్రేజీ టైటిల్?

'కల్కి 2898ఏడీ'తో వెయ్యికోట్ల మైలు రాయిని దాటేసి, రికార్డుల్ని వేటాడే పనిలో ఉన్నారు ప్రభాస్. వసూళ్ల పరంగా ఇంకా 'కల్కి' స్పీడులోనే ఉంది. మరి ఈ వేటకు పుల్‌స్టాప్ ఎక్కడ పడుతుందో తెలియాలి. ఇదిలావుంటే.. ప్రభాస్ తాజా సినిమాకు సంబంధించిన క్రేజ్ అప్‌డేట్ ఒకటి ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. 'సీతారామం'ఫేం అను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ ఓ చిత్రం చేయనున్న విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్ అనుకుంటునట్టు తెలుస్తున్నది. ఫౌజీ అంటే సైనికుడు అని అర్థం. ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారట. అందుకే ఈ టైటిల్ బావుంటుందని బృందం భావిస్తున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో దర్శకుడు అను రాఘవపూడి ఈ సినిమాను తెరకెక్కించనున్నారట. బ్రిటీష్‌వారి సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారట. ఇందులో కథానాయికగా మృణాళ్‌ఠాకూర్ ఖరారైనట్టు వార్తలు వస్తున్నాయి. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు బాణీలు సమకూరుస్తున్నారు.



# సూర్య కంగువ మ్యూజికల్ ప్రమోషన్స్ టైం

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కాంపౌండ్ నుంచి వస్తోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ సూర్య 42 ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రానికి శివ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ మూవీ అక్టోబర్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇదిలా ఉంటే కంగువ మ్యూజికల్ ప్రమోషన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానుల కోసం ఇంట్రెస్టింగ్ వార్త బయటకు వచ్చింది. కంగువ ఫస్ట్ సింగిల్‌ను సూర్య బర్త్ డే సందర్భంగా లాంచ్ చేసేందుకు రెడీ అవుతున్నారు మేకర్స్. తాజా టాక్ ప్రకారం జులై 23న సాంగ్ లాంచ్ ఉండబోతున్నట్టు తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి దీనిపై అధికారిక ప్రకటనరావాల్సి ఉంది. ఇదే నిజమైతే సూర్య అభిమానులకు కావాల్సిన అన్ని ఎలిమెంట్స్‌తో సాంగ్ ఉండటం పక్కా అని అర్థమవుతోంది. కంగువ రెండు పార్టులుగా రాబోతుందని ఇప్పటికే నిర్మాత కేఈ జ్ఞానవేళ్ రాజా వెల్లడించారని తెలిసిందే. తాము పార్టు 1, పార్టు 2 కోసం కథ రాశామని.. కొన్ని ఎక్జయిటింగ్ ఎలిమెంట్స్ ప్రేక్షకులు పార్టు 2ను ఫాలో అయ్యేలా చేస్తాయని చెప్పి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. కంగువ గ్లింప్స్ వీడియో, పోస్టర్లు ఇప్పటికే సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో బాబీ డియోల్ ఉధిరన్ పాత్రలో నటిస్తున్నాడు. కంగువను స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. 10 భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. 3డీ ఫార్మాట్‌లో కూడా సందడి చేయనుంది కంగువ. ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో పాపులర్ టాలీవుడ్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేస్తోంది.

# స్వరాలవేటలో విశ్వంభరం



ఒకప్పుడు సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ అంటే ఓం పండుగలా జరిగేది. సంగీత దర్శకుడు, గీత రచయిత, దర్శకుడు, నిర్మాత, గాయనీగాయకులు, హీరో.. ఇలా అందరూ కూర్చొని ఒకరి అభిప్రాయాలను ఒకరు పంచుకుంటూ మంచి ఆల్బమ్ వచ్చే వరకూ కసరత్తులు చేసేవారు. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. సంగీతం, సాహిత్యం అన్నీ ఫోన్లలోనే వినడం, ఫోన్లోనే ఓకే చేయడం. అయితే.. 'విశ్వంభర' టీమ్ ఈ పద్ధతికి ఫుల్‌స్టాప్ పెట్టి, పాత విధానానికి శ్రీకారం చుట్టింది. బెంగళూరులోని కీరవాణి ఫామ్‌హౌస్‌లో చిరంజీవి, కీరవాణి, దర్శకుడు వశిష్ఠ, గీత రచయిత చంద్రబోస్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ అంతా కలిసి మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చుని అద్భుతమైన ఆల్బమ్‌ని రాబట్టేందుకు కృషి చేస్తున్నారు. షూటింగ్‌కి బ్రేక్ రావడంతో ఈ సమయాన్ని మ్యూజిక్ సిట్టింగ్స్ కోసం వాడుకుంటున్నారు మూవీ టీమ్. వారంరోజుల పాటు వీరంతా అక్కడే ఉండి 'విశ్వంభర' పాటల పనిపట్టి తిరిగొస్తారట. చిరంజీవి నటించిన ఘరానామొగుడు, ఆపద్బాంధవుడు, ఎస్పీ పరశురామ్ చిత్రాలకు కీరవాణి స్వరాలందించారు. మ్యూజికల్‌గా మూడు సినిమాలూ ఆకట్టుకున్నాయి. 'విశ్వంభర' నాలుగో సినిమా. ఎలాగైనా మంచి పాటలు ఇవ్వడానికి కీరవాణి మనసుపెట్టి పనిచేస్తున్నారు. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 10న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

# ముంబైలో సుధీర్ బాబు టీం ల్యాండింగ్..!



టాలీవుడ్ యాక్టర్ సుధీర్ బాబు జ్ఞానసాగర్ ద్వారకా డైరెక్షన్‌లో నటించిన హరోంహర రీసెంట్‌గా థియేటర్లలో విడుదలైన విషయం తెలిసిందే. హరోంహర ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహాలో ఇవాళ సాయంత్రం 5 గంటల నుంచి కూడా స్ట్రీమింగ్ కానుంది. కాగా మరోవైపు సుధీర్ బాబు పాన్ ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో సాగే సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌కు సంతకం చేశాడని తెలిసిందే. తాజాగా కొత్త సినిమాకు సంబంధించిన వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం చిత్రీకరణ కోసం సుధీర్ బాబు అండ్ టీం ముంబైలోని ల్యాండింగ్ అయింది. సుధీర్ బాబు 19వ సినిమాగా రాబోతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు సమాచారం. వెంకట్ కల్యాణ్ (డెబ్యూ)

# ఎక్కడుందో క్యాప్షన్‌తో హింట్ ఇచ్చేసిందా..?

నాలుగు పదుల వయస్సు దాటినా.. ఆ ఛాయలేమి కనిపించకుండా యంగ్ హీరోయిన్లకు గట్టి పోటీనిస్తున్న భామల్లో ఒకరు త్రిష ఈ చెన్నై చంద్రం ప్రస్తుతం మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవితో విశ్వంభర సినిమా చే స్తుంది. మరోవైపు తమిళంలో అజిత్ కుమార్ నటిస్తోన్న విదాముయార్చిలో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా త్రిష ఓ సెల్ఫీని ఎక్స్‌లో షేర్ చేసింది. ఈ ఫొటోకు ఉకియో అని క్యాప్షన్ ఇచ్చింది. ఇంతకీ త్రిష ఈ క్యాప్షన్‌తో ఏం చెప్పిందని ఆరా తీస్తున్నారు. ఉకియో జపనీస్ పదం.. ఉకియో అంటే తేలియాడే ప్రపంచం.. (ఫ్లోటింగ్ వరల్డ్) అని అర్థం. త్రిష తాజా సెల్ఫీతో తాను జపాన్‌లో ఉన్నానని చెప్పకనే చెబుతుందని అర్థమవుతోంది. మరి త్రిష ఏదైనా సినిమా షూటింగ్‌లో ఉందా..? అనేది తెలియాల్సి ఉంది.



# అందుకే ఒళ్లు దగ్గరపెట్టుకొని చేస్తున్నానన్న జాన్వీ!

అంబానీ ఇంట పెళ్లివేడుకలో బంగారంలా మెరిసిపోయింది జాన్వీకపూర్. అక్కడ అందరి దృష్టీ ఈ అందాలభామ పైనే. బంగారు రంగు డ్రెస్‌లో జాన్వీని చూసిన వారంతా కళ్లు తిప్పుకోలేకపోయారట. ఇదిలావుంటే.. ఇటీవల ముంబాయ్‌లోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న జాన్వీ.. ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో టాలీవుడ్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. "దేవర-1' టాలీవుడ్‌లో నా తొలి సినిమా. అమ్మమ్మ తెలుగు. అమ్మ ఎక్కువ సినిమాలు చేసింది కూడా తెలుగులోనే. అందుకే.. కొత్తగా ఏం అనిపించలేదు. అప్పుడప్పుడు అమ్మ చుట్టాలతో తెలుగులో మాట్లాడుతుంటే చూసేదాన్ని. అందుకే తెలుగులో డైలాగులు చెప్పడం కష్టం అనిపించలేదు. సెట్‌లో అందరూ నన్ను ప్రత్యేకంగా చూడటం.. వయసులో చిన్నదాన్ని అయినా గౌరవించడం.. ఇవన్నీ మొదట్లో కాస్త ఇబ్బంది అనిపించింది. తర్వాత అర్థమైంది.. అదంతా అమ్మ ప్రభావం అని. తెలుగువాళ్లు అమ్మను ఎంత గౌరవిస్తారో, ఎంత ఆరాధిస్తారో సెట్‌లో నాకిస్తున్న గౌరవం చెప్పకనే చెబుతోంది. తెలుగులో తారక్ నా తొలి హీరో కావడం నిజంగా ఆనందంగా ఉంది. తను గొప్ప నటుడు. అందుకే ఒళ్లు దగ్గర పెట్టుకొని చేస్తున్నా. రామ్‌చరణ్ సినిమా ఇంకా మొదలవ్వలేదు. తనతో నటించేరోజు కోసం ఎదురుచూస్తున్నా. టాలీవుడ్‌లో మంచి అవకాశాలొస్తే వదులుకోను. ఎందుకంట అది నా మదర్ ఇండస్ట్రీ.' అని ఆనందం వెలిబుచ్చింది జాన్వీకపూర్.



# క్రేజీ టాక్

## రవితేజతో ఊర్వశి రౌటేలా రొమాన్స్..!

వాల్తేరు వీరయ్య, ఏజెంట్, బ్రో, స్కంద సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ మెరిసింది బాలీవుడ్ భామ ఊర్వశి రౌటేలా ఈ భామ తొలిసారి టాలీవుడ్ క్రేజీ ప్రాజెక్ట్ ఎన్‌బీకే 109లో తొలిసారి ఫీ మేల్ లీడ్ రోల్‌లో కూడా నటిస్తోంది. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ సెట్స్‌పై ఉండగానే ఊర్వశి రౌటేలా తెలుగులో మరో సినిమాకు సంతకం చేసిందన్న వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ భామ కొత్త ప్రాజెక్ట్ బాబీ డైరెక్షన్‌లోనే చేయబోతుందన్న వార్త ఒకటి నెట్టింట షికారు చేస్తోంది. జమాస్ మహారాజా రవితేజ ప్రజల మనిషి టైటిల్‌తో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సైన్ చేశాడని ఇప్పటికే ఓ అప్‌డేట్ తెరపైకి వచ్చిందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ హై ఓల్టేజ్ ఎంటర్‌టైనర్‌లో ఇద్దరు హీరోయిన్లు ఉండనుండగా.. ఊర్వశి రౌటేలా వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో కనిపించబోతుందని ఫిలింనగర్ సర్కిల్ టాక్. ఇక మరో భామ డింపుల్ హయతి కూడా రవితేజ పక్కన మరోసారి మెరవనుంది. లీడింగ్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కించనున్న ఈ మూవీ 2024 చివరలో సెట్స్‌పైకి వెళ్లనుందని తెలుస్తోంది. రవితేజ ప్రస్తుతం హరీష్ శంకర్ డైరెక్షన్‌లో మిస్టర్ బచ్చన్ సినిమా చేస్తున్నాడు. ఆర్‌సీ 75వ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన సితార్ సాంగ్ నెట్టింట మంచి స్పందన రాబట్టుకుంటోంది.






# దటీజ్ సిఎం. చంద్రబాబు నాయుడు అంటున్న "అనిమిని రవినాయుడు" నెల రోజుల పాలనపై అందించిన అద్భుతమైన విశ్లేషణ ఆయన మాటల్లోనే...

**అధికారంలోకి వచ్చిన మరునాటి నుంచే తన పాలన మొదలు పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి రోజే 16,347 పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ వేసి ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేర్చారు.**

ఉమ్మడి రాష్ట్రంలో కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అనేక సార్లు డిఎస్సీ వేసి, కొన్ని లక్షల మంది ఉపాధ్యాలతో ప్రభుత్వ విద్యను పేదలకు దరి చేర్చిన పాలకుడు చంద్రబాబు. అప్పట్లోనే ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 45వేల ఖాళీలతో 1997లో మెగా డీఎస్సీ వేసి ప్రభుత్వ విద్యపై ఆయనకు వున్న మక్కువను తెలియజేశారు. ఉమ్మడి రాష్ట్రంలోని అనేక అప్పర్ ప్రైమరీ స్కూళ్లన్నింటినీ హైస్కూళు గా మార్చిన ఘనత చంద్రబాబు నాయుడిది. అంతే కాదు ఏకోపాధ్యాయ పాఠశాల స్థానంలో ప్రైమరీ స్కూళ్లుగా అప్ గ్రేడ్ చేసి పల్లెల్లో విద్యా వికాసాన్ని నింపిన పాలకుడు చంద్రబాబు నాయుడు. పేదలకు విద్యను చేరువ చేయడంలో ఆయన పోషించిన పాత్ర ఎవరూ పోషించలేదని చెప్పాలి. ఇక ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంతకు ముందు నెల ఫించన్‌తోపాటు, ప్రస్తుత నెల పించన్ కూడా కలిపి రూ.7వేల రూపాయలు అందజేయడంతో ప్రజల్లో నెలకొన్న ఆనందం అంతా ఇంతా కాదు. అవ్వా, తాతలు ఆ డబ్బులను చూపిస్తూ మురిసిపోయారు. తమ ఆకలికి, ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది వుండదన్న సంతోషం వారిలో వెల్లివిరిసింది. చంద్రబాబును తెలుగు నేల వేనోళ్ల కొనియాడింది. అదే సమయంలో దివ్యాంగులకు పెన్షన్ రెట్టింపు చేస్తామనిచెప్పారు. రూ.6000వేలు అందించారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారానే ఇంటి వద్దకు వెళ్లి పించన్లు పంపిణీ చేయించారు. ఇక ఏపి రాజకీయాల్లోనే ఒక సంచలనం నమోదు చేశారు. గత ప్రభుత్వంలో ఇసకను బంగారంగా అమ్ముకున్నారు. ప్రజలను దోచుకున్నారు. మాఫీగా మారి ఇసుకాసురుల అవతారమెత్తారు. ప్రజలకు ప్రకృతి ఇచ్చిన వరంలాంటి ఇసుకను ఉచితంగా ఇస్తామని ఎన్నికల సమయంలో వాగ్ధానం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తున్నారు. దాంతో ప్రజలు సంతోషానికి అంతులేదు. ఎందుకంటే ఇసుక ఉచితంగా ఇవ్వడం మూలంగా పేద ప్రజలు కూడా ఏదైనా నిర్మాణం చేసుకోవాలంటే కూడ ఎంతో మేలు జరుగుతుంది. గతంలో ఒక లారీ ఇసుక కొనుగోలు చేయాలంటే కనీసం రూ.70వేల వరకు ఖర్చయ్యేది. కాని ఇప్పుడు కనీసం పది వేల రూపాయలు కూడా కావడం లేదు. ఆ ఖర్చు కూడా ట్రాన్స్‌పోర్టు కోసమే తప్ప ప్రభుత్వానికి ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

**ఇక తెలుగు ప్రజలు ఎప్పుడూ ఆకలితో అలమటించొద్దన్న గొప్ప ఆలోచనతో గతంలోనే ఎన్టీఆర్ క్యాంటీన్‌లను ఏర్పాటు చేసి, పేదలకు కేవలం ఐదు రూపాయలకు నాణ్యమైన భోజనం పెట్టిన నాయకుడు చంద్రబాబు.**

గత ప్రభుత్వం పేద ప్రజలు కడుపునిండా అన్నం కూడా తిననివ్వకుండా నోటి కాడి ముద్ద లాగేసుకొని పాపం చేశారు. అందుకే పాపం పండింది. వైసీపి ఘోరంగా ఓడింది. మళ్లీ చంద్రన్న రాజ్యంవచ్చింది. ఆగష్టు నుంచి 15 నుంచి మళ్లీ రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల సేవలు అందుబాటులోకి రానున్నాయి. పేద వారి ఆకలి తీరనున్నది. అన్న క్యాంటీన్లలో ఒక్క పూట కాదు ఉదయం టిఫిన్‌తో మొదలు, మధ్యాహ్నం భోజనం, రాత్రి కూడా భోజనాన్ని అందించడం విశేషం. అంత గొప్ప కార్యక్రమం మళ్లీ రాష్ట్రంలో ఎప్పుడు మొదలౌతుందా? అని ప్రజలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో గంజాయి అన్న పదం వినపడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. డ్రగ్స్ అనే మాటే ఏపిలో వినిపించకుండా చేస్తున్నారు. వాటి కట్టడికి గట్టి చర్యలు తీసుకునేందుకు అధికారులకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఇక ఎర్రచందనం అక్రమ రవాణతో పాలకులే దోచుకోవడం గత ఐదేళ్లలో చూశాం. ఎర్రచందనాన్ని ఎవరు అక్రమ రవాణా చేసినా ఉక్కుపాదంతో అణిచివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇక అన్నింటికన్నా ముఖ్యమైనది రాజధాని అమరావతి నిర్మాణం పనులు మళ్లీ మొదలయ్యాయి. ఇప్పుడు రాజధాని అమరావతి ప్రాంతం వెలుగులతో వెలిగిపోతోంది. మళ్లీ సోమవారం పోలవరం వచ్చింది. పోలవరం పూర్తికి అవసరమైన పనులు మళ్లీ మొదలయ్యాయి. ఎన్నికల ముందు చెప్పినట్టుగానే స్కిల్ సెన్సెస్ కూడా మొదలైంది. ఇది దేశంలోనే సంచలనమని చెప్పకతప్పదు. ఏ కుటుంబంలో ఎంత మంది విద్యావంతులున్నారు. వారు చదివిన చదవేమిటి? వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలన్నది నిర్ణయించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే బృహత్తరమైన కార్యక్రమం ప్రపంచంలోనే ఎక్కడా చేసి వుండరు. అందుకే చంద్రబాబు నాయకుడును విజన్ లీడర్ అంటారు. విజనరీకి పర్యాయ పదం చంద్రబాబు అని కొనియాడుతారు. తల్లికి వందనం మార్గదర్శకాలు విడుదల చేశారు. ఎంత మంది వుంటే అంత మంది పిల్లకు తల్లికి వందనం అమలుకు శ్రీకారంచుట్టారు. ఇక వైసిపి కొరివితో తలగోక్కున్నట్లు చేసిన పట్టాదారు పుస్తకాల స్థానంలో రాజముద్రతో కూడిన పుస్తకాలు అందజేసే కార్యక్రమం త్వరలో మొదలు కానున్నది. పట్టి సీమ నుంచి మళ్లీ కృష్ణా డెల్టాకి నీరు అందించే క్యార్యక్రమం మొదలౌతోంది. ఇక చంద్రబాబునాయుడు అడుగు పెట్టడంతోనే భోగా పురం ఎయిర్‌పోర్టుకు మళ్లీ కళొచ్చింది. ఎయిర్ పోర్టును సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు 2026లోగా ఎయిర్ పోర్టు పనులు పూర్తి కావలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తిరుమలలో ప్రక్షాళన మొదలైంది. భక్తులకు సౌకర్యాలు పెరిగాయి.

**మళ్లీ తిరుమలలో ఆహ్లాదకరమైన ఆద్యాత్మిక వాతావరణం నెలకొన్నది.**

అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు ప్రతిపానలను కేంద్రం అంగీకరించింది. ఒక్కసారిగా అమరావతి ప్రాంతానికి కళొచ్చింది. యుద్ధ ప్రాతిపదికన పనులు కూడా మొదలౌతున్నాయి. జీతాలు ఎప్పుడొస్తాయా? అని ఎదురు చూసే ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు అందించారు. వారికి మళ్లీ పాత రోజులు గుర్తు చేశారు. ఐదేళ్లుగా నీటి విడుదల లేక అల్లాడిన పిఠాపురానికి అవసరమైన నీళ్ల కోసం పురుషోత్తమ పట్నం నీళ్లు అందించారు. ఇంటర్ విద్యార్ధులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం జరిగింది. అపరిష్కృతంగా వున్న విభజన సమస్యలపై కూడ అడుగులు ముందుకు పడ్డాయి. నిత్యావస వస్తువుల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజలు కొనియాడుతున్నారు. ఇకపై దళారుల దోపిడీ వుండదు. ప్రభుత్వం తక్కువ ధరకు సరుకులు అందించడం గొప్ప శుభపరిణామం. ఇతంటి గొప్ప నిర్ణయాలు తీసుకున్న చంద్రబాబు నాయుడు మరో గొప్ప పనిచేశారు. తెలుగుదేశం పార్టీలో కాళ్లు మొక్కే సంస్కృతి వుండొద్దని ఆదేశాలు జారీచేశారు. మనం ప్రజలకు సేవకులమే అన్నారు. అందుకు ఎవరూ ఏ నాయకుడి కాళ్లు మొక్కొద్దని చెప్పారు. ఎవరైనా తన కాళ్లు మొక్కితే మళ్లీ నేను మొక్కుతా అనడంతో అందరూ ఆశ్యర్యపోయారు. చంద్రబాబుకు జేజేలు పలికారు. అదీ చంద్రబాబు నాయుడు అంటే....

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H.No. 7-1-133/3, Opp.New Bus Stand, Laxmipuram,Hanamkonda, Warangal Urban-506001. Telangana State. & Published from, H.No 7-1-133/3. Opp New Bus Stand, Laxmipuram, Hanamkonda, Warangal Urban-506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. AP TEL 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999